ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక



4 అణాలు

17-8-'55

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక


సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 48
సంచిక 50
17.8-55

మన్మథ శ్రావణ బహుళ అమావాస్య బుధవారం


శాంతి మహానగరం: హిరోషిమా



1945 ఆగస్టు 6-వ తేదీ ఉదయం హిరోషిమానగరంలో ఏటంబాంబు పేలినచోటు. ఇక్కడ వారి శ్రామిక ప్రచారమందిరాన్ని ఆనాటి దుర్ఘటనకు చిహ్నంగా మరమ్మతు చెయ్యకుండా ఉంచేశారు. మందిరానికి 750 మీటర్ల ఎత్తున బాంబు పేల్చబడింది.

(3, 4, 5 పేజీలలో మరికొన్ని చిత్రాలు)

విషయానుక్రమణిక




ఏటంబాంబు ప్రయోగంవల్ల మరణించిన వేలాది ప్రజలస్మృతికి చిహ్నం. ఇక్కడే పీస్‌పార్క్ (శాంతి ఉద్యానవనం) నిర్మించబడుతున్నది.

శాంతి మహానగరం హిరోషిమా

1945 ఆగస్టు 6 సోమవారం ఉదయం 8 గంటల 15 నిమిషాలకు హిరోషిమా నగరం పైన (జపాన్) మొట్టమొదటి ఏటంబాంబు పేలింది. ఆ ఒక్క క్షణంలో అనేక వేల మంది నగరవాసులు దుర్మరణం పాలైనారు. ఆక్షణంతోనే ప్రపంచ మానవచరిత్రలో ఒక నూత్నయుగం - అణుమహాశక్తియుగం ప్రారంభమయింది.

నిరాయుధులైన నగరవాసులపైన ఇంతటి ఘోరప్రతీకారం ఎన్నడూ చరిత్రలో కని విని ఎరుగనట్టిది. నాలుగులక్షలమంది నివసించే మహానగరంలో నూరింట 90 పాళ్లు క్షణంలో దగ్ధమై పోయింది.

మారణహోమంతో ప్రారంభమైన ఈ క్రొత్త యుగంలో మానవుని ప్రతిభాచిహ్నమైన ఈ మహాశక్తిని మారణహోమానికిగాక మాన



“మీ ఆత్మలకు శాంతి లభించాలని మా ప్రార్థన. ఈ దోషాల కింక తావుండరాదు”—స్మారకచిహ్నంపై వాక్యాలు.






ఏటంబాంబు వ్యాపింపచేసిన వేడిమిలో కరిగి ముద్దయిన బొత్తాములు, సీసాలు, పెంకులు మొదలైనవి.


శాంతిమహానగం: హిరోషిమా

వునిసౌభాగ్యానికి వినియోగించడానికి పదేళ్లి నేడు శాస్త్రజ్ఞులు, వివిధదేశాల ప్రభుత్వాలూ కృషి ప్రారంభించాయి. జెనీవాలో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో భారతప్రతినిధి డా॥ భాభా అధ్యక్షత క్రింద సకలదేశాల శాస్త్రజ్ఞులూ సమావేశమౌతున్నారు. వివిధరాజ్యాలమధ్య వివాదాలను పరిష్కరించడానికి యుద్ధాలు సాధనాలు కాజాలవని అన్ని రాజ్యాల ప్రభుత్వాలూ అంగీకరిస్తున్నాయి. కాని యుద్ధాలను నివారించడానికి అసాధారణమైన కృషి అవసరమౌతున్నది. శాస్త్రజ్ఞుల ప్రతిభతో రాజకీయవేత్తల ప్రతిభ తులతూగినప్పుడు తప్ప ఈ కృషి సఫలంకాదు. కాని హిరోషిమా నాగసాకీ నగరాలలో మానవునికి జరిగిన మహోపచారాన్ని రాజకీయవేత్తలు విస్మరించనంతవరకూ కృషి సఫలం కాగల అవకాశాలున్నాయి. ★

రేడియేషన్‌కి గురై కాలినవీపు.



మందిర ముఖద్వారంవద్ద స్మృతిచిహ్నం. "హిరోషిమావంటిదారుణాలింక సంభవించరాదు" అని హిరోషిమా కల్చరల్ ఎసోసియేషన్ ప్రార్థిస్తున్నట్లు ఇందులో సూచించబడింది.



ఏటంబాంబు ప్రయోగంవల్ల మనుష్యులకు కలిగే అనర్థకాలను పరిశోధించే సంస్థ.

దైవోపహతుడు

శ్రీయని వెన్నెల హాయిని గొల్పుతూ వుంది. మల్లెపూవులాంటి పాన్పుమీద శ్రీకాంతుడిలా శయనించి వున్నాడు - కాంతారావు, తాలూకాఆఫీసులో గుమస్తా. తెల్లవారఝాము 6 గంటలు అయింది టయిము. చంద్రుడు పడమటదిశకు వోరగా జారిపోతూ లేకిరణాలతో కాంతారావు నిద్రని తనిఖీ చేస్తూవున్నాడు. వాస్తవానికి తెల్లవారితే యీ పరగణాలలో వుద్దండుడుగా పరిగణింపబడే గండభేరుండంలాంటి కలక్టరు ఆఫీసు తనిఖీ చేసేరోజు. అవవలసిన పరీక్షలన్నీ అయినవనిపించుకొని ప్రమోషనుకై ఎదురుచూస్తున్న వ్యక్తి కాంతారావు. ఈ రెండురోజులూ వళ్లు విరిచి పని చేస్తే ఆ అదృష్టం అందుబాటు కావచ్చు. అదృష్టం చెప్పి రాదు. కాని అవకాశం వుపయోగించుకుంటే అదృష్టంగురించి పిదప ఆలోచించుకోవచ్చునేది కాంతారావు తత్వం. తనకు యీలోగా కొత్తగా పుట్టుకవచ్చే తెలివితేటలు యేవీ లేవు. ఉన్న తెలివి పోయేదికాదు. అయినా తాను మరువాడు గెలుపొందటం పరిసరపరిస్థితులపై ఆధారపడి వుంటుంది.

అందువల్ల రాత్రి పడుకునేముందే నిజభార్య కనకమ్మతో ఆమె తెల్లవారకముందే లేచి చేయవలసిన పనులు జాబితా వప్పజెప్పటమే కాకుండా తను 8 గంటలుదాటే లోపే ఆఫీసుకు చేరుకోవటంలో గల ప్రాముఖ్యంగురించి స్పష్టంగా చెప్పేసి అన్నాడు-

"ఆరింటికల్లా స్నానం కావాలి. ఆపైన 7 గంటలకల్లా కాఫీ టిఫెను అవుతేగాని ఆఫీసుకు టయిములోపల చేరుకోలేను. కాస్త వుషార్గా చేస్తివా చాలు" అని గట్టి సూచనలు యిచ్చాడు. ఇందులో విడ్డూరం ఏవుందీ - కాంతారావుది బొత్తిగా నియమనిబంధనలకు లోబడి గోడ గడియారంవలె సాగిపోతున్న జీవితం. మామూలుగా అతను పదకొండు గంటలకు రెండుమూడు నిముషాలు ముందుగానే ఆఫీసుకు చేరుకుంటాడు. ఎలవెన్సుబిల్లు దగ్గిర్నుంచీ ఆన్యువల్ రిపోర్టులదాకా సర్వమూ తన ప్రజ్ఞవల్లే అవుతున్నాయని అనుకుంటూవుంటాడు కాంతారావు... అనుకోవటమే కాక వీలయినంతమందితో అతను ముందు యీ విషయం ప్రస్తావించిగాని మరొకటి మాట్లాడడు. ఇంతకీ ఇంతటి ముఖ్యమైన రోజున కార్యక్రమం సక్రమంగా కొనసాగటంపైనే కాక, తృప్తిగా ప్రారంభం అవటంపయిన కూడా ఆధారపడి

గొల్లపూడి కేశవరావు

వుంటుంది గనకనే కాంతారావు ఆరోజు వేడినీళ్ల స్నానంతోనూ వేడి వుషార్ కాఫీలతోనూ మొదలుపెట్టి దిగ్విజయంగా పూర్తి చేసుకువద్దామని అనుకున్నాడు. దీనికి వినాయకుడి విఘ్నం ఎక్కడ కలిగింది అంటే అతని కాంతామణి భర్తకు "యిడ్లీ" అంటే యిష్టంగదా అనే సదుద్దేశంతో మినపపప్పు నానబోసి అట్టె పెట్టింది. మరిన్ని వుషార్ చెయ్యమన్న భర్తకు యిష్టమైన యిడ్లీన్లు పెడితే ఆయన ఇంకా ఎంతగా సంతోషిస్తాడో, సదరు యిడ్లీ ఆనాటి ఫలహారంచేసే సమయంలోనే చూడవచ్చుగదా అని ఆమె ఏతద్విషయాన్ని అతి గోప్యంగా వుంచింది.

ఆరీతిగా కాంతారావు క్షీరసాగరంలా వెన్నెల విరగబడిపోతూ వుండగా శయ్యపై నిద్రపోతూవున్న సమయంలో కనకం కేకేసింది—

"ఏవండోయ్...మిమ్మల్నే" అని.

కాంతారావు కదలలేదు.

"మిమ్మల్నే...లేవండీ" స్థాయి కొంచెం హెచ్చించింది కనకం.

కాంతారావు ఒత్తిగిలి పడుకున్నాడు.

"అబ్బ లేవండీ...ఛంపకా."

తారకస్థాయిలోకి గొంతు పోవటమే కాక సమయానికి తగ్గ చిరాకూ విసుగూ స్పష్టంగా ఆ గొంతులో స్ఫురించాయి.

కాంతారావు కదలకుండానే "ఊఁ" అని మటుకు అన్నాడు కళ్లు తెరవకుండానే.

"ఆ దక్షాన వున్న కోక యిలా పారెయ్యండీ" అన్నది కనకం. ఈ మాటలు తారకమంత్రంలా పనిచేశాయి. కాంతారావుకు గల బద్ధకమూ, నిద్రపోవాలనే కోరికా, చీల్చుకొని అతని చెవిని దూరాయి. కాంతారావు యీమారు పూరాగా కళ్లు తెరవటమే కాకుండా పక్కమీద లేచి కూర్చుని తిన్నగా కనకమ్మవంక చూశాడు.

పటేనుంచానికి పది అడుగులదూరంలో గోడవానుకొని నిలబడివుంది కనకం. కాంతారావు మనస్సు శతధా శకలమైంది. అతగాడి ప్రాణం వుసూరుమన్నది. అతను గతరాత్రి కట్టుకున్న గాలిమేడలు సర్వస్వమూ కూలిపోయాయి. ఆడబ్రతుకుమీద తిరిగి రోత కలిగింది.

"నీకున్న తెగులే యిది ఇదుగో ప్రాణం పోతోందిఅంటే అదుగో వెలపటవున్నానూ అంటావు! వెధవబతుకు వెధవబతుకని" ఈ విధమైన నిందమోపి కాంతారావు మనస్సు కష్టపెట్టుకున్నాడు. కాంతారావు అప్పటికే క్రిమినలు కేషు ప్యాసుచేసినప్పటికీ కనకంకు యీ మెన్సెస్‌లో మెన్సరియా లేదని తోచలేదు. అవును ఎల్లా తోస్తుంది. తండ్రి తద్దినమునీ, ఓపంటగా పబ్బమునీ, యినస్పెక్షనీ లేకుండా వేళకి వెలుపల వుంటుంది కనకం. ఒకసారయితే పొరపాటు అనుకోవచ్చుగాని నిత్యసత్యమైన యీ విషయం కాదనుకోవటానికికూడా వీలుగాకుండా పోతూవుండె మరి. అయినా యిప్పుడు చూసేరాదూ ... అయిదురోజులు ముందుగానే యీ అఘాయిత్యం...యిహ ఏమనుకుని ప్రయోజనమేమిటి. ఇందుకు కనకం బాధ్యురాలు కాకపోవచ్చు కాని తనకు అపచారం జరిగినవ్యక్తి ఆపరిస్థితుల్లో యితరులు తనమీద ద్వేషంతో వ్యవహరిస్తున్నారని అనుమానించటం సహజం. కాంతారావు చదువుకున్నవాడు ... విజ్ఞుడు. కాబట్టి వెంటనే సర్దుకుని అన్నాడు......

"టయిము ఎంత అయిందో చూడు."

కనకం సావిట్లోకి మెడచాచి అన్నది.

"మూడుగంటలు పైన...పది నిముషాలు"

"అయితే నిన్నటిలోనే వైళ్ళు" అన్నాడు కాంతారావు అనుమానిస్తూ.

కనకం యీనాటి విరగబడే నాగరికతగల

కొత్త సీరియల్

"దావాగ్ని"

రచయిత : జి. సి. రామకృష్ణ

కొత్త పరిస్థితులను సమన్వయించుకోలేక, రాజకీయాలవల్ల లభించిన స్వాతంత్ర్యాన్ని సక్రమమైన మార్గంలో వినియోగించుకోలేక, గాంధి మహాత్ముడు బోధించిన కనీస మానవ ధర్మాలను కార్యరూపంలో సాధించడానికై సతమతమవుతున్న పల్లె ప్రాంతాల నేటి ప్రజల జీవనానికి ప్రతిబింబం ఈ నవల. 31-8-1955 తేదీ మొదలు ఆంధ్రవారపత్రికలో సీరియల్‌గా ప్రచురించబడనున్న ఈ చిన్న నవలను ఆంధ్ర పాఠకలోకం ఆదరిస్తుందని మా విశ్వాసం.

—సంపాదకుడు

మనిషి కాదు. ఆమె గారి తాతగారు గొప్ప ఆహితాగ్ని పరుడు. తండ్రి రెండుపూటలా సంధ్యావందనం పూర్తి చేసుకొని గాని అన్నం ముట్టడు. తల్లి మహాలక్ష్మి కాసంత కుంకం పెట్టుకొని తులసిపూజ చెయ్యందే పచ్చి మంచినీళ్ళన్నా పుచ్చుకోని యిల్లాలు. అటువంటి అగ్నిలాంటి సంసారంలో మేలిమికనకంలా యీ కనకం అగ్నిపరీక్షలో కడతేరి యీనాటికీ నాగరికుడైన కాంతారావును చేపట్టింది.

"అవ్వ... మూడుగంటలు దాటితే నిన్నటిలోనే లెక్క అంటారేవిటి" అంటూ కనకం గడ్డాన చెయ్యిఆన్చి ఆవులిస్తూ ఆశ్చర్యపోయింది

"అవును నిన్నటిలోనే జమ" అన్నాడు బి. కాం. పాసయిన కాంతారావు.

"కానే కాదు. పన్నెండు దాటితే రేపులోనే లెక్క" దబాయించింది కనకం.

"నీ తెలివి తెల్లారినట్టే వుంది. తెల్లారితే గాని రేపులోకి రాదు."

"మరయితే మూడుగంటలబండికి వెళ్ళవలసినప్పుడెల్లా మొహం కడుక్కునేటప్పుడు రెందుకని మీరు?" అని ప్రశ్నించింది వెర్రిబాగుల కనకం. కాంతారావు క్షణం ఆలోచించి అన్నాడు

"దానికేమీ రైల్వే లెక్క ప్రకారం పగలు వొంటిగంటని పదమూడుగంట అంటారు. పిడుక్కీ బియ్యానికీ వొకటే మంత్రమూ యేమిటి" కనకం భర్తతో వాదించటం కష్టమనుకుందోయేమో గాని—

"అబ్బ, నంపక పడుకోండి బాబూ... దద్దెనిద్దర వస్తోంది" అన్నది ఆవలిస్తూ.

"ఆ! మరేవి... అప్పుడే రేపయితే ఇంకా నిద్దరపోవటం ఎందుకూ" సూటిగా ప్రశ్నించాడు కాంతారావు.

రేపటినిద్దర యినాళ్ళపోవటం కనకానికి విచిత్రంగానే తోచింది.

కనకానికి యిందులో ఎవ్వంత సత్యం స్ఫురించింది. అయినా ఆమె అంతరాంతరంలో కొంత సందేహం అట్టే వుండిపోయింది.

"సరే లెండి తెల్లవారగానే సూరమ్మత్తను కనుక్కుంటాను"... అన్నది. ఈ భేతాళ సమస్య మధ్యవర్తుల ద్వారా తేలటానికైతే అతను సుముఖుడే గాని ఆపని సూరమ్మగారిద్వారా జరిగితే అతనికి అన్యాయం జరగవచ్చునే అనుమానం వుండటంవల్ల యీ రాజీబేరానికి అతను వప్పుకోలేదు.

ఇంతలో జనతా ఎక్స్‌ప్రెస్ కూత వీనుల విందుగా వినిపించింది

"అదుగో అప్పుడే నాలుగయింది."

"నీళ్ళుపొయ్యి అంటించుకోండి" అన్నది నవ్వుతూ కనకం

కాంతారావు వళ్ళు భగభగ మండిపోయింది.

"ఇంకా నిద్రలేక నవ్వులో గాలి కూడాను మన ప్రయోజకత్వానికి సాకేం పోయి హోల్లో తాపతాను. నీ అదవ నువ్వూ పడు" అన్నాడు నిష్కర్షగా.

"మరి పాపాలు పండగ్లో" అని అర్ధోక్తిలో ఆగింది కనకం.

"హోటలునుంచి తెప్పించుకుందు లేను" అన్నాడు మొహమాటం యిసుమంతా లేకుండా కాంతారావు.

కనకం కష్టసుఖాలు తెలిసినది అవటంవల్ల భర్త యింత నిక్కచ్చిగానూ కచ్చితంగానూ మాట్లాడటానికి కారణం ఎంచి చింతించింది.

"మావయ్యగారిదాన్ని యిలా చూస్తున్నాను. పోనీ చూస్తున్నా వాళ్ళ కంకరం చేత సరస్వతికి కబురు చేస్తాను."

"ఎవరికీ సరస్వతి కొ... ఆ టక్కులాడి మన గుమ్మం తొక్కకేం. నువ్వు గాబట్టి సిగ్గూ ఎగ్గూ విడిచి నా గుమ్మం ఎక్కుతావు" అన్నాడు కాంతారావు.

సరస్వతి వరుసగా కనకానికి పినతల్లి కూతురే అవుతు. ఆమె భర్త పి. డబ్ల్యు. డి. లో సూపర్‌వైజరు చేస్తూవున్నాడు. సరస్వతి దృష్టిలో తన భర్త మాంగాపు వుద్యోగి అనీ తనేమో ఆయనగారి భాగ్యవతి అనీ అహంభావం వుంది. దానికి తగ్గట్టు ఆమెభర్త సర్వేశ్వరరావు కాంతారావు ఎదుటపడ్డా పూర్వసుఖుడై నడచిపోవటం

★ దైవోపహతుడు ★

కద్దు. అసలు అటువంటివాళ్లని చూస్తే కాంతారావుకు తగని వళ్లుమంట. తెలివి తేటలలోనూ, సమయస్ఫూర్తిలోనూ తను ఎవ్వరికీ తీసికట్టుకాదు. పోగా ఎవరినీ దేహీ అని యాచించకుండా తన బతుకేమో తను బతుకుతున్నాడు. ఒక్క తన పైఅధికారులు తప్ప - తనను మరి యెవ్వరు నీచంగా చూచినా సహించలేడు ... సహించడు! అవకాశంలేక తను యింకా యిలా వున్నాడు గాని, ఆరోజే వస్తే తనూ తాశీల్దారు కావచ్చు. డిప్టీకలక్టరూ అవవచ్చు. ఉత్తి బి. ఎ.లు పాసుఅయిన కలక్టర్లు ఎంత మంది లేరు. ఇంతోటి సూపరువైజరు చేస్తూ శ్రద్ధమైన గడ్డికరిచి నాలుగుపరకలు కూడ బెట్టిన కారణాన అతగాడికో అధికారిననే అహం వుండుగాక! ఆ సరస్వతికి తనపతి పెద్దపైయెత్తు మనిషిగా కనపడితే కనపడు గాక! అంతమాత్రాన యితరుల్ని అవమానం చేస్తామంటే యీరోజుల్లో ఎవరూరుకుంటూరు? ఎందుకు వూరుకోవాలి?

"సరే.... మొన్న వాళ్లయింట్లో అవుసరం వచ్చినప్పుడు నేను పోలేదా! అయిన వాళ్లయిన తరువాత కాస్త ఆసరా అవటం ఎక్కడన్నా వుంది" అంది కనకం.

"ఇదుగో నేను చెప్పేది చెప్పాను... పరాభవం కలగాలంటే పోయి అడుగు" అన్నాడు కాంతారావు గంభీరంగా.

"ఇందులో పరాభవమేవుందీ - అయినా వాళ్ల సంగతీ తెలుస్తుంది - రాదేం, ఎందుకు రాదో చూస్తాను" అన్నది కనకం తీక్షణంగా.

కాంతారావు మరిమాట్లాడలేదు. అరిగించేసుకోలేనివాళ్ళకి అనుభవమే అసలైన మందు అంటాడు, కాంతారావు. పోగా యీసారి యీ పరాభవం జరిగితేగాని యీమె వాళ్లు పిలిచినప్పుడల్లా వాళ్ల ఇంటికి వంటలక్కలా పోవటం మానదు. తను యెన్నిసార్లు ఆమెకు చెప్పాడు - అల్లా అడగ్గానే వెడితే ఎంత అలుసు అవుతామో తెలుసా అని. అయితే కనకం అనేదిగదా - "అది నా పిన్నమ్మ కూతురు. దానింటికి వెడితే తప్పేముందీ." అని.

"అమ్మా తలుపు తియ్యి" అనే కేకతో పాటు తలుపు తట్టిన చప్పుడు విని కనకం ఒక్క గంతునపోయి తలుపు తెరిచింది - తెరుస్తూనే అరిచింది.

"అదుగో మా అమ్మా నాన్నా వచ్చారండీ" అని -

"ఆ...మీ అమ్మా" అంటూనే వెంటనే పెదవి నొక్కుకున్నాడు కాంతారావు. ఆపైన సావిట్లోకి వచ్చి మామగారిని పలకరించాడు. "జనతాలో వచ్చారా" అని.

మామగారు బండీవాడినెత్తినుంచి ట్రంకు దింపుతూ అన్నారు -

"అవునోయ్ - ఖులాసాయేనా" అని. ఈలోపలే కనకంవంక చూసి తల్లి మహాలక్ష్మి అన్నది -

"అమ్మాయికి నీళ్లెప్పుడో" అని భర్తవంక చూస్తూ. వాకిట వున్నవాళ్ళతో మాట్లాడకూడదనే నియమంవుంది మహాలక్ష్మికి.

కనకంపని యిరకాటంలో పడ్డది. ఇవాళ్లేనంటే కాంతారావు ఆగ్రహించవచ్చు. నిన్ననటానికా ఆత్మహత్య చేసుకోవటం అవుతుంది. అయినా అమ్మ వచ్చిందిగదా అనే ధీమాతో అన్నది-

"తెల్లవారుఝాము మూడింటికి - "

కాంతారావు యింతకీ యిప్పుడీవిషయం అంతగా పట్టించుకోలేదు. అత్తగారిరాకతో యీ సమస్యకు అంతం చిక్కింది.

ఒక్కక్షణం పూర్వం అతను నిరాశావాది. ఇప్పుడతను నిక్షేపంగా ఆశావాది. ఇప్పుడు కటికచీకటిలో దారితోచక దిసులుపడే నావికుడికి లైటుహవుసు దీపం కనపడ్డట్లు తనకు ఆశాజ్యోతి అత్తగారు అవుపడ్డది. అత్తగారి రాకను యిదివరలో ఎన్నడూ కాంతారావు యింతగా హర్షించలేదు. అయితే యిది కాకతాళీయమా, కాక పరాత్పరుడు అనేవాడు పైన ఒకడు వుండి యిల్లా తోలుబొమ్మలు ఆడిస్తాడా? సరిగ్గా సమయానికి కనకం వెలపల వున్నప్పుడు అతనికి కొంచెంగా భగవంతుడిమీద కూడా కోపం కలిగింది. ఇత్తిరి అత్తగారు ఆదుకోవటంతో ఆ ఆగ్రహం తగ్గి భగవానుడు కేవలం కరుణాస్వరూపుడని భక్తపరమాణువులపాలిటి కల్పవృక్షమనిన్నీ; యీనాడు అత్తగారి రాకలో తనకు తెలియని భగవత్ప్రేరణ వుండి వుండాలి అనీ అనుకున్నాడు కాంతారావు.

అవతల అత్తగారు ఎవర్నో అడుగుతూంది—

"ఇక్కడ మిషను ఆసుపత్రిలో ముసలి దొరసాని ఒకామె వుండాలి వున్నదో బదిలీ అయిపోయిందో." ఆ ప్రశ్నకు వచ్చిన జవాబు వినకుండానే కాంతారావు ముఖ ప్రక్షాళనార్థం అరుగెక్కాడు.

"అదేమిటే నాన్నా!..వుత్తరం పత్తరం రాయకుండా వచ్చారు."

"ఏమమ్మా రాయటానికి వ్యవధి వుంటేనా. పదండి పదండి అని వకటే గోల మీ అమ్మ..అదేనే వెనకటి రోగమే.. కడుపునొప్పి—యిప్పుడు తప్పితే మళ్ళీ నెలదాకా పిలుండదుగదా అని" అన్నాడు కనకం తండ్రి.

కనకం యీ మాటలు విని లోలోపలే కుంగిపోయింది. అమ్మేది కొకమానదుగదా అనే మొండిధైర్యంతో వ్యవహారం చెడి రాక పూర్వమే వస్తువుపోవటం మేలు అనుకొన్నది ఆమె.

"అమ్మ వచ్చిందనేసరికి అల్లుడుగారికి యేనుగెక్కినంత పనైంది. ఇవాళ ఆయన గారికి యినస్పెక్షనట. నేను యిల్లా తగలడేసరికి జంబేలుపడిపోయారు. సరేగాని ముందు అమ్మని నీళ్ళపొయ్యి అంటించమనండి" అంది కనకం.

కాంతారావు నిత్యకృత్యాలు తీర్చుకొని దొడ్లోకి స్నాననిమిత్తం వచ్చేసరికి తెల తెలవారుతూంది. అల్లుడికి నీళ్ళతోడి మహాలక్ష్మమ్మ మినపపప్పు కడిగి పొట్టుతీసేస్తూంది. కనకమ్మ దొడ్లో నూరు కింద కూర్చుని తల్లికి అవసరమయిన సహకారం ,అల్లంతదూరాన నిలబడి చేస్తూనే వుందిగాని ఆమెగారు వాకిట వున్నవాళ్ళతో మాట్లాడని కొరతగాని కనకమ్మ భర్త నుద్దేశించి అన్నది—

"ఏమండోయ్ పాత్రం పడమటింటిలో వుంది. అమ్మని తెచ్చుకోమనండి"

కాంతారావు మొహాన సబ్బునురగ వదిలించుకొని అటుపక్కగా మాశాడు. అత్తగారు మినపపప్పు చూరుబుట్టలోపోసి వంటగదిలోకి పాత్రం నిమిత్తం పోతూవుంది.

"సరి...యీతద్దినంకూడా దేనికి. వుప్పు చాలన్నాగా?" అని అడిగాడు కాంతారావు.

అందుకు జవాబుగా కనకమ్మ నవ్వింది. ఆపైన అన్నది—

"వెధవఉప్మా తగని వేకండీ .... నాలుగు యిడ్లెన్న తిన్నారా దండీగా వుండగలదు."

తనపై భార్యకు వున్న అభిమానానికి కాంతారావుకు తగని సంతోషం కలిగింది. తను అనవసరంగా కోపపడ్డాడుగాని భార్యకి, జరిగిన అఘాయిత్యానికి జత కూర్చటం శుద్ధ అవివేకం. తన సుఖంకోసం కనకం మనస్సులో ఎంత కోరుకొంటూ వుందో యిందుమూలంగా తనకు తెలిసింది.

అటువంటి యిల్లాలిని తను యితఃపూర్వం ఆగ్రహావేశంతో అనేకమాటలు అన్నాడు. ఆవేశంతో తను అల్లా అన్నాడుగాని నిజానికి భారతస్త్రీల యీఓర్పూ, పతిభక్తీమీద తనకు యెంతో అభిమానం వున్నది. "క్షమయా ధరిత్రీ" అనేవాక్కు ఏ కవి వాక్కో చెప్పాడోగాని అందులో అవగింజంతైనా అసత్యంలేదు. వాస్తవానికి స్త్రీ తన సంతోషాన్నీ సుఖాన్నీ చివరికి తన సర్వస్వాన్నీ యిటు కట్టుకున్న భర్తకూ అటు కన్న కనూ

★ దైవోపహతుడు ★

షుషికి అర్పణచేసే త్యాగమూర్తి.

కాంతారావు స్నానం పూర్తిచేసుకొని పావిట్లోకి పోయి మావగారితో ముచ్చట లాడుతూ కూర్చున్నాడు. ఇంతలోనే పడి పోయినట్లుగాకనకమ్మ దక్కొ వచ్చిఅన్నది.

"నాన్నా...అమ్మని అవాళ్ళే తీసుకు వెళ్ళిచూపు...ఆస్పత్రిలో."

ఆయన అల్లుడితో మాట్లాడుతూవున్న వర్తమాన రాజకీయాలు నిలుపుదలచేసి -

"ఏవీ...మీ అమ్మకు మళ్ళీ నొప్పి వచ్చిందా" అన్నాడు.

అవునన్నట్లుగా తల వూపింది కనకం. మహాలక్ష్మమ్మగారు కడుపులో శూలతో చాలరోజులుగా బాధపడుతూవుంది.

డాక్టర్లు పరీక్ష చేయాలంటే వెలపటవుంటే సమయం మంచిదని చెప్పటంవల్ల ఆమె గారిని వెంటపెట్టుకొని మిషన్ ఆస్పత్రిలో చూపించేనిమిత్తం తీసుకువచ్చాడు.

కాంతారావు చింతాదృష్టులతో కనకం వేపు చూశాడు. ఈసారి కాంతారావుకు అత్తగారిమీదకాకుండా నదనదీద్వీపవనా న్వితమైన ఆంధ్రరాజ్యంలోవున్న ఆడవా ళ్ళందరిమీదా కోపమేకాకుండా సహ్యం కాని అసహ్యంకూడా కలిగింది. భార్య కనకమ్మను కొబట్టి హోటలునుంచి తెప్పిం చుకోమని గదమాయించాడు. ఇప్పుడు ఒక రికి యిద్దరవటంతో అసలువ్యవహారం ఎదురు తిరిగింది. ఇటుచూస్తే అప్పుడే ఆరుదాటి అరగంట అయింది.

కాంతుడు కాంతారావు యీవిధంగా దిగ్భ్రాంతుడై వుండటం గమనించి కనకం తండ్రితో అన్నది -

"నాన్నా అటుపోయి రుబ్బురోలుమీద పీట బోర్లించిరండి. ఇంతలో నేను పోయి వాళ్ల శంకరం చేతన్నా సరస్వతికి ఖబురు చేస్తానూ -?

"మీ మంగపిన్ని కూతురికా-" అంటూనే తండ్రి దగ్గుకుంటూ లోపలికి పోయాడు.

శంకరంకు అర్ధణాడబ్బులు యిస్తానని కనకం ఆశ చూపినా వాడు లంచాలకు ఆశించే రకం కాకపోవటంవల్లనో మరెందుచేతనోగాని కాంతారావు బాబయ్య వాహనం—సైకిలు, యిప్పిస్తేగాని కదలనని హఠయోగం వేసుకు కూర్చోవటంవల్ల భార్యగారి బలవంతంమైన కాంతారావు తన సైకిలు శంకరంగాడి హస్తార్పణంచేసి వూరు కున్నాడు.

శంకరానికి అయిదు నిముషాలు పైగా తరిఫీదు యిచ్చింది కనకం—ఏవిధంగా సర స్వతితో ప్రస్తావించవలసినదీనూ.

"శంకరం...ఒరే మా నాయనగాదూ - యిదుగో మీ పెద్దమ్మ కూడా వచ్చిందనీ, ఆవిడా వాకిట వుందనీ చెప్పు .. పెద్దమ్మకి కడుపులో నొప్పిటా పైగా నిన్ను చూడా లని వుందిటా అని చెప్పు."

కనీసం తనమీదగల అనురాగంవల్ల కాక పోతేమానె, పెద్దమ్మఎదుట యిల్లా ప్రవ ర్తించటం మంచిదికాదనే వుద్దేశంతో సైనా సరస్వతి వస్తుందని కనకం వూహ. అసలు యిప్పుడు ఎవరో ఒకరు చేతికి ఆసరా అవటం అవసరంగాని ఆవిడ అందని ద్రాని పండని అనుకుంటే పనులెల్లా అవుతాయి.

"ఇన్నిమాటలు చెప్పాలా అత్తా... క్షణంలో రానూ...." అంటూ కాలవిలం బనం సహించలేని శంకరం అట్టే సైకిలు ఎక్కి యిట్టే మాయమైపోయాడు.

కనకానికి క్షణం ఓ యుగంలా వుంది. ఇంట్లో సర్దుకువచ్చేవాళ్లు లేకపోయే సరికి యిల్లంతా లంకలాగు తయారు అయింది. ఎక్కడి పనులు అక్కడ పడి మూలుగుతు న్నాయి. పాచిమనిషికి అంటగిన్నెలు వేసుకోవటం మొదలుగాగల చిల్లరపనులన్నీ కాంతారావు భుజస్కంధాలమీద పడ్డాయి. అతనేమో మహా విసుగ్గా వున్నాడు. తండ్రిగారు ఓ పక్క కుర్చీలో కూర్చుని తగని ఆయాసపడిపోతున్నాడు. అసలే ఆయనకు వుబ్బసం వుంది. ఆపైన పది దాటితే ఆగలేడు ఆయన. ఇటు చూస్తే తల్లి ముట్టుగదిలో పడుకుని మూలుగుతూవుంది. తెరలు తెరలుగా నొప్పి పుట్టుకువచ్చి ఆమేమో మెలితిరిగిపోతూవుంది. బంగారం లాంటి సంసారం క్షణంలో నరకకూపం అయింది.

కాంతారావు సిగరెట్లు తగలేస్తూ కాలు గాలిన పిల్లిలా తిరుగుతున్నాడు—మావు లన్నీ గడియారంమీదే పెట్టుకొని. క్షణ క్షణానికి అతని మనస్సులో ఆరాటం అధిక మవుతూంది. ఇంట్లో వక్క కనకమే వున్న ట్లయితే అతను విదలించుకు బయటపడే వాడు. ఒకపక్క అత్తగారి మూలుగులూ మావగారి దగ్గూ అతని కాళ్ళకి బందాలు వేసి మనస్సును బాధిస్తూ వున్నాయి. అసలు యిటువంటివి ఎందుకు జరుగుతాయీ? చివ రికి తనబోటి ఒకళ్ళ జోలీ శొంఠీ లేని తాలూకా ఆఫీసు గుమాస్తాలమీద భగవం తుడు ఆగ్రహపడటం ఆయనగారు కారణం లేని వైరం పూనటమేగదా. తన పిచ్చిగాని ప్రతిపనికీ దేవుడితో ముడిపెట్టట మేమిటి. అదీగాక ఆ దేముడికి యీ ఎల్లా యీ పుల్లాయిగాళ్ల దిన జీవితంలో పానకంలో పుడకలా ప్రత్యక్షమవటమనే తెగులు వుంటుందా. అది అల్లా జరగాల్సి వచ్చి జరిగింది. ముందు ఏది ఎల్లా జరగాలో అల్లా జరుగుతుంది. అందుకు తన బుఱ్ఱ బద్దలు కొట్టుకొని లాభం లేదు.

తను యీరోజు ఆఫీసుకు ఆలస్యంగా వెళ్లటంలో యేమీ అర్థం వుండదు. అదీగాక తను ఎదురుచూస్తున్న అవకాశం చేజేతులా జారవిడుచుకున్నట్లు అవుతుంది. ఇహ తన జీవితమంతా యిలాగే గడపాల్సి రావచ్చు. ఒక్కరోజు - యీరోజు తన యీ ఆలస్యం...యిందులో బుద్ధిపూర్వకమైన లోపం లేకపోతేనేమి - తన జీవిత మహో దయానికి వెంటనే రాహువులాగా అడ్డుపడ వచ్చు. పోనీ విదిలించుకు లేచిపోదామా అంటే వెధవ అభిమానమూ, గౌరవమూ అడ్డుతగులుతున్నాయి. ఒక్కొక్కప్పుడు మొండిధైర్యంతో లోకులకు జడవకుండా వ్యవహరిస్తేనేగాని ఫాయిదావుండనప్పుడు, తగలడ్డ సంస్కరణ అడ్డుతగిలి బాధిస్తుంది.. అయినా వాళ్లు ఏమనుకుంటారూ... మన మానానికి మనల్ని కృష్ణలో దిగమని వదిలేసి తను దులుపుకు లేచిపోయాడూ అంటారు. అంతేగాని తను పడేతిప్పలు వాళ్ళకేమి తెలుస్తుంది. తను యిప్పుడు యేమి చెయ్యాలీ - ఏది వదులుకోవాలీ...

కింకర్తవ్యతామూఢుడై కాంతారావు యేమి చేయాలో తేల్చుకోకముందే శంకరం తిరిగి వచ్చాడు.

"ఏమన్నది...సరస్వతి...వస్తానన్నదా?"

అని ఆత్రంతో అడిగింది కనకం. శంకరం చొక్కా గుండీలు వదులుచేసుకుంటూ అన్నాడు.

"అసలు ఆవిడ కనపడనే లేదు. వాళ్ళ పెద్దమ్మాయి వొచ్చి...మరేమోనటా-వాళ్ళమ్మకి జెరం వచ్చిందనీ ... వాళ్ళ నాన్న కేంపుకు వెళ్లారనీ చెప్పింది."

కనకం ఎంతో చిన్నబుచ్చుకొంది. కాంతారావు తలయెత్తి కనకంవంక చూసి నిర్వికారంగా అన్నీ వదిలేసిన సన్యాసి పుంగవునిలాగు కూర్చుండిపోయాడు.

"ఆ....జ్వరం లేదు నా తలకాయా లేదు.... నిన్న నేగదా పిడిరాయిలాగా వరలక్ష్మమ్మ యింటికి పేరంటానికి వచ్చింది. ఎగ్గొట్టటానికి యిదో పన్నాగం" అన్నది కనకం.

మరో పరిస్థితుల్లో అయితే ఆమెని తనివితీరా వేళాకోళం చేసివుండేవాడు అతను. అతనిలో యీ సమయంలో ఆశక్తి క్షీణించిపోయింది.

కాంతారావు బుఱ్ఱ వేడెక్కిపోతూ వుంది. మనిషి పరిస్థితులకి ఎంతవరకూ లొంగిపోవచ్చునో అతను అంతవరకూ లొంగిపోయాడు. ఒక స్థితికి వచ్చేసరికి ఎంతటి సహృదయుడైనా హద్దుమీరితే ఎదురు తిరుగుతాడు...చివరికి దేవుడికైనా సరే. అంతదాకా దేనికి, అన్ని మార్గాలూ దుర్గమం కాగానే భయపడి పరుగెత్తే పిల్లి, తరుముతున్న కుక్కమీదికే లంఘించటమూ ఆశునకము వెనకకితిరిగిపలాయనం చేయటమూ జరిగే విషయమే కదా. సహనశక్తికి కూడా ఓమితి వుంది. ఆ పరిమితి దాటితే పిరికిపంద లాంటి ధైర్యసుడు యీ విశ్వంలో వుండడు. అదేవిధంగా అలుగుటయే ఎరుంగని మహామహితాత్ముడు కాంతారావే కోపగించాడు ఆనాడు. కాంతారావు యింత కోపగించుకోవటమూ ఎవరిమీదా అంటే, అది నిర్ణయించి చెప్పటం చిక్కే. ఇవిఅన్నీ యిల్లా కూడిరావటానికి కారణభూతు లెవ్వరో, ఏ అదృశ్యశక్తి తన్నిల్లా పరీక్ష చేస్తూ వుందో నిజానికి అతనికి అర్థం కాలేదు. అందువల్ల కాంతారావు యీ పరిస్థితుల్ని మొండి ధైర్యంతో చెండుకురావాలీ అనుకున్నాడు.

సిజరు సిగరెట్టుపెట్టీ, అగ్గిపెట్టా జేబులో పడుకొని కాంతారావు లేచాడు.

"ఏవండీ వంటమనిషన్నా దొరికినా బావుండును" అన్నది కనకం బయటికి పోబోతూవున్న పెనిమిటిని చూసి.

కాంతారావు కనకంవంక కోపంతో చూసి బయటికి నడిచాడు.

నడివీధిలో నిలబడి కాంతారావు ఒక్క క్షణంలో యేవిచేయాలో నిశ్చయించుకొని గబగబా కొత్తపేటవేపుకి నడిచాడు. తెలిసినవాళ్లని వాకబు చెయ్యగా బస్సుస్టాండుకి దక్షిణపుదిశలో ఓ పెద్ద మఱ్ఱివృక్షంవుందనీ, ఆ వృక్షం రాజాన్ని ఆనుకొని ఓ గొందివుందనీ ఆ గొందిలోకి పోయినట్లయితే ఎడమపక్క అయిదోగృహంలో మంగమ్మ అనే వోఆవిడ వంటపనులమీద రావటంకద్దు అనీ సమాచారం దొరికింది. రాక్షసుడి ఆయువుపట్టు కనుక్కునే నిమిత్తం కారడవులబడిపోయే రాజకుమారుడిలా కాంతారావు ఆ మఱ్ఱిచెట్టును వెదుక్కుంటూపోయి తదనంతరం పేదరాశి పెద్దమ్మవలె ఆ పూరికొంపలో నివసించే - మంగమ్మగారిని కలుసుకున్నాడు. ఆమె కాంతారావువంక పరీక్షగా చూసి "ఏవిపని నాయనా" అని అడిగింది.

కాంతారావు గుమాస్తాగా చెయ్యి తిరిగినవాడు అవచ్చుగాక కాని యిటువంటి వ్యవహారాలు నిపుణతతో సరిదిద్దుకురావటం అతనికి బొత్తిగా తెలియదు. ఏ మాట ఎప్పుడు చెప్పతగినదో, ఏ విషయం గోప్యంగా దాచుకోతగినదో ఆ సత్యసంధుడు కాంతారావుకు తెలియదు. పెద్దమ్మగారియొక్క మాటలతీపీ రూపురేఖావిలాసాదులూ చూడగానే అతనికి చచ్చిన ముసలమ్మ బతికి ఎదుట ప్రత్యక్షమయినట్టుగా అనిపించింది. సదరు పరిస్థితుల్లో తనకు సంభవించిన, సంభవింపనున్న యిక్కట్టుగములు తుములు తుములుగా ఎల్లా మీదపడుతున్నదీ వాటితాకిడికి తట్టుకోలేక యీ మంగమ్మగార నేమేరుపర్వతాన్ని ఆశ్రయించను వచ్చాడో చెప్పుకొని అన్నాడు:

"పిన్నిగారూ ... మీకు తప్పదు. కష్టసుఖాలు తెలిసినవారని మిమ్మల్ని యింతగా బతిమాలుకుంటున్నాను."

మంగమ్మగారు పిండారబోసినట్లుగా నవ్వింది. తల పంకించింది. జుట్టు ముడి వేసుకుంది. ఆ పైన కాంతారావువంక చింతాద్రుక్కులు పరిపింది.

"అయ్యో బాబూ వక్క క్షణం క్రిందరాలేకపోయావా. ఇప్పుడే మరొకరికి వప్పుకొని రెండురూపాయలు బయానాకూడా పుచ్చుకున్నాను" అన్నది కోరినంతవిచారం మొహంమీదకి తెచ్చుకొని.

కాంతారావు ఖిన్నుడైపోయాడు. పోనీ యీవిడ గాకపోతే యీవిడతలలో జేజెమ్మ యింకోకోతి దొరకదా అనుకునేవ్వారు కాదిది. వెరవ్వారు పూర్తిగా బస్తీకాదు పల్లెకాదు. ఏవయినాసరే యీవిడగార్ని తన తెలివితేటలవల్ల వప్పించి తీసుకుపోవటమే దిక్కు అనే నిర్ణయానికి వచ్చాడు కాంతారావు.

"మీ రుణంఅంటే ఎల్లా మంగమ్మగారూ-అవసరం కాబట్టి యింతగా అడుగుతున్నాను. పైగా యిది నాలుగురోజుల బేరమాయెను. మీరుకూడా ఆలోచించుకోండి" అన్నాడు అతను.

"మాటఅన్న తరవాత తప్పటం యెల్లాగా అని నాబాధ. - అమ్మ మంగమ్మతల్లీ యీ కార్యం నీ చేతిమీదుగా అవాలీ అని ఆ ప్లీడరుగారు ఒకటే గోలపెట్టి పోయారు. అయిదురూపాయలూ యిప్పుడే పుచ్చుకోమంటే......అహ మీదగ్గర ఎక్కడికి పోతుందీ రొండు యివ్వండి యిప్పటికని పుచ్చుకున్నాను" అంటూనే రొండినున్న రొండు రూపాయలూ చూపించి అన్నది మంగమ్మ.

"ఈతద్దినం ఎల్లా తప్పుకునేది నాయనా"

కాంతారావుకు వీలు చిక్కింది యీ సమయంలోనే. తన్ను మంగమ్మగారు సలహాయే అడగాలిగాని అందుకు ఆమెకు అంగీకారమయ్యే ప్రతిపాదన చూపటానికి తను సిద్ధపడేవచ్చాడు. అయినదేదో అవనే అయిందని పైపాట పాడి అన్నాడు—


"ఇదుగో పిన్నిగారూ! మూడు రోజులకీ యిరవై యిస్తాను కాదనక బయలుదేరండి. ఊఁ....ఇంకా సంకోచం దేనికి-" అంటూనే ఆవిడను మాట్లాడనివ్వకుండా

"ఇహ నాకు సమయంలేదు. మీకు యిదే చెప్పటం" అంటూనే అయిదు రూపాయల కాగితం ఆవిడముందుకు విసిరి అన్నాడు. "పాత పేటలోనే మా యిల్లు. కాంతారావుగారి యిల్లంటే ఎవరన్నా చెప్తారు."

మంగమ్మ మెత్తపడింది. ఎదురుగా ధనం చిందులు తొక్కుతూవుంటే ఎవరు వదిలి పెట్టగలరు చూస్తూ చూస్తూ.

"చూడు నాయనా. నువ్వేమో యింత ప్రాధేయపడుతున్నావు. ఆ ప్లీడరుగారితో ఏవి చెప్పేదా అని నా బాధ" అన్నది ఆమె. కాంతారావు నవ్వి సలహా ఇచ్చాడు!

"వెలపటి ండీ...మూడు రోజులదాకా మరి మాట్లాడించరూ" అని అంటూనే ఇంటిమొహం పట్టాడు. కాంతా



★ దైవోపహతుడు ★

రావు చేసిన నేరం కనకానికి అసలు నచ్చలేదు సరిగదా సరిపెట్టుకోక అన్నది—

"తగలపెట్టే వుంది. మూడునాళ్ల ముచ్చటకే యిరవై రూపాయలా."

కాంతారావుకు అరికాలిమంట నెత్తికెక్కింది. ఎదురుగా మావగారు వున్నారని కూడా ఆలోచించకుండా—

"చేసినదానికి వంకలు పెట్టటానికిఅయితే ప్రయోజకత్వం వెలగబెడతావు—అపళాన నోరు మూసుకో" అన్నాడు.

కాంతారావుతత్వం తెలిసిన కనకంమాట్లాడక వూరుకుంది. మరో అరగంటలో మంగమ్మగారు గంగమ్మలా దిగింది. క్షణంలో ఆవిడ వంటయిల్లంతా ఆకళింపు చేసుకుంది. ఆతరవాత కనకందగ్గరకి వచ్చి:

"ఏవమ్మా కోడలా - యిద్దెన్ని యిప్పుడెక్కడ అవుతాయి. మధ్యాన్నానికి రొట్టెలు కాలుస్తాను" అన్నది లొట్టలు మింగుతూ.

అప్పటికే తొమ్మిదికావటంవల్ల కనకం అంది.

"ముందు త్వరగా వంట తెమల్చండి. ఆ తరవాత. సంగతి ఆలోచిద్దాము."

అయిదునిముషాల్లో స్నానం ముగించింది మంగమ్మ. మరోపది నిముషాల్లో పొయ్యి రెండుకుంపట్లూ రాజేసింది. ఆపైన నాలుగు చేతులు కలదానిలా చకచకా పని ముగించుకవచ్చి పదిగంటల పదిహేనునిముషాల కల్లా వండి వార్చేయటమే కాకుండా కాంతారావుకూ బంధు సందోహానికీ నవ గాయలతోటి అన్నం పెట్టేసి అన్నది—

"ఇదో లెక్కా నాయనా... పెళ్ళిళ్ళల్లో గుండిగలు తిప్పేస్తుంటే మారాజు చచ్చి స్వర్గానవున్నాడు వియ్యన్న కలకటేరు..."

"అమ్మా మంగమ్మతల్లీ మాఅమ్మ జ్ఞాపకం వచ్చిందమ్మా అనేవాడు."

కాంతారావుమామగారుమాత్రం నవ్వి అన్నాడు:

"అహ ... ఎందుకు రాదూ... ఆవిడా వంటలేచేసి కొడుక్కు చదువు చెప్పించిందట."

భోజనం పూర్తి చేసుకొని సైకిలు ఎక్కి పదిబారలు పోగానే వాహనం ఎందువల్లనో అనువుగా లేకపోవటం గుర్తించాడు కాంతారావు. దిగుతూనే చూచాడుగదా వెనక చక్రంలో గాలేలేదు. శంకరం గాడు దీనితో ఏవి ఫీట్సు చేశాడో గాని యిదీ అవసరానికి ఎదురుతిరిగింది. సైకిలు పక్కనే వున్న సైకిలుషాపులో యిచ్చేసి మరో అరణాలు దండగ పెట్టుకొని బాడుగ బండీ అధిరోహించి తాలూకా ఆఫీసు దిక్కుగా పయనమయ్యాడు కాంతారావు.

కాంతారావు ఆఫీసుకు చేరుకునేసరికి పదకొండుకి పదినిముషాలువుంది. సమయానికి చేరుకున్నానుగదా అని కాంతారావు మొహం విప్పారింది. A 4 అప్పారావును చూసి అడిగాడు:

"దొరగారు ఎన్నింటికి వస్తారుట"అని.

అప్పారావు అతనివంక ఆశ్చర్యంగా చూసి అన్నాడు.

"అదె నీకు తెలియనే లేదన్నమాట ప్రోగ్రాం వచ్చే నెలకి మార్చుకున్నారు."

"అకేం" అన్నాడు కాంతారావు సగం చచ్చిపోయి.

"ఏమోలు యీనెలలో వీలుకాలేదుట."

కాంతారావు దీర్ఘనిశ్వాసం అర్థం అప్పారావుకు తెలియలా. దానిలోని అంతరార్థం తృప్తో అసంతృప్తో కాంతారావే చెప్పాలి. సాయంత్రం ఆరుదాటిన తరువాత యింటికి చేరుకున్న కాంతారావుతో చెప్పింది కనకం.

"అదుగో ఆగదిలో వంశికంచంలో రొట్టెలు వున్నాయి. ఫ్లాస్కులో కాఫీ వుంది." అని.

కాంతారావు తెచ్చుకున్న రొట్టి ముక్కలు చూసి అన్నది—

"అసి దీని జిమ్మడా... మాడుచెక్కలు మిగిల్చి మంచివి కొడిని మూట కట్టుకు పోయింది."

ఆతరువాత కనకం తీరిగ్గా వంటలక్క మంగమ్మ చేసిన విధ్వంసం కథగా చెప్పి అన్నది.

"మధ్యాన్నం 12 గంటలకి తలంటుయేవిటంట దీని శ్రాద్ధం. వున్న శేరు కుంకుడ్లూ రుద్ది తగలేసింది. తను తీసుకుపోయిన రొట్టెలు నేతితోనే తగలేసుకున్నట్టుంది. నాకేమో అనుమానంగా వుంది."

కాంతారావు వంటయింటిలోకి పోయి చూచాడుగదా - అక్కడేముందీ, నేతి తెప్పాలా ఖాళీ అయివుంది. నువ్వులనూనె మందులోకికూడా మిగలనేలేదు. స్నానాల గదినిండా కుంకుళ్లు పొర్లాడుతున్నాయి. తను మొన్ననే కొన్న అరవీశెడు పంచదారా పౌనుకాఫీపొడీ అసలు కనపడనే లేదు. ఈ మహానరకం చూడలేక కాంతారావు త్వరలోనే బయటపడ్డాడు.

(49-వ పేజీ చూడండి)

సీరియల్

ఉదయకిరణాలు

పోతుకూచి సాంబశివరావు

20

పరంధామయ్య, మాణిక్యం కుటుంబాలలో విషాద సంఘటనలు, వారిద్దరి మధ్యా ఏర్పడిన విషమ పరిస్థితులు చూసిన అవధానికి భవిష్యత్తు అయోమయంగా కనిపించింది. ఈ పరిస్థితులలో ఆ రెండు కుటుంబాలను ఓదార్చి దగ్గరకు తీయకపోతే, అంతటితో అన్నా చెల్లెళ్ళమధ్య బంధుత్వాలు పూర్తిగా తెగ్రెంపులు కాగలవని వ్యధపడ్డాడు అవధాని. ఆ బాధ్యత తన మీద వేసుకున్నాడు.

డైరక్టరును బ్రతిమలాడి కాకినాడ బదిలీ చేయించుకున్నాడు.

మాణిక్యం ఇంట్లో దిగి, పెట్టె బెడ్డింగు పడేసి, తిన్నగా అన్నగారిదగ్గరకు వచ్చాడు అవధాని.

మూడు నెలలు సెలవు పెట్టి పరంధామయ్య విచారంతో యింట్లో కాలం గడుపుతున్నాడు.

'అన్నయ్యా!'

కుర్చీలో వాలి దుఃఖం మింగుకుంటూ ముద్దలా పడిఉన్న పరంధామయ్య పలకలేకపోయాడు.

'ఇన్ని కష్టాలు ఒక్కసారిగా వచ్చి మీద పడితే ఏ మనిషీ భరించలేడు. నిజమే. కాని జరిగినవి మరిచిపోవాలి. ముందు బ్రతుకుసంగతి చూసుకోవాలి.'

కన్నీరు తుడుచుకున్నాడు పరంధామయ్య. అంత దుఃఖంలోనూ ఆప్యాయం, సానుభూతి చూపించే మనిషి పరంధామయ్యకు ఇంతవరకూ కనిపించలేదు. తలెత్తి తమ్ముణ్ణి ఒకసారి చూసి ఏడ్చాడు.

ఆ ప్రయాణందుస్తులతోటే వదినెను, చామంతిని పరామర్శించాడు అవధాని. నిట్టూర్పులు విడుస్తూ మాణిక్యందగ్గరకు వచ్చాడు. మౌనంగా అన్నా చెల్లెల్లు ఒకరినొకరు చూసుకుని బాధతో తల దించుకున్నారు.

వృద్ధిలోకి రావలసిన పిల్లలమీద మృత్యువు చూపిన ప్రభావంవల్ల ఆ యిల్లు అంతా బిక్కుబిక్కుమంటూ కళ పోగొట్టుకుంది.

కాకినాడ వచ్చాక అవధాని తన కార్యక్రమాలు మార్చుకున్నాడు. రోజూ అన్న పరంధామయ్య దగ్గర కూర్చుని ప్రపంచ విషయాలు చర్చించేవాడు. ఇద్దరూ పిచ్చాపాటీ మాట్లాడుకునేవారు. పరంధామయ్యకి కొంత దుఃఖం ఉపశమించింది.

తన కూతురు మరణానికి సాంబు కారకుడని యుక్తాయుక్త విచక్షణజ్ఞానం నశించిన ఉద్రేకంలో తను చేసిన అల్లరికి పశ్చాత్తాపపడ్డాడు పరంధామయ్య. ఇప్పటికైనా అన్నగారికి పశ్చాత్తాపం కలిగిందని అవధాని సంతృప్తిపడ్డాడు. మనసు నిర్మలంగా ఉంచుకోలేక ఉద్రేకాలకు లొంగిపోతే అనేకమైన తప్పులు జరుగుతాయి.

తన తిట్లవల్ల తన కోపంవల్ల, అవమానపడి రోషంతో సాంబు లేచిపోయి ఉంటాడని కించపడ్డాడు పరంధామయ్య. చనిపోయిన కూతురు గురించి విచారించడం తప్ప చెయ్యవలసినది మరేమీ లేదు. ఒకవేళ సాంబు జీవంతోటే ఉంటే, అతడు యింటికి రావడంతో తన చెల్లెలు, తమ్ముడు అవధాని అయినా సంతోషిస్తారు. ఈ ఆశతో తనకు తోచిన ప్రయత్నం చేద్దామనుకున్నాడు పరంధామయ్య. తానెరిగిన స్నేహితులకు, బంధువులకు, ఉత్తరాలు వ్రాశాడు, సాంబు జాడ తెలిస్తే తక్షణం తెలియజెయ్యవలసిందని.

అవధాని తన జీవిత ఆశయాలు ఎంతవరకు సాఫల్యం పొందాయా అని నెమరువేసుకుంటున్నాడు. నరసింహం చనిపోయాక అతడి కుటుంబాన్ని వృద్ధికి తేవాలనే కాంక్షతో తన సంసార సౌఖ్యం త్యాగం చేసుకున్నాడు. ఈ ఏడేండ్లలో కుర్రాళ్ల చదువులు ఒక దరికి వచ్చినా, వారి భావాల్లో నడకల్లో, కుటుంబపరిస్థితుల్లో ఎన్నో విచిత్రమైన మార్పులు వచ్చాయి. సాంబు స్త్రీలోలుడై జీవితాన్ని నిర్లక్ష్యం చేసి అదో ఉపేక్షభావంతో లేచిపోయాడు. ప్రకాశం ప్రవర్తనలో కొంత తెలివి కనిపిస్తున్నా భావిజీవితం ఎల్లా గడుపుతాడో అన్నది చాలా అయోమయంగా ఉంది. అతని భావాల్లోని విప్లవానికి, అతనిలో విజృంభిస్తున్న వైరాగ్య దృక్పథానికి మధ్య ఎప్పుడు ఎవిధంగా సమన్వయం చేసుకోగలుగుతాడా అనేది జాగ్రత్తగా పరిశీలించాలి. ఉద్యోగంలో స్థిరపడినట్లు కనిపించదు. మద్రాసునగరంలో అతడు తెచ్చుకునే జీతం అతడికే చాలడం లేదు. కాంత పెండ్లి యింకా ఒక సమస్యగానే ఉంది. మాణిక్యం కుటుంబం నిరాధారంగా అస్థిరంగా ఏడేండ్ల క్రిందట అతని చేతుల్లోకి వచ్చిందో, ఇప్పుడు కూడా అదేవిధంగా ఉంది. వాళ్ళ కుటుంబానికి సహాయం చేయ్యాలనే త్యాగ భావం తనకున్నా కుటుంబ పరిస్థితులు ప్రశాంతంగా ఆనందకరంగా లేవనే అసంతృప్తి అవధానిని ఆవహించింది. పరిపరివిధాల ఆలోచిస్తూ వ్యథపడ్డాడు. తలనొప్పి వచ్చింది. ఏమీతోచక ఎదురుగా ఉన్న రేడియో త్రిప్పాడు అవధాని.

ఏవో పాటలు మధురంగా వినవస్తున్నాయి. కొన్ని నిమిషాలలో ఇలా వినపడింది.

"ఆలిండియా రేడియో...మద్రాసు.... స్వీయకవిత ..... ప్రణయమాధుర్యం..... ప్రకాశం"

అవధాని ఆశ్చర్యంతో చెవులు రిక్కించాడు. ప్రకాశం ఎవరు? మనవాడే? తదేకంగా విన్నాడు. ప్రకాశం గొంతు ... మధురమైనభాష ... వసంతాలు వెల్లివిరిసినట్లు ... గండుకోయిలలు గానం చేసినట్లు ... పండువెన్నెలలు ప్రాకినట్లు... అతనిమాటల్లో ... శబ్దాలన్యాసాల్లో ...అవధాని ఆనందభరితుడైనాడు. ఆగిపోయింది ప్రకాశం గొంతు. వివరాలు వినిపించింది రేడియో. ప్రకాశం రచనలు అప్పుడప్పుడు పత్రికల్లో కనిపించేవి...అవధాని ఆనందంతో ఉక్కిరిబిక్కిరై అభినందిస్తూ ఉత్తరం వ్రాశాడు.

జవాబు వస్తుందని ఆశిస్తూండగానే, ప్రకాశమే వచ్చేశాడు.

'ఏరా! యిలా హఠాత్తుగా వచ్చావు?'

'చెప్తాగా!' పెట్టె, బెడ్డింగు లోపల పెట్టించాడు ప్రకాశం.

'నా ఉత్తరం అందిందా?'

'ఆఁ'. అవధాని, ప్రకాశం, ఒకరినిచూసి ఒకరు ముసిముసినవ్వులు నవ్వుకున్నారు.

భోజనాదికాలు పూర్తి చేసుకుని, ప్రకాశం బడలిక తీర్చుకున్నాక అవధాని మళ్లీ అడిగాడు అదే ప్రశ్న.

ప్రకాశం ఆప్రశ్నకు సమాధానం చెబుతామనుకుంటూ ఉండగానే వకీలు వైకుంఠ

రావుగారు ఇంట్లోకి వచ్చారు. వచ్చిన పెద్దమనిషిని సగౌరవంగా ఆహ్వానించారు.

వైకుంఠరావుగారు ప్రకాశం వైపు చూశారు.

ఇయన్ని పరిచయం చేశాడు ప్రకాశం అవధానికి.

'ఇవేళ ప్రొద్దున్నే వచ్చేరనుకుంటా' ఏమనాలో సరిగా నిశ్చయించుకోలేక ప్రసంగం కదిపారు వైకుంఠరావుగారు.

అవునంటూ తల ఊపాడు ప్రకాశం.

'మీ మేనల్లుడికి మా అమ్మాయిని యిద్దామనుకుంటున్నానండి' అవధానిముఖంలోకి చూశారు వకీలుగారు.

ఒక్కసారి అవధానికి ఆశ్చర్యం కలిగినా గబుక్కున కమ్ముకున్నాడు, చిఱునవ్వుతో.

'మీ మేనల్లుడితో నాకు చాలారోజుల నుంచి పరిచయం ఉంది. అతని ప్రవర్తన, తెలివి, తేటలు నిజంగా నన్ను ఆకర్షించాయి.'

'నన్ను అనవసరంగాపొగుడుతున్నారు.' ప్రకాశం వకీలుగారివైపు చూశాడు మందహాసంతో.

'ఇందులో పొగడ్త ఏముందీ! నిజం చెప్పాను'

ఆయనకూడా ఒక చిఱునవ్వు విసిరారు.

ఒక నిమిషం నిశ్శబ్దం.

'ఒకసారి పిల్లను చూడమనండి. నచ్చితే తర్వాతవిషయాలు వివరంగా మాట్లాడుకోవచ్చు.'

'అల్లాగేనండి. పిల్లకు ఎన్నేళ్లుంటాయి?'

అవధానిపిల్లగురించి వివరాలు ఆరా తియ్యసాగాడు.

'పదిహేడేండ్లు ఉంటాయి. స్కూలు ఫైనలు పరీక్షకు వెడుతోంది!'

'మీకుపిల్లలు ఎంతమంది'

'ఒక అమ్మాయి. ఇద్దరు మగపిల్లలు. మగవాళ్లు అమ్మాయికంటె చిన్నవాళ్లే!'

కుటుంబాల పూర్వచరిత్రలు, పెద్దల పుట్టుపూర్వోత్తరాలు, బంధుత్వాల అల్లికలు, మొదలైనవన్నీ కులాసాగా మాట్లాడుకున్నారు అవధాని, వకీలుగారు. మర్నాడే వచ్చి పిల్లను చూస్తామని ప్రకాశం ఒప్పుదలపై అవధాని సమాధానం యిచ్చాడు.

'ఇదంతా ఏమిట'న్నట్లు అవధాని విస్తుపోయి ప్రకాశంవైపు చూశాడు.

'వైకుంఠరావుగారు నాకు ఉత్తరం వ్రాశారు పెళ్ళిగురించి...నాకూ యీమధ్య పెళ్ళి చేసుకోవాలనిపించింది ... పిల్లను చూడ్డానికి ఒప్పుకున్నాను.'

తలవంచుకుని మెల్లిగా చెప్పాడు ప్రకాశం.

చామంతి పెండ్లిఅయిన తర్వాత ఎన్నో సంబంధాలు ప్రకాశం కోసం వచ్చాయి. కాని ప్రకాశం అవన్నీ తిరగ్గొట్టేశాడు. ఒక్కొక్కసారి ఆ సంబంధాల వేసటతో విసిగి చికాకుగా 'నేను యీజన్మలో పెండ్లి చేసుకోను!' అని అరిచేవాడు. ప్రకాశంలోని వైరాగ్యదృక్పథం అర్థంచేసుకున్న అవధాని, మేనల్లుడు పెళ్ళి చేసుకుంటాడా లేదాఅనే మీమాంసలోపడ్డాడు. మాణిక్యం కూడా బెంగపెట్టుకుంది.

అవధాని. మాణిక్యం - ఇద్దరూ ఆశ్చర్యపోయారు ప్రకాశంలోని ఈ మార్పుచూసి. సాంబు యింట్లోంచి పారిపోవడంవల్ల మనసుల్లో కలతగానే వున్నా, ప్రకాశం మనస్సు ఒక వేళ ముందు మరోవిధంగా మారిపోతుందేమో అన్న భయంతో, అతడిపెళ్ళి ఎంత త్వరలో అయితే అంత మంచిదనుకున్నారు యిద్దరూ.

మద్రాసు వెళ్లాక ప్రకాశంలో చాలా మార్పువచ్చింది. చుట్టూ వాతావరణాన్ని అనుసరించి మనిషిమనస్సు కూడా మారుతుంది. మద్రాసులోని అందమైన మేడలు.. హడావడిగా నడిచే జనం..నిగనిగలాడుతూ ఎండవెలుగులో మెరుస్తూ బర్రుమని పరుగెత్తే కార్లు...రకరకాల సిల్కుచీరల్లో, వన్నెల ఆభరణాలతో - సోయగా లొలికించే నడకలతో...అందాలు చిమ్మే వనితలు....కళ్లు చెదరగొట్టే అంగళ్లు - అందుబాటులోని వినోదాలు, సినిమాలు - ఇవన్నీ ఒక్కసారి కన్పించగానే, ఇంతకాలం తాను మరొక లోకంలో నివసించి వచ్చినట్లనిపించింది ప్రకాశానికి. అనంతమైన కార్యక్రమాలతో హడావడిగా ఉన్న ఆ నగరంలో మనిషి ఉపయోగించుకుని అభివృద్ధికి రాగల అవకాశాలు ఎన్నో కనిపించాయి. నిలవడానికి నీడ దొరికితే, ఆ నీడలోనే ఒక మేడకట్టి నిర్మలంగా ఆనందంగా జీవితం గడపవచ్చనే ధైర్యం కలిగింది.

ఉద్యోగంకోసం ఎన్నో ప్రయత్నాలు చేశాడు. నగరం చూడగానే ఉత్సాహంగా ఎటువంటి ఆశలు అల్లుకుని జీవితాన్ని దిద్దుకోవాలనుకున్నాడో, అవన్నీ హరించిపోయాయి క్రమంగా. ఎరిగున్న స్నేహితుడు కాని, ఆదరించే బంధువుకాని, సానుభూతి చూపగల ఆప్తుడుకాని లేకపోయాడు. ఎక్కడికి వెళ్లినా 'ఉద్యోగాలు ఖాళీ లేవని' ఒకటే సమాధానం! నడిచి నడిచి అతని కాళ్లు అరిగిపోయాయి.

మేనమామ నడిగి తెచ్చిన ఏభయి రూపాయిలు ఖర్చయిపోయాయి. భుక్తి గడవడమే కష్టమైపోయింది. హోటలుగదికి అద్దె పెరుగుతోంది. డబ్బు యింక కొంచెం పంపమని మేనమామ నడుగుదామనుకున్నాడు. కాని ఆ ప్రయత్నంనుంచి విరమించుకున్నాడు. అది తన ఆత్మగౌరవానికి భంగమని కుటుంబ భారాన్ని భరిస్తున్న మేనమామను పదేపదే

డబ్బుకోసం పీడించడం అతని బరువును ఎక్కువ చేసి విసిగించడమే అనుకున్నాడు.

ఉద్యోగం దొరక్కపోతే ఆఖరుకు ఎక్కడైనా కూలీగా లేక హోటల్లో సర్వరుగా కూడా పనిచేద్దామని నిశ్చయించుకున్నాడు ప్రకాశం. ఒక రోజున ఒక హోటల్ కి వెళ్ళి మేనేజరు గదిదగ్గర నుంచున్నాడు. అదే సమయానికి వకీలు వైకుంఠ రావుగారు మడతలు నలిగిపోయి మాసిన ప్రయాణదుస్తులతో ఎదురుగా కన్పించారు. అంతా క్రొత్తగా నున్న ఆ నగరంలో ఒక ఎరిగున్న పెద్దమనిషిని, చూడగానే ప్రాణం లేచి వచ్చినట్లయింది ప్రకాశానికి.

'నమస్కారమండి!'

'ఓ ప్రకాశమా! యిక్కడ ఉంటున్నావేమిటోయి!'

కూలీ తన పెట్టె బెడ్డింగు వెనకాల తీసుకురాగా, వైకుంఠరావుగారు మేనేజరు తనకిచ్చిన గదిలోకి నడిచాడు.

'కూర్చో!' మర్యాదచేశారు వకీలుగారు. తనతోపాటే భోజనం చెయ్యమన్నారు. మునుపు కాకినాడలో తాము జరిపిన ప్రజాసేవ కార్యక్రమాలను గురించి సరదాగా మాట్లాడుకున్నారు.

'ఏమన్నా ఉద్యోగం చేస్తున్నావా?'

ప్రకాశం సందిగ్ధావస్థలో పడ్డాడు. లేదంటే ఆయన దృష్టిలో చిన్నతనమౌతుందేమో అని బాధపడ్డాడు.

'ఒక చిన్న కంపెనీలో పనిచేస్తున్నానండి! ఆ ఉద్యోగం బాగులేదు...మీరు ఎరిగున్నవారు ఎవరైనా యిక్కడ ఉంటే, నాకు కొంచెం పరిచయం చెయ్యండి!... ఏదైనా మంచి ఉద్యోగం వారి సహాయం వల్లనుండైనా దొరుకుతుందేమో!'

వకీలుగారు ప్రకాశం నమ్రతకు ముచ్చటపడ్డారు.

'తప్పకుండా! నే నెరిగున్న బ్యాంకు డైరక్టరు ఒకాయన ఇక్కడే ఉన్నాడు. ఆయనకో ఉత్తరం వ్రాసి యిస్తా.'

అనడమే తడవుగా వకీలుగారు ఉత్తరం వ్రాసియిచ్చారు.

'సంతోషం' అంటూ నమస్కరించి సెలవు తీసుకుంటూ లేచాడు ప్రకాశం.

'నేను నాలుగైదురోజులు ఉంటాను. ఈలోపుగా మరోసారి కనిపించవోయి.'

'తప్పకుండానండి!'

ఉత్తరం తీసుకుని డైరక్టరుగారిని కలుసుకున్నాడు ప్రకాశం. ఉద్యోగంగురించి మాట్లాడడం మాని ప్రకాశం క్షేమ సమాచారాలు, కుటుంబవివరాలు పరీక్షించారు ఆయన.

'సరే. ఆలోచిస్తా!' అంటూ ఆఖరుమాట ముగించారు డైరక్టరుగారు.

బహుశా, ఆమాట తన ఉద్యోగం గురించే అని అర్థం చేసుకున్నాడు ప్రకాశం. నిరాశతో వెళ్ళిపోయాడు. కాని రెండురోజులలోనే ఆఫీసు ఆర్డరు వచ్చింది. ఒక సీనియర్ గుమాస్తాగా నియామకం. జీతం నూటయాభై రూపాయలు. ఆనందం పట్టలేక వైకుంఠరావుగారి దగ్గరకు ఉరకలు పరుగుల మీద వెళ్లాడు ప్రకాశం.

'నాకు ఉద్యోగం యిచ్చారండి.'

'ఆయన చాలా మంచివాడు లే. ఏమన్నా కాళీ ఉంటే మనవాళ్ళకు తప్పక సహాయం చేస్తాడు!'

'కాని మొదట ఆయన వైఖరిమూసి ఉద్యోగం దొరకదనుకున్నానండి!'

'కొంతమంది మంచివాళ్లు పైకి చాలా కరుగ్గా ఉంటారు!'

'మీ సహాయం మరువలేనండి!'

ప్రకాశం చాలా బుద్ధిమంతుడులా కనిపించాడు వకీలుగారికి. ఆయనకు ఒక ఆలోచన తట్టింది.

'నీకు పెళ్లియిందోయి!'

'లేదండి' సిగ్గుపడ్డాడు ప్రకాశం.

'చేసుకుంటావా?'

'ఆలోచిద్దాం లెండి!'

వకీలుగారు అంతటితో ఆ సంభాషణ ఆపి ఇతర విషయాలు ప్రసంగించారు.

ఆయన చేసిన సహాయానికి కృతజ్ఞత తెల్పుతూ ప్రకాశం వెళ్ళిపోయాడు.

వైకుంఠరావుగారు, కోర్టు పని మీద మద్రాసు వచ్చారు. పనిలోపనిగా తన కూతురుకు ఒక సంబంధం చూడాలనికూడా అనుకున్నాడు. ఒక కుర్రాడు 'లా' మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అతనితండ్రి అనుమతి తీసుకున్నారు ఆ అబ్బాయిని కలుసుకుందుకు. 'లా పరీక్ష ప్యాసవుతే గాని పెండ్లివిషయం ఆలోచించన'ని ఖచ్చితంగా సమాధానం యిచ్చాడు ఆ అబ్బాయి. మర్యాద లేకుండా, సిగరెట్టు పీలుస్తూ, నిరసనగా నిల్చుని, వీధిలో ఎవరితోనో మాట్లాడుతున్నట్లు మాట్లాడిన, అతని ప్రవర్తనకు వకీలుగారు అసహ్యించుకున్నారు.

ప్రకాశాన్ని చూడగానే అతను తన కూతురుకు తగిన భర్త కాగలడనే భావం కలిగింది. అయినా ఒకసారి జాగ్రత్తగా ఆలోచించాలని అప్పటికి ఊరుకున్నారు.

ప్రకాశానికి ఉద్యోగం దొరికిన తర్వాత తన జీతం యింటికి పంపవలసిన అగత్యం కనిపించలేదు. అవధాని ఉత్తరం వ్రాశాడు కుటుంబ పోషణ గురించి ఏమీ బెంగపెట్టుకోనక్కర్లేదని. మేనమామ ఉదారబుద్ధితో కుటుంబాన్ని యింకా పోషిస్తాననడం తన అదృష్టం అనుకున్నాడు ప్రకాశం.

చేతులో డబ్బు గల్గన మ్రోగుతోంది— ఎదురుగా సినిమాల బొమ్మలు...హోటళ్ళలోని ఫలహారాలు—దుకాణాలోని సిల్కు బట్టలు మత్తెక్కించే సువాసనలతో వీచీలో, వీధుల్లో, బస్సుల్లో తారసిల్లే అందాల వనితలు, వ్యసనాలను రెచ్చగొట్టే సాంగత్యాలు ఇవన్నీ అతన్ని ఉక్కిరి బిక్కిరి చేశాయి.

ప్రకాశంలోని సంస్కారం విజ్ఞానం నశించకపోయినా, జీవితంలో చాలాకాలం డబ్బులేక దారిద్ర్యంతో నానా అవస్థలూ

★ ఉదయ కిరణాలు ★

పడిన అతనికి కొంత సుఖం పొందాలనే వాంఛ కలిగింది.

విచ్చలవిడిగా విరామంలేకుండా స్నేహితులతో కలిసి తిరిగి తిరిగి యింటికి రాగానే ప్రకాశానికి ఒక అసంతృప్తి కలిగేది. ఇంటికి రాగానే పుస్తకాల్లు, బట్టలు, కుర్చీలు చిందరవందరగా పడిఉండేవి. పలకరించేమనిషి, ఆదరించే ఆప్తులు యింట్లో ఎవరూ లేకపోవడం, ఏమిటో పెద్దలోటులా ఉంది. ప్రక్కయింట్లో క్రొత్త దంపతుల కిలకిలలు అతన్ని కలవరపెట్టాయి.

తన ఒంటరితనం చూసి హేళనగా ప్రకృతినవ్వినట్లుండేది ప్రకాశానికి. వయస్సు ప్రభావం ఎటువంటిదో ప్రకాశానికి తెలిసి వచ్చింది. పూర్వపు అద్దె యింటి ఇరుగు పొరుగుల స్త్రీలు, సాంబు దనువులో మైమరిచిన యువతులు అందరూ అతని మనోనేత్రం ముందు కదిలారు...పాపం! వాళ్లుచేసిన తప్పేముంది? ఏమీ లేదనిపించింది. నవ్వుకున్నాడు ప్రకాశం.

వకీలు వైకుంఠరావుగారివద్ద నుంచి ఉత్తరం వచ్చింది. వకీలుగారు తనకు ఉద్యోగం యిప్పించి సహాయం చేశారు. ఆయనకూతురును పెండ్లిచేసుకుంటే, వకీలుగారి పరువు, ప్రతిష్ఠలు మంచితనం ఆధారంగా తను బాగా వృద్ధిలోకి రావచ్చు అనుకున్నాడు ప్రకాశం.

కాకినాడ వెళ్ళి చాలారోజులయింది.



ఒకసారి తల్లిని, మేనమామను చూడాలనిపించింది. సాంబు ఏమయ్యేడో ఏమీ తేలలేదు. పరిస్థితులు ఒకసారి ఆకళించుకున్నట్లు కూడా ఉంటుందని ఒక నెలరోజులు సెలవుపెట్టి ప్రకాశం రైలుఎక్కాడు.

అవధాని కాకినాడ బదిలీచేయించుకోడానికి కారణం అతనికి హోటలుభోజనం పడక నేమో!... ఇంతకాలం తన కుటుంబం కోసం త్యాగంచేసిన అవధానికి భోజనసదుపాయం, ఇతర గృహసౌకర్యాలు కలిగేలా చెయ్యడం తనవిధి. తనకు పెండ్లిఅయితే అవధానిదగ్గర తల్లిని ఉంచవచ్చును! ఈ ఆలోచన ప్రకాశాన్ని తప్పక పెళ్లిచేసుకోమని పురికొల్పింది.

వకీలు వైకుంఠరావుగారు మ్యునిసిపల్ ఛైర్మన్‌పదవి కొన్నాళ్లు నిర్వహించారు. వకీలు వృత్తిలో చాలా మేధావి అని పేరు గడించుకున్నారు. ఆ వూళ్లో బాగా డబ్బు సంపాదించిన వకీళ్ళలో యీయన్ని మొదటగా చెప్పుకుంటారు. మంచి పరువు ప్రతిష్ఠలు సంపాదించుకున్నారు. ఆయన మాట అంటే ఆవూళ్లో అందరికీ గౌరవమే. అటువంటి ఉన్నత కుటుంబీకుడైన వకీలుగారికి అల్లుడు కాబోవడం తన అదృష్టం అని మురిసిపోయాడు ప్రకాశం.

ప్రకాశానికి ఉద్యోగం వకీలు వైకుంఠరావుగారు యిప్పించారని అవధానికి తెలియదు. ఈవిషయం చెప్పేదేమిటని ఊరుకున్నాడు ప్రకాశం.

మద్రాసులో ప్రకాశం ఎలా గడుపుతున్నదీ అవధాని అడగలేదు. ప్రకాశం చెప్పనూలేదు. ప్రకాశం కాలానుగుణంగా మసలగలడని అవధానికి నమ్మకం ఉంది. ప్రకాశం యిప్పుడు పెళ్లిచేసుకుంటాననడం ఈ నమ్మకాన్ని బలపరిచింది.

వైకుంఠరావుగారి కూతుర్ని చూసి ఇంటికి వచ్చారు, ప్రకాశం, అవధాని.

'అమ్మాయి ఎలా ఉందిరా!'

'కొంచెం ఆలోచించనీ!'

ప్రకాశం నవ్వు ఆపుకోలేకపోయాడు. ఒక పెద్దతరగతి కుటుంబంలోని అందమైన అమ్మాయిని వివాహం చేసుకోబోతున్నాననే కులుకు అతనిలో స్పష్టంగా కనపడుతోంది.

అది కనిపెట్టి 'పిల్ల నచ్చింది కాబోలు' అనుకుని ప్రకాశం సమాధానంకోసం ఆత్రుతపడలేదు అవధాని.

వైకుంఠరావుగారి అమ్మాయి నాజూగ్గా ఉంటుంది. చామనచాయ. ముఖం, ముక్కు, కళ్లు చక్కగా తీర్చిదిద్దినట్లుంటాయి. అమ్మాయి ఆకర్షణీయంగా ఉంది. 'మధురా నగరిలో...' అంటూ కమ్మగా పాడింది వీణమీద. గులాబీ రంగు చీర - తెల్లటి సిల్కు జాకట్టు - తలలో తురిమిన గులాబీ.... మెడలో చిన్ని నెక్లసు - చేతులకు బంగారు గాజులు. ఆమె అందాన్ని ఇనుమడింప చేస్తున్నాయి. గృహిణికి ఇంతకన్న కావలసింది ఏముంది? ప్రకాశం సంతృప్తిపడ్డాడు.

వకీలుగారి కూతుర్ని చూసి వచ్చాక, యింట్లో అడుగు పెడుతూనే, అవధాని వరండాలో కూర్చున్న పరంధామయ్యదగ్గరకు తిన్నగా వెళ్లాడు. ప్రకాశం మునుపు ఎరిగి ఉన్నంతవరకూ అన్నదమ్ములిద్దరూ ఎడమొఖం పెడమొఖంతో ఉండేవారు. తనతో కూడా పరంధామయ్య మాట్లాడకుండా కోపంగా ఉంటున్నందువల్ల, పరంధామయ్యను పలకరించాలా వద్దా అనే మీమాంసలో పడ్డాడు ప్రకాశం.

'ప్రకాశం! ఇలా రారా!' పరంధామయ్యే పిలిచాడు.

ఆశ్చర్యపడుతూనే మేనమామలదగ్గరకు వెళ్లి కూర్చున్నాడు ప్రకాశం.

'ఇప్పుడే వైకుంఠరావుగారి అమ్మాయిని చూసి వచ్చాం' అవధాని విషయం చెప్పాడు.

'నచ్చిందా వాడికి?'

'నచ్చినట్లే కనిపిస్తున్నాడు!'

'అయితే శుభస్య శీఘ్రం' పెండ్లిచేసేయండి!'

పరంధామయ్య యింత కలిసికట్టుగా, మృదువుగా మాట్లాడడం ప్రకాశం మునుపు చూడలేదు. ఇంట్లో విషాద సంఘటనలవల్ల అతని మనస్సు ఇలా మారిఉంటుం దనుకున్నాడు ప్రకాశం. పరంధామయ్యను చూడగానే జాలిపుట్టింది ప్రకాశానికి. పరంధామయ్య భరిస్తున్న దుఃఖం అంతా అతని ముఖంలోని వార్ధక్యరేఖలే చెబుతున్నాయి. పరంధామయ్య తన బాధలు మరిచి యితరుల ఆనందంలో పాలుపంచుకుందామనే ఉబలాటంతో తడబడుతున్నట్లు తోచింది.

స్రవంతి కాఫీ తెచ్చింది ముగ్గురికీ. కాఫీ త్రాగాడు ప్రకాశం.

'చామంతికి యిచ్చావా కాఫీ?' భార్యను ప్రశ్నించాడు పరంధామయ్య.

ప్రతీ నిమిషం చామంతి ఏం చేస్తూందా, ఏమైనా తింటూందా లేదా అనే బాధ పరంధామయ్యకు ఎక్కువైంది. వైధవ్యం మీద పడిన కూతురు కుమిలిపోతూంది. భార్యకు చాలాసార్లు చెప్పాడు—తిండి, నిద్రఆమెకు సరిగా ఉండేటట్లు చాలా జాగ్రత్తగా చూడమని. అధోరణిలోనే భార్య నడిగాడు చామంతి కాఫీ త్రాగిందా అని.

'త్రాగనంది!' స్రవంతి గద్గదస్వరంతో ఇంట్లోకి వెళ్లిపోయింది.

చామంతి పేరు వినపడగానే ఆమె అందమైన ఆకారం అతని దృష్టిలో మెలిగింది.

టువంటి అందమైన చిన్నపిల్లకు వైధవ్యం!! నిట్టూర్పు విడిచాడు ప్రకాశం. ఒకసారి చామంతిని చూడాలనిపించింది. ఇంతవరకూ ఆమెవిషయమే తనకు తట్టనందుకు విచారించాడు.

చామంతి భర్త చనిపోయాడని తెలిశాక కూడా ప్రకాశం ఆమెను చూడలేదు. అందుకు పరంధామయ్య బద్ధవైరమే కారణం. అప్పుడు నిజంగా అవకాశం లేనేలేదు. కాని యిప్పుడు...!

'మామయ్యా! చామంతి ఎక్కడుంది!'

'ఆ గదిలో.'

'నే నొకసారి మాట్లాడవచ్చా!'

ప్రకాశం ఆమె గదివైపు నడిచి వెళ్లాడు. ప్రకాశం చూపించిన అభిమానం, జాలివల్ల పరంధామయ్యాకు కష్టాలు జ్ఞాపకం వచ్చి దుఃఖం కలిగింది. అవధాని మౌనంగా కూర్చున్నాడు.

'చామంతీ!' ప్రకాశం పిలిచాడు. కిటికీలు మూసుకున్న చీకటిగదిలో చామంతి ఎక్కడవుందో కనిపించలేదు.

ఒక కిటికీ రెక్కలు తీశాడు.

మంచంమీద ముఖం కొంగుతో కప్పుకుని చామంతి పడుకునివుంది. ప్రకాశం గొంతు వినగానే సంభ్రమంతో ఒక్కసారి లేచి కూర్చుంది.

ఎప్పుడో పెళ్లిముందు సరదాగా మాట్లాడిన బావగొంతు మళ్లీ దగ్గరగా వినిపించగానే చామంతిలో కొంత హృదయ వేదన తగ్గినట్లయి, ఉపశమనంతో ఒక చిన్న నవ్వు నవ్వింది.

'కూర్చో బావా!'

ప్రకాశానికి ఏవిధంగా మాట్లాడాలో అర్థంకాలేదు. తన్ను చూడగానే చామంతి ఏడుస్తుంది. ఏడుస్తే ఓదార్చవచ్చు అనుకున్నాడు ప్రకాశం. కాని మందస్మితంతో ఆహ్వానిస్తున్న చామంతితో ఏవిధంగా ముందు ప్రసంగం కదపాలో తెలియక సతమతమయ్యాడు ప్రకాశం.

'ఎప్పుడు వచ్చావు మద్రాసు నుంచి బావా?'

'నిన్న నేవచ్చా!'

రెండు నిమిషాలు ఇద్దరూ మౌనంగా ఉన్నారు.

'నీ కింత కష్టం వస్తుందనుకోలేదు చామంతీ!'

ఆమెలోని దుఃఖాన్ని ప్రకాశం కెలికినట్లయింది. బాధ ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడ్చింది చామంతి.

'విచారిస్తే ఏం లాభంలేదు. విధినిర్ణయాలు ఎవరూ తప్పించలేరు'

పది నిమిషాలు గడిచినా ఉబికి వచ్చే దుఃఖం చామంతి ఆపుకోలేకపోయింది. ఆమెను యిలా వ్యా(?) పెట్టడం మంచిదికాదనుకున్నాడు ప్రకాశం.

★ ఉదయ కిరణాలు ★

‘మళ్ళీ వస్తా చామంతీ!’ లేచాడు ప్రకాశం.

కన్నీరు కొంగుతో గబగబ తుడుచుకుంది చామంతి.

‘కూర్చో బావా! వెడుదువుగాని!!’

ప్రకాశం మౌనంగా కూర్చున్నాడు.

‘మద్రాసులో హోటలు భోజనం పడుతూందా?’

‘ఆఁ’

ఒకరితో ఒకరు యింక ఎల్లా మాట్లాడుకోవాలో అర్థం కాలేదు.

‘వెళ్ళే లోపుగా మళ్ళీ కలుసుకుంటా చామంతీ!’

ప్రకాశం వచ్చేశాడు బైటికి. చామంతి కూడా యింక ఏమీ మాట్లాడలేక ఊరుకుంది.

పెండ్లి అయ్యాక చామంతిని ఎక్కువగా చూడలేదు ప్రకాశం. ఎదురుగా ఒకవేళ కనిపించినా తలవొంచుకుని వెళ్ళిపోయేవాడు. నిద్రాహారాలు మాని దుఃఖంలో కొంచెం కృశించినప్పటికీ చామంతి పటిష్ఠమైన శరీరంలో చక్కదనం తొంగిచూస్తూనే వుంది. తిలకం లేని ఆమె ముఖం వివర్ణంగా ఉన్నా లావణ్యం ఎంతమాత్రం తరిగిపోలేదు. విచారంతో బరువెక్కి ఆమె కనురెప్పలు వాలిపోతున్నా, ఆ వాలు రెప్పల్లోంచి తొంగిచూచే కనుపాపల్లో హృదయానంద దాయకమైన వెలుగులు మెరుస్తూనే వున్నాయి. వైకుంఠరావుగారి కూతురు చలాకీగా హాయిగా ఉంటే, చామంతి నమ్రతగా, శాంతంగా కనిపించింది. వకీలుగారి కూతురు చదువుకుంది. వీణ పాడుతుంది—వీణాస్వనమల్లా మాట్లాడుతుంది—కాని చామంతిలో చదువు, సంస్కారం, గానం — విజ్ఞానం, జీర్ణించుకున్న ఉదాత్త ప్రకృతి కనపడుతుంది. వకీలు గారి అమ్మాయివి చిలిపి కళ్ళు. చామంతి కళ్లు వెలుగు కళ్లు. పరిశీలించగా చామంతి వకీలుగారి అమ్మాయికన్న వెయ్యిరెట్లు అనుగుణమైన భార్యలా కనిపించింది ప్రకాశానికి.

చామంతిని పెండ్లి చేసుకోలేక పోవటం తన జీవితంలో జరిగిన పెద్ద పొరపాటు!! ఆ పొరపాటు చెయ్యకపోతే చామంతికి వైధవ్యంతో క్షోభించవలసిన గతి పట్టేది కాదు. తన పొరపాటుకు పశ్చాత్తాపపడ్డం చాలాసులువు. కాని అంతటితో ఆమె వైధవ్యం పోదు. ఆమె కష్టాలు గట్టెక్కవు.

ప్రకాశంలోని సంస్కారభావాలు విప్లవంలా మనస్సులో విజృంభించాయి. చామంతి తన నిండుజీవితమంతా ఒంటరిగా గడపవలసిందేనా? చిన్నతనంలోనే భర్తలను పోగొట్టుకున్న రాధమ్మ, సుబ్బమ్మ ఒంటరిగా జీవితాలు ఎలా గడపగలుగుతున్నారు?

ఆశయాలు నిర్వచించడం, అవసరమైతే ఆశుధారగా కురిపించడం, అందరికీ సులువే. కాని అవసరసమయాల్లో ఆచరణలో పెట్టడం చాలాకష్టం. తాను సంస్కారి ఎందుకు కాకూడదూ? ఒక ఉదాత్తమైన ఆశయం ఆచరణలో పెట్టి జీవితంలో ఎందుకు పురోగమించకూడదూ?

ప్రకాశంతలలో ఆలోచనలు రైలు వేగంతో పరుగెత్తుతున్నాయి. ఒకప్పుడు తిరస్కరించిన చామంతిని మళ్ళీ పెళ్ళి చేసుకుంటానంటే ఎవరొప్పుకుంటారు? అందులో వితంతువైనాక పెండ్లి చెయ్యడం కలలోని మాట! నిరాశతో నిట్టూర్పు విడిచాడు ప్రకాశం. అయినా అభ్యుదయభావాలను అర్థం చేసుకునే అవధానిమామయ్యను సలహా అడుగుదామనుకున్నాడు.

ఆలోచనల తలదిమ్ముతో రాత్రి నిద్దుర పట్టలేదు. తెల్లారి లేవగానే ముఖం పీక్కుపోయినట్లయింది.

ఫలహారాల సమయంలో అవధాని అడిగాడు.

‘వైకుంఠరావుగారికి కబురంపనా! నీకు పిల్ల నచ్చిందని!’

తన ఆలోచనలు ఎరుగని మేనమామవైపు సూటిగా చూశాడు ప్రకాశం ముఖం చిట్లించి.

‘నాకు నచ్చలేదు మామయ్యా!’

అవధాని ఆశ్చర్యంతో త్రాగుతున్న కాఫీ కప్పు బల్లమీద ఉంచేశాడు.

‘నిన్న పిల్ల నచ్చినట్లు కనిపించావు!’

‘పిల్ల బాగానే వుంది. కాని ఆమెను పెండ్లిచేసుకోను’.

‘బాగుంది! మరి ఈ మాత్రం దానికి మద్రాసునుంచి ప్రత్యేకం ఎందుకు వచ్చావురా?’

‘పెండ్లి చేసుకోవాలనే!’

మేనల్లుడిసమాధానం అర్థంకాక ముఖం చిట్లించాడు అవధాని.

‘అంటే!’

‘నేను చామంతిని పెళ్ళి చేసుకుంటా మామయ్యా!’

‘ఏమిటీ!’ కుర్చీలో జార్లపడిన అవధాని ఆశ్చర్యంతో గబుక్కున లేచి కూర్చున్నాడు. ‘ఏమిటి అంటున్నావు?’

‘చామంతిని పెళ్ళి చేసుకుంటా మామయ్యా?’

‘నీకేమైనా మతిపోయిందా?’

‘మతి ఉంది!’

‘అది వితంతువు’

‘తెలుసు!’

ఏమనాలో అర్థంకాక నిశ్చేష్టుడై అవధాని కుర్చీలో జార్లపడ్డాడు.

‘తప్పేముంది మామయ్యా! కాపురం ఎరుగని స్త్రీని భార్యగా స్వీకరిస్తే తప్పేముంది?’

‘తప్పేముంది!’ అవధాని స్వగతం అనుకున్నాడు.

ప్రకాశంవైపు తేరిపార చూశాడు. ప్రకాశంలోని ఉదాత్తమైన హృదయం అర్థం చేసుకోగల్గాడు అవధాని.

‘ఉద్యోగంలో చేరితేకాని పెళ్లిచేసుకోకూడదనే నిశ్చయం ఉండేది నాకు. ఆ నిశ్చయంవల్ల అప్పుడు పెళ్లికి లెక్క చెయ్యలేదు. చామంతి విలువ గ్రహించలేకపోయాను.... నేను చామంతిని పెళ్లిచేసుకుంటా మామయ్యా!’

ప్రకాశం అంత ఉద్రేకంతో మాట్లా

డడం అవధాని అంతకుముందు ఎప్పుడూ చూడలేదు. అతడి ప్రతీమాటలో ఆవేదన వెల్లువికింది. అవధాని హృదయాన్ని కదిలించి; కరిగించింది.

'నీ ఆశయాలు మంచివే, కాని అందరూ ఒప్పుకోవద్దూ!'

'నువ్వు పరంధామయ్య మామయ్యకు చెప్పి మాడు!' ప్రాధేయపడ్డాడు ప్రకాశం.

'నీ కొడుకుమాటలు విన్నావామ్మా!' మాణిక్యంవైపు తిరిగాడు అవధాని.

కొడుకు మాటలు వింటూ ఆశ్చర్యంతో నిలుచుండిపోయిన మాణిక్యంలో చలనం కలిగింది.

'విన్నాను!' ఒక్క నిట్టూర్పు విడిచింది ఆమె.

'ఒక్క వైధవ్యంమాట తొలగిస్తే, చామంతిని పెండ్లిచేసుకుంటే తప్పేముంది?' స్వగతంగా వేసుకున్న యీ ప్రశ్నకు మాణిక్యం సమాధానం చెప్పుకోలేకపోయింది. చామంతి తన కోడలు కావాలని మునుపు ఎంతో ఉవ్విళ్ళూరింది. ఇప్పుడు కోడలు అవుతే తప్పేముంది? కాని వితంతువును కోడలుగా చేసుకున్నామేమని, వంశాచారాలు, కుటుంబ సంప్రదాయాలు రాక్షసుల్లా మీద కురుకుతున్నట్లు కనిపించాయి. కొడుకు చేసుకున్న నిశ్చయంలో తప్పులేనట్లు కనిపించినా ఏమిటో మనస్సును సమర్థించుకోలేకపోయింది మాణిక్యం.

అవధాని చల్లారిపోయే కాఫీ మ్రింగి మెల్లిగా కాళ్ళీడ్చుకుంటూ పరంధామయ్య యింటికి వెళ్ళాడు. ఏదో పెద్ద బాధ్యత ఒకటి తనమీద పడిందన్న బరువుతో నిట్టూర్పులు విడిచాడు అవధాని. ప్రకాశం నిశ్చయం మంచిదే ఐనా అన్నగారి దృక్పథం కూడా అర్థంచేసుకుని, అవసరమైతే మేనల్లుడి భావాలవైపు మొగ్గించాలనే పట్టుదలతో లోపల అడుగుపెట్టాడు. పరంధామయ్య వంటింట్లో ఫలహారం చేస్తున్నాడు. స్రవంతి ప్రక్కనే కూర్చుని కాఫీ వడపోస్తోంది. మఱిదినిచూసి కూర్చోమని పీట వాల్చింది స్రవంతి.

తన వంతుకు రాబోయే ఫలహారాలు చూసి 'అబ్బే యిప్పుడే పూర్తయింది ఫలహారం!' అంటూ సిగరెట్టు ముట్టించాడు అవధాని.

దుఃఖంతో నిండి దిగులుతో దిగజారుతున్న వారి ఆలోచనలను మరలుస్తేకాని దుఃఖంనుంచి తేరుకోరు. పాతుకుపోయిన దుఃఖాన్ని పెకలించాలంటే గాలివానలాంటి వార్త ఏదైనా వినాలి. అప్పుడే మరొక ఆలోచనతో వారి మనోగతి మారుతుంది.

చెప్పవలసింది సూటిగా చెప్పేద్దామనుకున్నాడు అవధాని.

'మీ మేనల్లుడు ఏమంటున్నాడో తెలుసా?'

'పెళ్లి చేసుకుంటానంటున్నాడు' పరంధామయ్య నవ్వాడు.

'ఎవరినో తెలుసా?'

'వైకుంఠరావుగారి అమ్మాయిని' ఇది ఊహించుకోడానికి పెద్దవిషయమా అన్నట్లు తేల్చేశాడు పరంధామయ్య.

'త్వరగా చేయించండి పెళ్ళి!' స్రవంతి భర్తను మఱిదిని చూచి నవ్వుకుంది.

'వైకుంఠరావుగారి అమ్మాయి నచ్చలేదట!'

'లేదూ!' స్రవంతి, పరంధామయ్య ఆశ్చర్యంగా ఒక్కసారే ముఖం చిట్లించారు.

'కాని పెళ్లి చేసుకుంటాడుట!'

'ఎవర్ని?' స్రవంతి కుతూహలంగా అడిగింది.

'చామంతిని పెళ్ళి చేసుకుంటాడుట!'

'ఏమిటీ?' భార్యాభర్తలు యిద్దరు పెద్ద కేకతో ఆశ్చర్యంగా అట్లాగే రెండు నిమిషాలు చతికిలబడిపోయి, పెద్ద రైలుప్రమాదం నుంచి తప్పించుకుని బయటపడినవారిలా కూర్చుండిపోయారు.

వారి హృదయాలలో కల్లోలం బయలుదేరింది.

సిగరెట్టు పొగల్లోంచి అవధాని వారి కలవరమంతా గుర్తించాడు.

'నాకేమీ పెద్ద తప్పుగా కనిపించటం లేదు. కాపురం ఎరుగని యుక్తవయసు స్త్రీ జీవితాన్ని వైధవ్యం పేరుతో ధ్వంసం చెయ్యడం చాలా అన్యాయం. ప్రకాశానికిచ్చి పెళ్ళి చేసెయ్యండి చామంతిని!'

తన సలహాకూడా యిచ్చేశాడు అవధాని.

భార్యాభర్తలు కొయ్యబొమ్మల్లా అల్లాగే అవధానివైపు చూస్తూ కూర్చున్నారు.

'అయినా మీరు ఆలోచించుకోండి!' అంటూ సిగరెట్టు దమ్ములు గట్టిగా పీలుస్తూ వంటింట్లోంచి బయటికివచ్చేశాడు అవధాని.

పరంధామయ్యఆశ్చర్యంలోనుంచి తేరుకున్నాడు. ఆలోచలనలతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. తల వేడెక్కింది. తన కుటుంబాల్లో యింతవరకూ ఎప్పుడూ జరగని పెళ్ళి యిప్పుడు తను చేస్తే అందరూ ఏమనుకుంటారో! అయినా కూతురును యిలాదీనస్థితిలోఉంచడంఎన్నాళ్లు...ప్రకాశంచామంతిని పెళ్ళిచేసుకుంటానని ఎందుకన్నాడు? ...చామంతిని ప్రకాశానికిస్తానన్న పరిస్థితులకూ యిప్పటికీ ఎంతో తేడా వుంది. అప్పుడు తన సంబంధంవల్ల ప్రకాశానికి ఎన్నో విధాల లాభంఉండేది. కాని ప్రకాశం అప్పుడు చామంతిని నిరాకరించాడు ... ఇప్పుడు ప్రకాశంసంబంధం ప్రతీవాడు కోరుతాడు...మంచి చదువు...యుక్తవయస్సు...చక్కటి ఉద్యోగం... అందమైన కుర్రాడు ప్రకాశం. తనకూతురు వితంతువు! ...ఎందుకు పెళ్ళిచేసుకుంటానంటున్నాడు?... ప్రకాశంలో ఏదో విశాలహృదయం ఉందని పరంధామయ్య గ్రహించుకున్నాడు. తనకూతురును సుఖపెట్టాలనే స్వార్థం .... ఉదాత్తమైన ఆశయాలు కల మేనల్లుడిని అల్లుడుగా చేసుకునే అదృష్టం చేజారనియ్యకూడదనే ఆత్రుత - పరంధామయ్యను ఒప్పించాయి. చామంతికీ ప్రకాశానికీ పెళ్ళి జరిగితీరాలని తీర్మానించాడు పరంధామయ్య.

భర్త నిశ్చయానికి స్రవంతి [illegible]పోయింది.

'నీకు మళ్లీపెళ్లి చేస్తానమ్మా!' [illegible]త్తుగా పరంధామయ్య వచ్చి ఒకరో[illegible] చామంతిని అడిగాడు ఆమె అభిప్రాయం!

'ఇదేమిటి నాన్నా!' కంగారుతో గాభరపడింది చామంతి. చేసుకోవాలనుకున్న ప్రకాశం నిరాకరించడం... చేసుకున్న భర్త మరణించి వైధవ్యం సంప్రాప్తించడం - వీటికితోడు మళ్ళీ పెళ్లి! తన జీవితాన్ని అందరూ అవహేళన చేస్తున్నట్లు కృంగిపోయింది చామంతి.

'వద్దునాన్నా! వద్దు! నేను చేసుకోను పెళ్లి! నన్ను యిల్లాగే వుండనీ!' వెక్కివెక్కి ఏడ్చింది చామంతి.

'ప్రకాశమే నిన్ను చేసుకుంటానంటున్నాడు!'

'ఆఁ' ఏడుపు ఒక్కసారి ఆగిపోయింది.

చామంతి ఆశ్చర్యంతో తండ్రివైపు చూసింది. తన్ను మొదట తిరస్కరించిన బావ యిప్పుడు పెళ్లిచేసుకుంటానంటున్నాడా...ఒక వితంతువును!! అర్థంకాని ఏదో ఆనందంలో ఉక్కిరిబిక్కిరైంది చామంతి.

'ముహూర్తం నిర్ణయిస్తాను.'

ఆశ్చర్యం, దుఃఖం, బాధ, ఆవేదన, గాభరా, అన్నీ మిళితమయిన ఆమె ముఖంలో ఒక చిఱునవ్వు అతికష్టంమీద వెలిసింది.

ఎప్పుడూ లేని ధైర్యం ఎంతో వచ్చింది పరంధామయ్యకు. పెళ్లి జరిగిపోయింది. పురప్రముఖులు, సంస్కర్తలు, ప్రకాశాన్ని, పరంధామయ్యను ప్రశంసించారు.

ప్రకాశం చేసిన మంచిపనికి సంతోషించి, వకీలు వైకుంఠరావుగారు హృదయపూర్వకంగా దంపతులను ఆశీర్వదించారు.

పెళ్ళయిన వెంటనే ప్రకాశం చామంతి మద్రాసు వెళ్లిపోయారు.

[ఇంకా వుంది.]

వ్యర్థత్యాగం

చలపతిరావు గారు అనుకోకుండా కన్పించారు ఇన్నాళ్లకు - పదేండ్ల తర్వాత ఈనాడు కన్పించారు. వారిని చూడంగానే నేను ఆశ్చర్యపడ్డాను.

మనిషిలో గుర్తు పట్టలేని మార్పు రావడం ఎంత చిత్రంగా ఉంటుందో పది పదిహేను ఏండ్ల తర్వాతకూడా ఏ చిన్న మార్పూ లేక పోవడముకూడా అంతే చిత్రమనిపిస్తుంది.

అదే స్వరూపం - అదే వేషం.

ఆ ఖద్దరులాల్చీయే - అమితకధోవతే!

మీసకట్టూ అల్లానే ఉంది.

ఆ నిండుతనం ఇంకా నిల్చే ఉన్నది.

భుజాన వేసుకొనే గుడ్డ సంచీ రంగు మారిందికాని మాదిరి అదే. ఆ వ్యక్తిలో ఎక్కడా ఒక చిన్న ముడుతైనా లేదు. అయితే మరీ పరీక్షగా చూస్తే - అదీ మొదటి నుండీ వారి నెరిగినవారు మాత్రమే - వారి వయస్సు పట్టుకోగలరేమో.

నన్ను చూడంగానే చిరునవ్వుతో పల్కరించారు "ఏం తమ్ముడూ క్షేమమా!" అని.

నేను వారివంకే నిదానంగా చూస్తూ - లోనకలిగిన ఆనందాన్ని ఆశ్చర్యాన్ని లోలోనే అణచివేసుకోవాలన్న యత్నంతో మరల చిరునవ్వునవ్వుతూ "ఆ. ఆ." అని మాత్రమే అనగలిగాను.

ఆరోజు పట్నంనుండివస్తూ బెజవాడ స్టేషనులో బండి ఆగంగానే దిగివెళ్ళి కాఫీ అదీ సేవించి మళ్ళీ మళ్ళీ దిగవలసిన అవసరం కలుగకుండా ఫ్లాస్కు నిండా కాఫీ పోయించుకొనివచ్చి నా బెర్తుపై ఒకమూలగా పెట్టుకొని క్రిందకు దిగి ప్లాటుఫారంమీద నిలబడి ఉన్నాను. అప్పుడే ఆయన కన్పించారు. వారూ మరొక పెట్టెలోనుండి దిగి వస్తున్నారు.

వారు కన్పించంగానే ముందుకు వెళ్ళి నమస్కారం చేశాను. వారు నా క్షేమాన్ని పరామర్శించారు.

"ఎక్కణ్ణించండీ రావడం అన్నగారూ?" అని అడిగాను నేను.

"ఇంటిదగ్గరనుంచేనయ్యా"

అయితే ఇటు ఎక్కడిదాకా.

"నా స్తేరు వెళదామని బయలుదేరాం"

అహా అల్లాగా నేనూ అక్కడికేనండి" అన్నాను నేను.

అన్నగారు కూడా వస్తున్నందుకు నాకు చాలా ఆనందమయ్యింది.

"అయితే అన్నగారూ రండి - అభ్యంతరం చెప్పకండి ఇద్దరం కలిసి కూర్చుందాం మా పెట్టెలోనే సరే మామూలేగా సామానేమీ లేదుగా" అన్నాను మరచిపోయిన చనువును జ్ఞాపకం చేసుకొంటూ.

వారు ఒక్కక్షణం ఆలోచనలో దిగబడ్డారు. నేను కొంత ధైర్యం చేసి "రండన్నగారూ రండి." అని చెయ్యి పుచ్చుకొని ముందుకు నడువబోయాను.

"అవునయ్యా... కాని ఈసారి సామాను చాలా ఉంది - ఆడవాళ్ళతో ప్రయాణమయ్యా!"

"అయితే ఇంకేం వదినగారూ వస్తున్నారా పదండి వాళ్లనూ తీసుకొనివద్దాం." అని ముందుకు పోవడానికి ఉద్యుక్తుణ్ణి అయ్యాను. కాని వారు అక్కడే ఆగి నిలబడిపోయారు.

"మురయా"

"అబ్బే ఎందుకు లేవయ్యా అవన్నీ కదపడం శ్రమ" అన్నారాయన.

నాకు తెలుసును వారిలో వచ్చే చిక్కు. వారు సెకండుక్లాసులో ఎక్కరు. సొమ్ము నేను ఇచ్చుకొంటానండీ అన్నా. ఆయన అంగీకరించరు. ఈ విషయంలో నేను క్రితంలో చాలాసార్లే ప్రయత్నించేసి ఓడిపోయాను.

"సరే ఆ సంగతి తర్వాత చూద్దాం - ముందు పదండి వదినగార్ని చూస్తాను" అని ముందుకు నడిచాను వారూ నా వెంట వచ్చారు.

ఆవిడను నేనసలు గుర్తుపట్టలేకపోయాను. నాకు జ్ఞాపకం ఉన్న వ్యక్తికి ఈ వ్యక్తికి అసలు - ఏ కోశానా పోలికే లేదనిపించింది. ఎంత మనిషి - రథంలాగా - లావుగా - ఎత్తుగా ఠీవిగా ఉండేది. మనిషి పచ్చని పసిమి. ముఖంలో ఎంత వర్చస్సు!. మాటలో ఎంత ముచ్చట! హృదయంలో ఎంత ప్రేమ! ఎంత చాకిరి చేసేది. అర్ధరాత్రివేళ అనుకోకుండా హఠాత్తుగా పది మంది వచ్చిపడ్డా - ఒక్క రవ్వకూడా విసుక్కోకుండా కూరా నారా చేసి వడ్డించి మరీ పిల్చేది భోజనాలకు. ఎవరు వచ్చినా ఎంతో ఆదరించి అన్నం పెట్టేది.

అల్లాంటి మనిషి ఇల్లా అయిపోయిందంటే - చూచి నేను ఆశ్చర్యపడ్డానంటే అబ్బురమేమీ లేదు. నా ఆశ్చర్యం మరుక్షణంలో జాలిగా మారిపోయింది.

నా హృదయం జాలితో నిండిపోయింది.

అంతలో నాకు కోపం వచ్చింది. అవును నిజంగానే మా అన్నగారిమీదే కోపం వచ్చింది. ఆవిడ ఏదో బాగా జబ్బు పడి ఉండాలి. ఊరికే చుట్టపుచూపులా వచ్చిపోయే దగ్గూ పడిశెమో చిన్న జ్వరమో - అల్లాంటి జబ్బు కాదు చాలకాలంగా తిష్ఠ వేసుకొని కూర్చున్న జబ్బే అయివుండాలి. దీనికంతటికీ అసలు కారణం ఆ - నిస్సందేహంగా అన్నగారి అశ్రద్ధే అయివుండాలి.

ఆవిడ ఆ మెయిల్లో జనసమర్దంగా ఉన్న మూడవతరగతి పెట్టెలో ఒదిగి ప్రక్కగా - కిటికీకి ప్రక్కగా కూర్చుని ఉంది. నేను లోపలకు వెళ్లి ఎదురుగా చోటు చేసుకొని కూర్చుంటూ - అదేమండీ వదినగారూ ఇల్లా అయిపోయారూ!" అన్నాను దిగులుగా.

"అబ్బే! ఏం లేదయ్యా - కొన్నాళ్ల నుండి ఒంట్లో ఏమీ బాగా వుండటం లేదు."

"కారణం?"

"అనారోగ్యమే" అన్నదావిడ నాకు మనస్థైర్యాన్ని చేకూర్చడానికేమో అన్నట్లుగా ఓ చిరునవ్వుతో తేల్చేస్తూ.

ఆవిడను ఇంకా దూరం ప్రశ్నించినా ప్రయోజనం లేదని అనుకొని చివరకు ఇల్లా అన్నాను.

"అయితే ఇంతకాలం నాకో ఉత్తరం ముక్క వ్రాయించాలనే అనుకోలేదన్న మాట. అన్నగారు వ్రాయలేరంటే కారణాలుండవచ్చు. మీరు వ్రాయడానికేమండీ?" అని ఆవిడ సమాధానం ఎల్లాగో ఇవ్వదని గ్రహించి కొంచెం చిరాకుపడుతూ క్రిందకు దిగివచ్చాను వచ్చి అన్నగారి ప్రక్కనే నిలబడ్డాను. నాకు వారు కన్పించిన ఘడియ నుండీ ఒక అనుమానం బాధిస్తూనే ఉన్నది. వారికి నాపై క్రితంలో కలిగిన భావం తొలగిపోయిందా లేదా అని. కాని ఆ విషయమై ప్రశ్న వేయడం నిజంగా పిచ్చగా ఉంటుంది.

అందుకని ఆ ప్రసక్తి తీసుకొనిరాకుండా "ఏమండీ పిల్లలు క్షేమంగా ఉన్నారా?" అని అడిగాను.

"ఆ. ఆ. ఇంటివద్దే ఉంచివచ్చాను." అన్నారాయన.

ఆయనకు సంతానం కొంత ఆలస్యంగా



"ముస్తాబు"

—గజపతిరావు, శ్రీకాకుళం.

★ వ్యర్థ త్యాగం ★

కలిగింది. నేను చూచినప్పుడు ఒక పిల్లవాడూ - ఒక ఆడపిల్లా. ఆపిల్లకే పదేళ్లు దాటిఉండాలి. అన్నగారికి పిల్లలంటే ఎంతో అపేక్ష. ఎవరిపిల్లలైనాసరే ఎత్తుకొని ముద్దాడేవారు. ఆరోజుల్లో రైల్లో పోతూ - ఎవరిపిల్లవాడో దేనికోసమో ఏడుస్తూ - మారాం చేస్తూ తల్లిని వేధిస్తుంటే వారు వెళ్ళి వాణ్ణి తనదగ్గరకు తీసుకొని సముదాయించి తనవద్దే ఉంచుకొనేవారు - తనో వాళ్లో దిగి వెళ్లేవరకూ.

పిల్లలుఏడుస్తుంటే చూచి ఓర్వలేరాయన. వారి హృదయం చాలా మెత్తనిది.

మనిషి కొంచెం మోటుగా రాటుతేలినవాడిలా కన్పించినా ఆయన ఇతరులకు ఏకష్టంవచ్చినా ఓర్చుకొనేవారు కాదు - తనకు కలిగే కష్టనిష్ఠురాలని అధికంగా సహనంతో ఓర్చుకోగలిగికూడా.

కేవలం పూర్వాచారపరాయణుల కుటుంబంలో జన్మించినా ఆయనకా ఆచారాలు పట్టనేలేదు. పదిఎకరాలమాగాణీ - నీవు కట్టించుకొన్నా పట్టించుకోకపోయినా మీ కుటుంబాన్నే అంటిపెట్టుకొని ఉంటామంటూ ఉంటూవచ్చిన నిక్షేపమైనభూమి - ఈయన హయాంలో క్రమంగా కరిగి ఖర్చయిపోయింది.

ఏదో జల్సాకోసం సొమ్ము తగలబడిపోతే వారిమీద నాకు ఏ సానుభూతీ ఉండకపొయ్యేను.

అల్లాకాక మాకోసం - నాలాంటివాళ్ళ కోసం ఖర్చుపెట్టారు.

ఔదార్యం మెచ్చుకోదగిన గుణవిశేషమేగాని దానికైనా హద్దూ పద్దూ ఉండాలి; కాస్త వెనకా ముందూ చూచుకోవాలి.

అబ్బే! అన్నగారికీవిషయంలో అసలేమీ తెలియదనే చెప్పుకోవాలి. ఆయనతో నాకు ఇరవై సంవత్సరాలు - నిండా రెండు పుష్కరాలనుండీ స్నేహం.

మొదటిసారిగా మా యిద్దరికీ జైల్లో పరిచయమయ్యింది. అది నేను మొట్టమొదటిసారిగా ఉద్యమంలో జైలుకువెళ్లినరోజులు.

ఉడుకు రక్తంతో హృదయం ఉప్పొంగిపోతున్న దినాలవి. మేమిద్దరమూ చెరో జిల్లానుండీ వచ్చి ఆ జైల్లో కలుసుకొన్నాము.

వారు అప్పట్లో నన్నెంతో ఆకర్షించారు.

జైల్లో భగవద్గీత చదివి వినిపిస్తూ ఉండేవారు. మనదేశపు గ్రామాలను గురించీ - ఖద్దరు పరిశ్రమను గూర్చి చెబుతుంటే మేమంతా వినేవాళ్ళం. ఆయన స్వయంగా వార్ధాలో ఆరేళ్లపాటు వుండి రావడంచేత ఆయా సిద్ధాంతాలను చక్కగా చెప్పకలిగేవారు. మాకు అడపా తడపా కలుగుతుండే అనుమానాలను తీర్చేవారు. నేను ఇంటిపట్టున ఉండి తిని తిరిగేవాణ్ణి కావడంచేత నాకా వార్డు వాతావరణం - అక్కడి భోజనం సరిపడలేదు. కొద్దిరోజులకే చాలా అధైర్యపడ్డాను. వయస్సులోనా చిన్నవాణ్ణి - పైగా అనుభవమూ అంతకన్నా లేదు.

వారే నన్ను దగ్గర కూర్చోబెట్టుకొని "తమ్ముడూ ఇంతమాత్రానికే దిగులుపడితే - నువ్వు ఉద్యమానికేం పనికివస్తావయ్యా - కాస్త నిబ్బరంగా ఉండాలి" అంటూ ధైర్యం చెప్పేవారు. ఒకరోజున వారి స్వవిషయమేదో చెబుతూ - "చూశావ్ తమ్ముడూ నేను వచ్చేటప్పుడు మా అమ్మకు చాలా జబ్బుగా ఉంది. నేను ఉండినందూ మాకూ ఇప్పిస్తే తప్ప మరోదారి లేదు. అయినా ఆవిడను అల్లా వదిలేసి పిలుపు రాంగానే వచ్చేశాను. నేనేమైనా అధైర్య పడుతున్నానూ? అదీకాక నీ విషయంలో అల్లాంటి ఇబ్బందేమీ లేదాయె ఇహ ఎటొచ్చీ వాళ్ళిచ్చే ఆహారం విషయమేగా నీకు ఇబ్బందిగా ఉన్నదీ! అయితే ఒక్కటి చూడూ - కోపగించుకోక మనం తిండికోసం కాదుగా ఇక్కడకు వచ్చిందీ!" అన్నారాయన.

ఆమాటకు నిజంగానే నాకు కోపం వచ్చింది. తనకేం అల్లాగే చెబుతారనిపించింది. అక్కడ ఇంటిదగ్గరైనా మహా తిన్నవాడైతే నేగా! అనుకొన్నమాట వాస్తవమే. కాని తర్వాత తెలిసింది వారి మాటలో ఉన్న నిజం. నిజం తెలిసిన తర్వాత వారిపై మంచి గురుభావం ఏర్పడింది. వార్ని చూచి మరీ ఆశ్చర్యపడింది ఎప్పుడంటే...

ఈయన ఇక్కడ జైల్లోఉండగా అక్కడ ఇంటివద్ద తల్లికి జబ్బు ఎక్కువై కొంతకాలం చాలా బాధపడి చనిపోయింది. భర్తృవిహీనయైన ఆతల్లికి అంత్యక్రియలు జరిపించే అవకాశమైనా వారికి లభ్యంకాలేదు. ఆవార్త తెచ్చిన ఉత్తరం మాజైలు సూపరెంటుకు సకాలంలో చేరినా వారికి మాత్రం కావాలని ఆలస్యంగా అందచేయబడింది. అది చూచి మేమంతా విచారపడ్డాం.

వారుమాత్రం తొణకలేదు, బెణకలేదు. ఆదినమల్లా ఉపవాసంచేసి మౌనవ్రతం వహించారు. ఆరాత్రల్లా జాగారంచేస్తూ గీతాపారాయణం చేశారు.

ఆఘట్టమే నన్ను చకితుణ్ణిచేసి వారికి మరింత సన్నిహితంగా - దగ్గరగా తీసికొనిపోయింది. వ్యక్తిగతమైన - లోకసహజమైన ప్రేమల్నీ - అపేక్షలనూ ఒక ఆదర్శ సాధనకై వారు ఏనాడో బలిపెట్టేశారని గ్రహించాను. అటువంటి నిబ్బరం కల మనిషిదగ్గరే ఉండి మంచిఅనుభవం-శిక్షణా సంపాదిద్దామని అనుకొన్నాను.

కాని నాకా అవకాశం లభించలేదు. ఇంటిదగ్గర మావాళ్ల ప్రయత్న ఫలితంగా - జరిమానాలు చెల్లించివేసిన ఫలితంగా... ఇతరకారణాల మూలకంగా నన్ను ఆ జైలునుంచి మరోజైలుకుమార్చి 'బి' క్లాసులో వేశారు. అన్నగారిని అక్కడే 'సి' క్లాసులో వదిలివచ్చేశాను. అదృష్టమనేది అన్నిచోట్లా ఉంటుంది.

చివరకు ఆజైళ్ళల్లో కూడా ఉన్నది. నాకాజైలు మార్పు మంచికే వచ్చింది. కాస్త పెద్దవాళ్ళతో పరిచయాలయినాయి.

కాని నాకు అక్కడా సరిపడలేదు. నాఆరోగ్యం కొంత చెడింది. అతి ప్రయత్నం మీద ఆరునెలల తర్వాత చెర విడిపించుకొని బయటకు వచ్చాను. నేను వచ్చిన రెండేళ్ళకు అన్నగారూ ఆయన మిత్రులూ బయటకు వచ్చారు. వారెవరూ జరిమానా ఒక్కపైసా అయినా జమకట్టకపోవడంచేత అంత ఆలస్యమైంది. నేను విడిచివచ్చిన జైల్లో అన్నగారి మూలకంగా కొన్ని ఇబ్బందులు కలిగాయట. వారు ఆ జైలుసూపరెంటును రూల్సుప్రకారంగా ధర్మంగా నడుచుకోమని కోరారట. దాంతో ఆ అధికారికి ఆగ్రహంవచ్చి వారిపై క్రోధం వహించి మరోసమయంలో ఏదో చిన్న

సరా చూచుకొని వారిని లాఠీతో కొట్టి ంగ్లీషులో తిట్టి అవమానపరచి పైకి "ఇతడు లుఅధికారులకు అవిధేయుడై ప్రవర్తిస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నాడు" అని వ్రాశాడట.

దాంతో వారిని అక్కడనుంచి రాయివెల్లూరు. రాయివెల్లూరునుంచి బళ్లారి. బళ్లారి నుండి మా కెవరికీ పేర్లయినా తెలియని ఉత్తరప్రాంతాలకూ పంపారట.

వారు జైలునుంచి తిరిగి రాగానే వెళ్ళి చూచాను. ఆయా జైళ్ళల్లో వారిని చాలా బాధపెట్టారట.

వెంటనున్న వాళ్లు చెబుతూంటే నాకళ్ళల్లో నీళ్లు తిరిగాయి ఆ అధికారులు అన్నగారిబొమికయితే విరగగొట్టలేదుకాని కండలనుమాత్రం కరిగించివేశారు. అల్లాఅయి వచ్చిన వ్యక్తినిచూచేసరికి మగవాడ్ని నేనే నిలువునా నీరైతే మా వదినగారు భోరున ఏడ్చిందంటే విచిత్రం ఏమీ లేదు.

ఆయన ఓక్కమొగాలు వేసుకొని కూర్చున్న మమ్మల్నీ - గుండె బాదుకొంటున్న భార్యనూచూసి నవ్వుతూ ఊరుకోండర్రా - అంత పిరికివాళ్ళయ్యేరేమర్రా - నాకోసం అంతదిగులా - నాకేం - నిక్షేపంలా ఉంటే" అంటూ ఏదో చెప్పుకుపోయారు.

వారిమాటలు నాకేమాత్రం ధైర్యాన్ని ఇవ్వకపోయేసరికి చివరకు ఆయన ఇల్లా అన్నారు.

"ఓయ్ తమ్ముడూ - నేను ఆరునెలల్లో పూర్వంలా కాకపోతే ఉద్యమనుండి విరమిస్తానయ్యా సరేనా?"

నేనప్పుడు వదినగారిని అతికష్టంమీద ధైర్యంచెప్పి ఊరుకోబెట్టాను.

చూచిపోదామని వచ్చిన నేను వారింట్లో చాలాకాలం ఉండిపోయాను.

ఆశ్చర్యమేమంటే ఆయన అన్నట్లుగానే సరిగా ఆరునెలల్లోనే ఆరోగ్యవంతులయ్యారు.

అది నాకు చాలా చిత్రమనిపించింది. వచ్చినప్పటినుంచీ ఒక్కరోజైనా వారు విశ్రాంతి తీసికొన్నదిలేదు.

మూసివేసిన హిందీపాఠశాల తిరిగి తెరిచారు. జిల్లా అంతా తిరిగి ఖాదీ ప్రచారం చేశారు. మమ్మల్నందరినీ వెంటవేసుకొని గ్రామాలకుపోయి మాలగూడాలను పరిశుభ్రం చేయడం రాత్రిళ్లు గ్రామజనులను ఒకదగ్గరకుచేర్చి వాళ్లకు విషయాలు విశదపరచడం - ఇల్లాగా ఎన్నో పనులు మళ్ళీ మొదలు పెట్టారు. తనఊళ్లో మునిసిపాలిటీ వ్యవహారాల్లో జోక్యం కలుగజేసికొని

వ్యర్థత్యాగం

ప్రజోపయోగకరమైన పనులు జరిగేటట్లు ఏర్పాట్లుచేశారు. వారికో క్షణం తీరికే లేదు!

అందువల్లనే నేనొకసారి వారితో "ఏమండీ అన్నగారూ - మీకీ ఆరోగ్యం ఎల్లా వచ్చిందండీ - కాస్తయినా విశ్రాంతి లేకుండా ఇల్లా తిరుగుతున్నారే! ఏమిటీ చిత్రం - ఎక్కడ ఉందీ రహస్యం" అని అడిగాను.

"అల్లా అడిగావు బావుంది - చూశావూ - ఎక్కడ వాళ్లు మన స్వేచ్ఛను అరికట్టారు. బయటకు రాగానే స్వేచ్ఛ లభించింది. స్వేచ్ఛవలన పుష్కలంగా ఆరోగ్యం లభించింది నాలాగే నాతల్లికూడా సంపూర్ణమైన స్వాతంత్ర్యం పొందగానే మంచి ఆరోగ్యవంతురాలవుతుంది." అన్నారు.

వారి మాటలు నా హృదయానికి హత్తుకొన్నాయి. అంతకుముందు దేశానికి స్వేచ్ఛ కావాలి - వచ్చి తీరాలి అన్నమాటలు పదేపదే విన్నాను. ఇప్పుడు ఎందుకు రావాలో వారి ద్వారా విన్నాను. నన్నంతగా ఆకర్షించిన అన్నగారింట్లోనే ఉండి అనేక విషయాలు నేర్చుకొన్నాను. హిందీ నేర్చాను. అప్పట్లో నేనేకాదు నాలాగే చాలామంది వారి ఆతిథ్యాన్ని ప్రతినిత్యం అందుకొని ఉండిపోయారు.

అల్లాగా వారితో - వారింట్లోనే ఉండి వారిచేత "తమ్ముడూ" అని పిలిపించుకొంటూ వారి ప్రేమ వృక్షపునీడల్లో పెరిగి అన్నగారికి ఆత్మీయుణ్ని అయ్యాను.

ఆ తరువాత జరిగిన వ్యక్తి సత్యాగ్రహంలో మేమంతా జైళ్ళకు పోయి వచ్చాం.

అదంతా సాదాగా శాస్త్రరీత్యా జరిగింది.

అయితే ఒక చిన్న తేడా ఉంది వారికీ నాకూ. వారు ఆ గ్రామంలోనే చేస్తే నేను మరికొందరు మిత్రులతో పాటు బస్తీకిపోయి నలుగురి సమక్షంలోనూ కొంత అట్టహాసంగా 'అరెస్టయి' వెళ్లాను.

నేను పదినెలల తర్వాత తిరిగి వచ్చాను.

తిరిగివచ్చిన కొద్ది కాలానికే ఆగస్టు వ్యవహారాలు సంభవించాయి.

నేను వయస్సులో చిన్నవాణ్ని కావడం చేత వారి అనుమతి లేకుండానే మరీ ముందుకు వెళ్లాను. నాకంటె చిన్నవాళ్లతో చేతులు కలిపాను. కొన్ని పనులు జరిగాయి. వాటికి నేను బాధ్యుణ్ణి. అది పైవారికి తేలికగా తెలిసింది. అన్వేషణ సాగించారు. నేను తప్పించుకొని తిరిగాను. నాకూ అన్నగారికీ ఉన్న సంబంధం అందరికీ తెలిసినదే. అది ప్రభుత్వంవారికి తెలియడం ఏమంత కష్టమైన విషయం కాదు. వారు జైలునుండి తిరిగివచ్చిన రోజులకే క్రొత్త చిక్కుల్లో పడ్డారు. నేనొక అర్ధరాత్రివేళ వెళ్లి వారిని చూచివచ్చాను. మరొక రాత్రి వారు వచ్చి వారిని లారీలో ఎక్కించుకొని తాలూకా దాటించి ఠాణాకు తీసికొనిపోయారు.

ఠాణాలో వారు నా ఆచూకీ చెప్పమని అన్నగారిని మంచిగా కోరారు. వారు చెప్పలేదు.

ఎన్ని చెప్పినా వారు చెప్పనేలేదు.

అప్పటున్న సర్కిలు చాలా కరుకు మనిషి.

అన్నగారిదగ్గరనుండే ఆవార్త రాబట్టాలని అతను విశ్వప్రయత్నం చేశాడు. తిట్టాడు భయపెట్టాడు. చివరకు చేతకాక చెయి చేసుకొన్నాడు - ఎన్ని చేసినా లాభం లేకపోయింది. అటునుంచి అటే వారిని జైలుకు పంపారు. ఎక్కడకు ఎటు తీసికొనిపోయారో నాకేకాదు మా జిల్లావారి కెవరికీ తెలియలేదు.

ఆ ఉద్యమానికి "ఆగస్టు అల్లరులు" అని నామకరణం చేశారు ఏలెడివారు. దానికి సంబంధించిన భోగట్టా కొంత వారి దగ్గర విడిచి నేను తప్పించుకొని తిరిగాను. ఆ కాగితాలూ అవీ వారు నాయందున్న ప్రేమవలన పరులకందకుండా దాచారు. వారు నా ఆచూకీ చెప్పేస్తే వారికా బాధతప్పేది. కాని నాయందున్న ప్రేమ ఆపేక్షవలన చెప్పలేదు. నిజమే బయటపడితే నాకు 'సి' క్లాసు కాదు మరేదో శిక్ష వేశేవారు. కాని అల్లా జరుగలేదు. ఆతరువాత కొన్ని నెలలకు నన్ను పట్టుకొనిపోయినా పెద్ద మనిషిని తీసికొనివెళ్లినట్లు తీసికొని వెళ్లారు.

మా ఉద్యమాలఫలితంగానే అనండి. ప్రపంచపరిస్థితుల్లో కలిగిన మార్పులఫలితంగా అనండి - మొత్తంమీద పరాయి ప్రభుత్వంవారు దేశాన్ని విడచిపోక తప్పింది కాదు.

ఎన్నికలు వచ్చాయి. మాప్రాంతంనుండి అన్నగారు ఎన్నికయి వెళతారని నేను నిజంగా ఆశించాను. కాని మాకమిటీవారు ఏకారణంవల్లనో వారి పేరుకాక మరోపేరు సూచించారు. నేను పరుగునవెళ్లి అన్నగారితో ఆవిషయం చెప్పి 'రండి ప్రయత్నం చేద్దాం' అన్నాను. వారు ససేమిరా రానన్నారు.

వారు అలా అన్నాక నేను వెళ్ళి నా ప్రయత్నాలు నేనుచేసుకొన్నాను. పోటీలు పడి నాప్రజ్ఞను ఉపయోగించుకొని నా పేరు జాబితాలో వేయించుకొన్నాను. ఆపని అయిన తర్వాత అన్నగారిదగ్గరకు వచ్చి వారి సంపూర్ణ సహకారాన్ని అభ్యర్థించాను. వారు అంగీకరించి సహకరించారు.

వారు నాతరఫున చేసిన ప్రయత్నం అమోఘమైంది. ఇంటింటికీ వెళ్ళి చెప్పివచ్చారు. మొత్తం ఆప్రాంతం అంతా మావైపు మొగ్గేటట్లు చేశారు. మా సంస్థనూ దాని తరఫున నన్నూ గెలిపించారు. అల్లాగా నేను అధికారంలోకి వెళ్లాను.

అల్లాగా నేనూ మరికొందరం మిత్రులమూ అధికారంలోకి వెళ్లాము. కాని అన్నగారు మాత్రం అక్కడే వెనకే ఉండిపోయారు.

ఆయన అప్పుడే కాదు ఆ తర్వాతకూడా ఏ పదవిలోకీ రాకుండా ఉండిపోయారు. జిల్లా కమిటీ రాష్ట్ర కమిటీ అధ్యక్ష పదవులకు ఎన్నికలూ పంచాయితీ ఎన్నికలూ ఇల్లాగే ఎన్నో వచ్చాయి. వాటిల్లో దేనికో దానికి వారిని నిలబెట్టి గెలిపించాలని నేను తాపత్రయ పడ్డాను. ఆయన దేనికీ ఒప్పుకోలేదు.

వారు తిరిగి తమ నిర్మాణ కార్యక్రమంలో మునిగిపోయారు. హిందీ ప్రచారం - ఖాదీ పరిశ్రమ - గ్రామ పునరుద్ధరణ - ఇవే ఆయన పనులు.

సర్వమూ అయిపోయేదాకా త్యాగాన్ని మానుకోలేదు. ఉన్న ఆస్తినీ తన అమూల్యమైన కాలాన్నీ చివరదాకా త్యాగం చేస్తూనే ఉన్నారు.

ఇక దానికి అవధి ఏమిటో - దాని ఆశయమేమిటో అల్పజ్ఞుడనైన నాకు అంతుపట్టలేదు. అంతా పోయింది ఇక ఎల్లాగా వారికి! అని నేను విచారపడ్డాను కాని వారికా ఆలోచనే రాలేదు.

నేను మంచి పదవిలో ఉన్నాను కదా అన్నగారు వచ్చి నన్ను అభినందిస్తారనీ - ఏవైనా పనులు చేసిపెట్టమని అడుగుతారనీ సహజంగానే ఆశించాను. అల్లాగయినా వారి ఋణం తీర్చుకొందామని అత్యాశకు పోయిన మాటా వాస్తవమే.

కాని వారు నన్ను అల్లా వచ్చి చూడనే లేదు. పోనీ ఏపనులమీదా మనుష్యుల్ని పంపనూ లేదు. ఆ తర్వాత నేను వార్ని చూడటం పడలేదు. నేనే స్వయంగా వెళ్లడానికి కొన్ని విషయాలు అడ్డువచ్చాయి.

నామీద కొన్ని అపవాదులు వచ్చాయి. నేనేదో సంపాదిస్తున్నానని అన్నగారిదాకా వెళ్లింది. వారు నమ్మరనుకొన్నాను, కాని వారు ఎవరో చెప్పినమాటలు నమ్మి - నమ్మడమేకాక ఆరాలు తీయించి... చివరకు నాయందు అత్యంత వైముఖ్యాన్ని వహించి - తన నిరసనభావాన్ని బహిరంగంగా కొందరిముందు వ్యక్తపరిచారు.

ఆత్మీయులమైన తర్వాత నిజానిజాలా కావలిసింది?

కాని వారల్లా అనుకోలేదు. తనకు ధర్మమని తోచింది అనేశారు. అయినా నేను ఆమాట వినికూడా పట్టించుకోలేదు. పెద్దవారులే ఏదో అన్నారని ఊరుకొన్నాను.

వారిస్థితి అంతా తెలుసుకొని వారికి తోడ్పడాలనే వారికో బట్టల లైసెన్సు తన కాళ్ళవద్దకు పంపాను. అది మరొకరికి ఇచ్చుకొన్నా కొంతవచ్చును; కాని నిరాకరించారు.

విసిరి నా మొహాన కొట్టారనిఅనిపించింది. బాధపడ్డాను - కాని సహించాను.

అదేకాక ఆవిధంగా వారికి ఎన్ని విధాల అవకాశాలు కలుగజేసినా వారు అందుకోలేదు. పైగా నామీద కోపం వచ్చింది. ఆకోపం నాటికీనాడు హెచ్చు పెరిగింది. ఆవిషయం తెలిసే వార్ని చూడటానికి నేను స్వయంగా వెళ్ళలేకపోయాను.

అన్నగారి సౌమ్యతిని - వారివల్ల పైకి వచ్చి వార్ని ఆదరించలేదని - కృతజ్ఞత లేనివాడిననీ నన్ను కొందరు ఆడిపోసుకొన్నారు: వారిమాటలు అన్యాయమనిపించింది.

లోపాలు ఉండవచ్చు మనిషి అన్నాక ఏదో ఒక లోపం - ఒకానొకస్థితిలో కన్పింపవచ్చు. అంతమాత్రంచేత గతాన్ని అంతా విస్మరించి అన్నగారల్లా ప్రవర్తించడం నాకేమాత్రం సహజంగా కన్పించలేదు.

రాజకీయాలమూలకంగా బాధపడ్డవాళ్లకు కొత్త పొలం ఫ్రీగా ఇచ్చే ఏర్పాటు చేసింది మా ప్రభుత్వం. మేమూ తలా కొంత పుచ్చుకొన్నాం. ఎక్కడెక్కడవాళ్లో వచ్చి మా సహాయాన్ని అందుకొని మమ్మల్ని అభినందించి వెళ్లారు. కాని అన్నగారు దరఖాస్తు అయినా పెట్టలేదు. దరఖాస్తు వస్తుందేమో సాయంచేద్దామని అనుకొన్నాను. కాని అల్లా కాలేదు.

అన్నగారికి నా స్వాభిమానాన్ని చంపుకొని మనిషిచేత కబురంపాను.

వెళ్లిన మనిషి అవమానితుడై వచ్చాడు.

"నాకు భరణం ఇస్తారటయ్యా - వాళ్ళేమో అసలు సిద్ధాంతాలు మర్చిపోతారూ - మా వద్దకేరారూ" అని ఏమో అన్నారట.

అంతే దాంతో మా యిద్దరికీ చెడింది. మనసు విరిగాక మరల కలవడం కష్టం వారి విషయంలో అంతే జరిగింది. రెండవసారి ఎన్నికలు వచ్చాయి. నాకేదో భయమైంది. చివరకు నాభయం నిజమైంది.

కారణాలు ఏవైతేనేం నేను ఓడిపోయాను. వారు మరో అభ్యర్థికి సాయం చేశారు. వారికి ఇంకా అంత ఓపిక మిగిలి ఉందని గానీ - పలుకుబడి ఇంకా నిలచి ఉందనిగానీ నేనూహించుకోపోవడం కూడా ఒక కారణమే కావచ్చు.

వారికి నామీద విరోధభావమే ఏర్పడింది. అయితే నేనేమీ పగ సాధించలేదు. మరొక జిల్లాకుపోయి అక్కడ బై ఎలక్షనులో కేంద్రానికి పోటీచేసి ఆస్థానాన్ని గెలుచుకొన్నాను.

అల్లాగా నేను అభివృద్ధిలోకి వచ్చాను. కొంత పలుకుబడీ సంపాదించుకొన్నాను. నా యోగ్యతలనూ - నా పూర్వజన్మకృత పుణ్యాన్నీ నా కార్యాన్నీ అన్నీ చూసుకొని లక్ష్మీదేవి నన్ను వరించింది. అందుకు ఎవరో ఈర్ష్య వహించారనిగానీ - ఏదో అనుకుంటున్నారనిగానీ విన్నా నేను లక్ష్యపెట్టనే లేదు. ఈగడచిన పదేళ్ళలో అన్నగారు - అదే మా చలపతిరావుగారు నాకు కన్పించనే లేదు. ఆ అవసరం నాకేమో కలుగలేదుకదా వారికైనా కలుగుతుందేమో అనుకొన్నాను కాని అల్లాంటిదేమీ జరగలేదు.

ఇన్నాళ్లకు కన్పించారు.

కలకాలం పాతవిషయాలు జ్ఞాపకం ఉంచుకొని పగపట్టి బుసకొట్టే విషసర్పపు బుద్ధికాదు గనుక నేనే ముందుకువెళ్ళి అన్నగారిని పల్కరించాను. నమస్కరించాను. ఆయన కన్పింపకపోయినా నేను వారియందు వైముఖ్యాన్ని ఏనాడూ వహించలేదు. మా రైతులు ఏదో పనులమీద వచ్చి మాటల సందర్భంలో అన్నగారినిగూర్చి ఏమో చెబుతుండేవారు "ఆయన నిజంగా ఎసుమంటి మడిసండీ - ముడిసిపాలికి నాయుడు గోరి ఫేర్టికి ఎగస్టు పేర్టిగా నిలుసుండారు. ఆయనే వచ్చి పదిమేలితా మానుకోమంటే - ససేమిరా ఇనుకోలాయి ఆయనకు ఏలు చేదయినా - తింటానికి లేకపోయినా."

అల్లా వారు చెప్పినప్పుడల్లా నేను విని హర్షించాను. నేనూ ప్రశంసించాను. వారిని సమర్థించి వారి తత్వాన్ని విడమరచి చెప్పి వారి త్యాగశీలత నుగ్గడించాను.

వారు పడుతున్న ఇబ్బందులూ విన్నాను. ఒకసారి బొంబాయినుండి ఒక చిన్నవాడు వారింటికివచ్చి వారిని గౌరవించి - అన్నగారి స్థితిని పూర్వాపరాలు రెండూ తెలిసికొని చాలా విచారపడి వారికి రెండుజతల పంచలు పాదాభివందనంచేసి బలవంత పెట్టి ఇచ్చి వెళ్ళాడట అదీ విన్నాను.

ఇంతకంటే అన్యాయం ఏమన్నా వుందా! బాగాఉన్న రోజుల్లో ఆయన ఎంతమందికి వస్త్రదానం చేశారూ - అసలు వారి నడిగవలసిన అవసరం లేకుండానే వారింట్లోంచి వెళ్ళేటప్పుడు నూత్న వస్త్రాలు వారింట్లోవి తీసి కట్టుకొని నవ్వుతూ సంతోషంగా వెళ్లారో! - వారికి - వారికి స్థితి వచ్చింది. ఇంత తెలుగుదేశం ఉంటే - ఇంతమంది అయినవాళ్లం ఉంటే - ఎవరో పరాయి వ్యక్తివచ్చి ఔదార్యం చూపి పోవలసివచ్చింది. ఈ విషయం విన్నాక నా కళ్లలో నీళ్లు తిరిగాయి అంటే ఎవరు నమ్ముతారు.

తప్పు కొంత నాదే కావచ్చు. నిజమే. కాని మిగతావాళ్ళంతా ఏమయ్యారు. కారణాలు ఏవో వారికి తోచాయి కనుక నేను సహాయంచేసినా వారు పుచ్చుకోరు. కాని మిగతా దేశం అంతా ఏమైంది?

ఇది నాకే అంతుపట్టనిది మరొకరికి అంతుతుందని గానీ వారిని ఆదుకొంటారనీ నేను అనుకోనూ అనుకోను - నేనల్లా ఆశించినా జరగనూ జరగదు.

తనకు ప్రభుత్వంవారు వారికి వారే ఏమో చేస్తారని ఆయనా ఏనాడూ భావించనూ లేదు - తనకిది కావాలని అభ్యర్థించనూ లేదు. వారిని జైళ్లలో హింసించిన వార్డర్లు కొందరు ఉన్నత పదవులకు పోయారు. కొందరు పింఛను పుచ్చుకొని సుఖంగా కూర్చున్నారు. మా ఊళ్లో ఆగస్టు దినాల్లో అన్నగారిని ఠాణాలో అన్యాయంగా కొట్టి వీపుమీద శాశ్వతమైన గుర్తులు పెట్టిన అధికారి ఇప్పుడు పెద్ద అధికారి కూడా కాబోతున్నాడు.

పరాయివాళ్లకు యుద్ధసమయంలో చదువు సంధ్యలేమీ ఆట్టే రాకపోయినా దుబాసీగా పనిచేసి సైనికుల్ని పంపి... తెల్ల ప్రభుత్వానికితోడ్పడిన మా కృష్ణయ్య ఈనాడు రావుబహద్దర్ శ్రీ వేంకట కృష్ణయ్యఅయిలక్షరూపాయిలకుఅధికారియై ఇప్పుడు స్వదేశీమంత్రులనూ అల్లాంటివారినీ తనకార్లల్లో వేసుకొని త్రిప్పుతున్నాడు. మేమంతా...ఉడుతభక్తిచూపిన మేమంతా మా సేవకూ త్యాగానికీ అనేక రెట్లఫలితాల్ని అందుకొన్నాము.

అందుకు ఒకరిని అని ఏమీ ప్రయోజనం లేదు. ఇదంతా కాలప్రభావం.

కాని, అన్నగారుమాత్రం తనకున్న ఆస్తీ అన్నిటికంటే ముఖ్యమైన ఆరోగ్యం - అందరూ కోరే సర్వసామాన్యమైన జీవితసౌఖ్యాలూ, విశ్రాంతీ - అన్నీ త్యజించి అందుకు ఫలితంగా...చివరకు రాగిపాత్రను పాణితలాన్న అలంకరించుకొన్నారు. అయ్యో ఎంత నిస్వార్థం.

ఆ విషయం తలచుకొన్నప్పుడల్లా నా మానసవీధిలో నల్లనిమబ్బులు కమ్ముకొంటాయి. నాబాధ ఎవరికీ తెలియదు. ఈ విషయంలో నాతప్పు లేదని చెప్పినా ఒప్పుకోరు. తప్పుకోడానికి ఏవో అన్నానంటారు. ఎవరిదాకానో ఎందుకు మొన్న మా అమ్మే అన్నది.

"ఒరేయి అబ్బాయి - మన చెలపతిరావు చాలా ఇబ్బందిపడుతున్నాడటరా. నువ్వు కాస్త వెళ్లి ఆదుకోరాదటరా? అబ్బే నువ్వాయన కెందుకు చేస్తావ్ సాయం! నీ కొడుక్కు చేసుకొంటావ్. కాక క్రొత్తగా దొరికిన అల్లుడికి చేసుకొంటావ్!" అని నిష్ఠురాలాడింది.

నిజం ఎవరికి తెలుస్తుంది! నాబాధ ఎల్లా చెప్పుకోగలను. ఈ బాధతో నే వారి త్యాగశీలతను ఎల్లా మెచ్చుకొని విడమరచి చెప్పగలనూ!

* * *

★ వ్యర్థత్యాగం ★

ఆయన ఇన్నాళ్ళకు అల్లాగా ఈ తప్త హృదయునకు కన్పించగానే నా మనసు ఆనందమగ్నమూ - హర్షపులకితమూ అయిందంటే మా యిద్దరికీమధ్య అంతచరిత్రఉంది.

ఆయన నన్ను పూర్వంలాగా ప్రేమతో "తమ్ముడూ" అంటూ పలకరించగానే నా హృదయంలో ఎక్కడో దాగిఉన్న ఆ కాస్త కోపమూ పోయింది. నిజంగా సంతోషించాను. వదినగారిని చూడాక నాకు పట్టరానంత దుఃఖం పొంగివచ్చింది. ఈసారి ఏమైనా సరే వారికి ఏదో సాయం చేయాలని సంకల్పించుకొన్నాను.

అందువల్లనే ఆయన రానంటే నేనే వెళ్ళి వాళ్లు కూర్చున్న పెట్టెలో కూర్చున్నాను.

ఇద్దరం హృదయాలు విప్పి మాటాడుకొన్నాం. దారిలో వారు చాలా విషయాలు చెప్పారు. చాలా ప్రశాంతంగా నెమ్మదిగా మాటాడారు. ఎక్కడా ఆవేశంగానీ ఆక్రోశంగానీ లేదు. మహానుభావుడూ యుగపురుషుడూ - ధర్మపరుడూ అయిన ఒక నాయకుని అడుగుజాడల్లో నడచి స్వాతంత్ర్యసమరాన్ని నడిపినవారే అధికారంలోకి వచ్చేసరికి ఎల్లా ధర్మవిరుద్ధంగా ప్రవర్తిస్తున్నదీ వివరించి చెప్పారు.

అందుకు పరిష్కార మార్గాలు సూచించారు. నేను నా పశ్చాత్తాపాన్ని తెలిపి క్షమాభిక్ష వేడుకొని అన్నగారు చెప్పిన మాటలే మరల మరల మననం చేసుకొని ఆ పవిత్రభావాలతో నా హృదయాన్ని క్షాళనం చేసుకొన్నాను.

మా మెయిలు సాయంకాలానికి గమ్యస్థానాన్ని చేరింది. వైజాగ్‌లో నాకేర్పాటయిన బసకు పోదామన్నాను. వారు కాదు మేం- టర్నరు సత్రానికి పోతామన్నారు. నేనూ వారిని అనుసరించాను.

వారు లోపలగదిలో సామాను సర్దుకొంటూఉంటే నేను సత్రానికి వెనకవైపు చిన్నతోటలో పచార్లుచేస్తూ కాలం గడిపాను కొంతసేపు.

చీకటికోణాల్లో బడలికతో ఒడలు తెలియకపడియున్న మానవకోటిని తన లేత హస్తాలతో తట్టి నిద్రలేపి పనులలో ప్రవేశపెట్టి వెలుగుబాటనుచూపి బద్ధకస్తులనుచూచి మన్నలో కొంత కోపగించి తీక్షణదృక్కులతో అదలించి చివరకు ప్రసన్నుడై పశ్చిమదిక్కుకుచేరాడు గగనగామియైన సూర్యభగవానుడు. లేశమైనా కృతజ్ఞత చూపక - నమస్కారమైనాచేయని అనార్యులనుచూచి అతడు అవమానితుడై - జేవురించినవాడై - ఎఱ్ఱనై - విశాలమై - పెదనెత్తుటి మరకలా పశ్చిమాన కొండలవెనుకగా బాధతో కృంగి అంతర్ధానమయ్యాడు.

అదృశ్యాన్నే చూస్తూ కొంతకాలంగడిపేసరికి నా హృదయం - భయంతో బాధతో కంపించింది.

నిస్వార్థుడైన ఆ త్యాగజీవి, - ఆ లోకబాంధవునిగురించే చాలా సేపు ఆలోచించాను. అంతలో అన్నగారు జ్ఞాపకం వచ్చి లోపలకువెళ్ళి వదినగారి జబ్బు విషయమై చెప్పమని మరీమరీ అడిగాను. చెప్పడానికేముంది - అంటూనే వారు నాకు వివరంగా చెప్పక తప్పిందికాదు.

మొదట ఆవిడకు కడుపులో ఏదో నొప్పి బయలుదేరింది. మొదట గుర్తించలేదు. తరువాత (ఖర్చు తక్కువకదా అని అయివుంటుంది) నాటువైద్యాలు చేయించారు. అవేవీ లాభంలేదని తేలినతర్వాత ఆవిడను తీసుకొని అన్నగారు మద్రాసు వెళ్ళారు. అక్కడ వారిని ఆదరించినపాపాన పోయిందెవరూ? ధనమో పలుకుబడో లేక పట్నాలలో పనులు ఎలా అవుతాయీ? వారు ఏదో చూసి "ఏంలేదు పొమ్మ"న్నారు. మద్రాసునుండి తిరిగివచ్చిన కొన్నాళ్లకు తెలిసిన డాక్టరు ఒకాయన స్వయంగా శ్రద్ధ తీసుకొని ఉచితంగా 'ఎక్స్‌రే' ఫొటో తీస్తే అసలు సంగతి బయటపడింది. అల్సరు ఉంది. బాగా ముదిరింది." వీలైతే విశాఖపట్నం వెళ్లండి" అన్నారట.

ఆమాటమీద వారు ఇంతదూరంవచ్చారు. వారా విషయం చెప్పాక అల్లాగా అంతదూరం ముదిరేదాకా ఏం చేస్తున్నారండీ అని సమాధానాన్ని కాంక్షించలేదు గనుక మళ్ళీ 'సరె లెండి' అని నేనే అన్నాను.

అల్లా అని దొడ్లోకివెళ్లి ముఖం కడుక్కొని ముస్తాబై బయలుదేరాను. వార్డులో చూడవలసిన వైద్యుల్ని ఇళ్లవద్దే కలుసుకొని కాస్త పరిచయాలు చేసుకొని వద్దామని అసలు ఉద్దేశ్యం నాది. నేను తీరా బయలుదేరే సమయానికి అన్నగారు నా అభిప్రాయాన్ని ఎల్లా పసిపట్టారో ఏమో ఆ విషయాన్ని ఎత్తుతూ "తమ్ముడూ నువ్వా ప్రయత్నం ఏమీ చెయ్యకు. మీ వదినగారు అందుకు ఒప్పుకోదు. మేం ఇంతకు పూర్వమే ఒక నిర్ణయానికి వచ్చాం....ఆ రెండూ లేనివాళ్లు ఏం చేస్తున్నారో ఎల్లా తంటాలు పడుతున్నారో మేమూ అల్లాగే అవస్థపడతాం అటువంటివాళ్లు లక్షోపలక్షలు. వాళ్లకుమించిన సుఖసదుపాయాలు నాకు చేదు. నాయందు నీకు ప్రేమ ఇంకా ఏమైనాఉంటే నీవీ ప్రయత్నం మానెయ్" అన్నారు. వారు ఇంకా ఇల్లా అన్నారు.

"మనకు నిజంగా ఎంత అవసరమైనా - అధర్మాన్ని ప్రోత్సహించకూడదు. నేనా విషయాన్ని వార్ధాలో 'వారు' స్వయంగా చెప్పగా నేర్చుకున్నాను...అది అల్లా ఉంచు...అసలు ఇక్కడకు మేం వచ్చింది పెద్ద ఆసుపత్రి వైద్యానికి కాదు. ఆశ్రమంలో ప్రకృతివైద్యం చేయించుకోడానికి."

అక్కడ ఉన్న ఆశ్రమానికీ వీరికీ ఉన్న పరిచయం తెలుసు నాకు. వారికి వైద్యం ఉచితంగా లభిస్తుంది. అందుకనే వారు దాన్ని ఎంచుకొన్నారు. వారా విషయం తేల్చి చెప్పేసరికి నాకు బాధకలిగింది. సాయపడవచ్చు కదా అన్న ఆశ భగ్నమైపోయింది. అన్నగారితో వాదించి వారిని మార్చడం అసంభవం అని నాకేనాడో అవగతమైంది. ఆయన చెయ్యబోయే పిచ్చి పనికి కోపం - జాలీ కలిగాయి. సాయం నిరాకరించారని కోపం - అయ్యో ఇదే మా అన్న జాలీకలిగి నాలో- నా హృదయంలో ఎదురుబదురుగా ప్రవహించి వచ్చి ఒకతావున రెండుప్రవాహాలు ఢీకొని ఉధృతంగా ఉవ్వెత్తుగా పైకి లేచినట్లుగా ఆ రెండుభావాలు ఒకదానినొకటి ఎదుర్కొని ఆందోళనను రేకెత్తించాయి.

"అన్నగారూ - అంతేనా - మీ సిద్ధాంతంకొరకు వదినగార్ని..." అని ఉద్వేగం చేత ఆపైనమాటలు రాక ఆగాను.

"అదేం కాదు తమ్ముడూ - నువ్వేమీ ఆందోళనపడకు" అన్నారాయన చిరునవ్వు నవ్వుతూ.

కాకపోవడమేమిటి ! అది అంతే ఆనాడు పరాయివాళ్లను పారద్రోలడానికి ఆముసలాయన చెప్పినమాట ప్రకారం తనుత్యాగం చేశాడు. ఈనాడు తనవాళ్ళను సరిదిద్దడానికి భార్యను బలిదానం చెయ్యడానికి సిద్ధమయ్యారు.

ఇంకఆయన ముందునిలబడలేకపోయాను.

నా హృదయంలోరేగిన తుఫానును అరచేత్తో అదిమిపెట్టుకొని తలవంచుకొని ఆయన్నువిడిచి - ఆ సత్రంవిడిచి కొన్ని గజాలు బెరబెరా, కొన్ని గజాలు మెల్లమెల్లగా నడచి - నడువలేకనడచి బయటకు వచ్చేశాను.

గేటుబయటకువచ్చాక నా హృదయం ఒక్కసారి బావురుమంది.

ఎంతోసేపటికి కాస్త తమాయించుకొని - సర్దుకొని "అబ్బే ఈమనిషితో ఇంతే" అనుకొని అడుగు ముందుకు వేశాను.

"అన్నగారు చేసిన త్యాగం అంతా వృథా వృథా. ఆయనకేమీ లాభం కలుగలేదు కలుగచేసుకోలేదు - నేనేంచేస్తాను" అనుకొంటూ తప్పనిసరై నా బసకు దారితీశాను.

★



వేషాడంబరం

ఇల్లిందల సరస్వతీదేవి

'విద్యార్థినులు పాఠశాలలలో ఉన్నప్పుడు నగలుగాని, అలంకార ద్రవ్యాలుగాని ఉపయోగించరాదని' పాక్, పంజాబు ప్రభుత్వాలు ఆదేశించాయి. విద్యార్థినులు తమ ఇష్టము వచ్చినట్లుగా వస్త్రధారణ చేయటానికి కూడా వీలులేదు. ప్రభుత్వము విద్యార్థినులకు ఒక విధమైన వస్త్రధారణకూడా నిర్ణయించింది. విద్యార్థినులు పాఠశాలలకు వెళ్లేటప్పుడు షల్వార్, కమీజ్, దోపట్టామాత్రమే ధరించాలి (పైజామా, కుడతా, వల్లెమాత్రమే). ఉపాధ్యాయినులు పాఠశాలలలో ఉన్నంతవరకూ అలంకార ద్రవ్యాలను (లిప్‌స్టిక్ వగైరా) ఉపయోగించటాన్ని పెప్సు ప్రభుత్వము ఇదివరలో నిషేధించింది.

విద్యార్జన చేయటానికి పాఠశాలలకు వెళ్లేవారు విద్యార్థినులు; వారికి విద్యాబోధచేసేవారు ఉపాధ్యాయినులు. విద్యార్థినులకూ ఉపాధ్యాయినులకూ అంతశ్శుద్ధి ఎంత అవసరమో బాహ్య వేషములంత గమనార్హములు.


మఖుమల్ గరారాలు, బనారసువోణీలు, నోటినిండా తాంబూలము, అత్తరువాసగల ఘుమాయింపులతో పాఠశాలలకూ కళాశాలలకూ వెళ్లే విద్యార్థినులు విద్యార్జనాభిలాషిణులుగా కనబడరు; పెళ్ళికో పేరంటానికో వెళ్లినట్టుగా ఉంటుంది. వస్త్రాడంబరముచేత మనసు విద్యపై లగ్నము కావటానికి అవకాశము తక్కువగా ఉంటుంది. ఈవిధముగానే ఆకుచిలుకలవలె అలంకరించుకొన్న ఉపాధ్యాయినులు బోధించే విషయాలపై విద్యార్థినుల మనసు లగ్నము కావటానికికూడా అవకాశము తక్కువే.

విద్యలనుబోధించే గురువులు నిరాడంబరముగా, ఆదర్శప్రాయముగా, మార్గదర్శకముగా ఉంటేనేగాని, విద్యార్థినులకు మంచి శిక్షణ లభించదనే ఉద్దేశ్యముతో, ప్రభుత్వము ఈ విషయములో జోక్యము కలిగించుకోనవలసివచ్చినది. విద్యార్జనకై పాఠశాలలకూ కళాశాలలకూ వెళ్లే విద్యార్థినులు కూడా నిరాడంబరముగా వస్త్రధారణ చేయవలెననేనిర్ణయాన్ని పాక్, పంజాబు ప్రభుత్వాలు క్రిందటి నెలలో ఆదేశించాయి.


కొన్ని మిషనరీ పాఠశాలలలో విద్యార్థినులకు యూనిఫారము కట్టుబాట్లు ఉన్నాయి. ఇవి లేనిచోట, పంజాబు రాష్ట్రములోనే కాదు, అంతటా విద్యార్థినులు తమ యిష్టమువచ్చినట్లు వస్త్రాలను ధరించటము జరుగుతునే ఉన్నది. వారివారి స్థితిగతులనుబట్టి వేషధారణ ఉంటుందని మనమెంత సమర్థించుకొన్నా, కంటికి నచ్చినట్టుగాగాని, విలువగలవస్త్రాలనుగాని ధరించిన విద్యార్థినులమీద ఉపాధ్యాయులకు ఒకవిధమైన ఆకర్షణ కలగటము సహజము. ఆ ఆకర్షణ అభిమానముగా మారటానికి అవకాశాలు చాలా ఉన్నాయి. పాఠశాలావరణములో ఉన్నంతవరకూ విద్యార్థినులపై ఉపాధ్యాయులకు కలిగే అభిమానమూ ఆకర్షణా విద్యార్థుల మేధశ్శక్తులపై ఆధారపడటము న్యాయము. విద్యార్థుల అభివృద్ధీ గౌరవప్రతిష్ఠలుకూడా మేధశ్శక్తుల ననుసరించటమే న్యాయమూ ధర్మమూను. పాఠశాలలలో విద్యార్థులకు యూనిఫారము నియమింపబడిన కారణాలు అనేకముగా ఉన్నప్పటికీ ఇది ప్రధానమైనదిగా కనబడకమానదు.

వస్త్రాలంకారముల విషయములో దోషము కేవలము ఉపాధ్యాయులదీ విద్యార్థినులదీ నని అనటానికి వీలులేదు. ఆదోషము వాస్తవముగా ప్రజలది. వేషములలో డంబము, జీవితవిధానములో ఆడంబరము, చేసేపనులలో ఆర్భాటము కనబరచకపోతే ప్రజల దృష్టిలో, గౌరవనీయులైన వారెవరైనా ఉన్నారా? కళ్లు జిగేలుమనే వస్త్రాలను ధరించి ఎవరైనా మన ఎదుటికివస్తే గౌరవిస్తాము. ఆవ్యక్తి తన ఆశయాలను కొండంతలుగా చెప్పగానే విభ్రాంతి పడిపోతాము.

(30-వ పేజీ చూడండి)



హైదరాబాద్ హైకోర్టు



—పి. వీరయ్య, సికింద్రాబాదు.

★ వేషాడంబరం ★

తానుచేసిన త్యాగాలను ధర్మాలను ఏకరువు పెట్టగానే విస్మయపడిపోతాము. వెంటనే ఆవ్యక్తి గొప్ప మేధావి, నాయకుడు, త్యాగి, గౌరవనీయుడు అనే నిశ్చయానికి వస్తాము.

ఆడంబరమైన వేషాలంకరణతో పది మందిలో తిరుగుతూ, పదిచోట్ల గంభీరోపన్యాసాలను చేస్తూఉంటేగాని ఈ నాటి ప్రజలదృష్టిలో ప్రముఖు లనిపించుకోరు. శక్తి స్వల్పమైనా అధికముగా కనబరచుకోవటము మనసులో లేని మాధుర్యము మాటలలో ఒలకపోయటము, వగలు అభినయాలతో ప్రేమలోతులను నిర్వచించటము చేర్వకపోతే, సభ్యతకు లోపము కలిగినట్టుగానే కనబడుతున్నది.

నిరాడంబరము, దానిలో ఇమిడిఉన్న నైర్మల్యమూ, మనకు ఇప్పుడు అంతగా కనబడటము లేదు. నిరాడంబర వేషముతో ముక్తసరిగా తూచితూచి మాట్లాడేవారిమీద ప్రజలకు గౌరవమూ సదభిప్రాయమూ కలగటము అంతంతమాత్రముగానే ఉంటున్నది. వారి త్యాగాలను గురించీ మేథశ్శక్తులను గురించీ ఆశయాలను గురించీ విశ్వాసము అంతగా కలుగదు. ఈ పరిస్థితులకు అతీతులైన వ్యక్తులు లేరనిగానీ, ప్రజలకు విశాలదృష్టి లేదనిగానీ, చెప్పటముకాదు. ఇది సామాన్యముగా కనబడే విషయము. అనేక పరిస్థితుల ఒత్తిడివల్ల నేమి, వాటి ప్రభావమువల్ల నేమి ప్రజల దృష్టిలో ఒక తొందరపాటు, వేగము ప్రవేశించాయి. ఆ కారణముచేత మంచిగానీ చెడుగానీ నిమిషాలమీద నిర్ణయమైపోవాలి; కాలవిలంబనానికి ఎవరూ సహించలేరు. కాలము పరుగెత్తుతున్నది - దానితో మనమూ పరుగెత్తాలి - అంతే.

ఒక వ్యక్తి గుణగణ విచారము చేయటానికి కొంతకాలము పట్టుతుంది. అందులోనూ - నిజము నిలకడమీదగాని తెలియదు. సత్యము రాతికంటె బరువైనది. రాయి నీటికి అడుగునకాని నిలవలేదు. ఆ పరిస్థితులలో 'అయిదు నిమిషాల పరిచయమయినా లేని వ్యక్తినిగురించి మంచి చెడ్డలను నిర్ణయము చేయటము ఎట్లా? ఆ వ్యక్తిని గురించి ఇతరత్రా విచారించి తెలిసికోవటానికి తగిన ఆసక్తిగానీ, అవకాశముగానీ ప్రజలకు ఉండదు. కనుక దీనికి ఆ వ్యక్తిపైననే ఆధారపడటము తప్ప మరొకమార్గము కనబడదు. ఆ కారణముచేత ఆ వ్యక్తి ఆ అయిదు నిమిషాలలోనే తన ఆర్థిక విద్యావైజ్ఞానిక సాంఘికాభివృద్ధులను గురించీ, తన ఆశయాలను గురించీ, ఎదుటివారికి తెలిసేటట్లుగా తానే చెప్పుకొనవలసిన వాడవుతున్నాడు. ఈ కారణముచేత ఇతరులను గురించికంటె తమను గురించే ఎక్కువగా తెలిసికోవటము ప్రజలకు అవసరమవుతున్నది.

సౌందర్యము, మొదటిచూపులోనే, ఆకర్షింపబడుతుంది. కనుకనే ఆకర్షణీయమైన రంగులతో అలంకరించుకొని తమ సౌందర్యాన్ని ఇనుమడింపచేసుకోవాలని స్త్రీలు వాంఛిస్తారు - అందముగా ఆకర్షణీయముగా అలంకరించుకొని నలుగురికంటా బడాలని తంటాలు పడటము కూడా సంభవమే. ఈ పాట్లు స్త్రీలకు ఎక్కువనుకుంటే దోషము కాదు.

ఒకానొక కాలములో ఒంటినిండా నగలు పెట్టుకొని విలువైన పట్టుచీరె కట్టుకొంటేనేగాని స్త్రీలదృష్టిలో ఘనముగా ఉండేదికాదు. మర్యాద, మన్నన, కూడా వీటిమీదనే ఆధారపడి ఉండేవి. కనుకనే క్రీ. 1620 నాటి పింగళి సూరనార్యునిచే సృష్టింపబడిన సుగాత్రి (కళాపూర్ణోదయము లోని పాత్ర) సర్వాలంకార భూషితయై పట్టుపుట్టము ధరించి భర్తయైన శాలీనుని ఆకర్షించాలనీ, అతడి ప్రేమకు పాత్రురాలు కావలెననీ ప్రయత్నిస్తుంది. శాలీనుడు ఇల్లరికపుటల్లుడు. అత్తమామలకు జడిసేవాడు. అతడికి సహజమైన చక్కదనము మీద ఎంత ప్రీతియో, తెచ్చిపెట్టుకొన్న అందముమీద అంత వెగటు. ఆ కారణముచేత ఆమె వివిధభూషణ మహిమకు వెక్కసపడి, ఆమెయెడపరాకునభినయిస్తాడు. మొదటి మూడురాత్రులూ ఆమెను కన్నెత్తి అయినా చూడడు. కాని ఆమె వీతభూషణయై అతడితో సమానముగా పూలతోటలో శరీర కష్టము చేయ తలపెట్టినప్పుడు శాలీనుడు ఆమెను తియ్యగా పలకరించి ఆదరిస్తాడు. కాని ఆమరునాడు ఆమె తిరిగి రత్నాలంకారభూషితయై అతడి శయ్యాగారములో ప్రవేశించి, కనురెప్పలు విప్పని అతనిపరాకు చూచి, విషాదపడుతుంది. అందుకు కారణము అలంకారములడంబమని సుగాత్రి తెలిసికొనలేకపోయింది. అతడు ఇల్లరికపుటల్లుడు కనుక నోటితో చెప్పలేడు. మరి కొన్నాళ్లకు పూదోటలో పనిచేస్తున్న పెనిమిటివద్దకువెళ్లి అతడికి చేదోడుగా పనిచేయ బూనుకొంటుంది. శాలీనుడామె నిరాభరణసౌందర్యముచేత ఆకర్షింపబడి సాదరముగా పలుకరిస్తాడు. అప్పుడామె ఆశ్చర్యముతో పూర్వాపరాలను తలపోసి తనభర్తకు నిరాభరణ సౌందర్యమేగాని రత్నభూషణాదులు ఇంపు కావని గ్రహిస్తుంది.

కాని ఆడంబరమైన అలంకరణనుపట్టి, ఆర్థికస్తోమతనుపట్టి, గౌరవమర్యాదలు చేయటము ఈకాలములో కూడా స్త్రీలకు ఆచారమే. అఖిల భారత మహిళాసంఘముపక్షమున ఇటీవల జరిగిన ఒక సమావేశములో ఖద్దరుచీరె కట్టుకొని సామాన్య వేషములో ఉన్న సోదరి మొదటివరుసలో కూర్చోబోయినది. ఆమెకు అక్కడ వీలుకాదని వాలంటీయర్లు వారించారు. ఆమె మరొకచోటికివెళ్లగా అక్కడావీలుకాలేదు. ఆమె ఇటూ అటూ తిరుగుతుండగా, కూడావచ్చిన మహిళాసంఘకార్యకర్తలు ప్రతినిధులు ఆమెను స్థానికులకు పరిచయము చేస్తూ చెప్పారు. వీరు అఖిలభారత 'మహిళాసంఘకార్యదర్శిని' అని. ఇంత రభసకూ కారణము ఆమె వేషధారణే. ఆమె ప్రాముఖ్యత తెలిసిన తరువాత పత్రికావిలేఖరులు చుట్టూ మూగారు.

కొంతకాలము క్రిందివరకూ హైదరాబాదులో మహిళలనగా ధనవంతులన్నమాట యధార్థము. కనుకనే ఏడుసంవత్సరాల లోపు బిడ్డలను సభలలోనికి తీసుకొని రాకూడదనీ, బయట ఆయాలవద్దనే ఉంచి రావలెననీ కరపత్రములలో ప్రకటించేవారు. (అఖిలభారతమహిళాసంఘము యొక్క-హైదరాబాదు శాఖవారు). ఆయాలను నియమించుకోలేని సామాన్య గృహిణులు పిల్లలతో రాగూడదని దాని గూఢార్థము. ఆయాలను నియమించుకొన కలిగినవారు మాత్రమే సమావేశమయి, సామాన్యప్రజల సమస్యలను చర్చించేవారు. ధనవంతుల ప్రాముఖ్యముతో పోటీచేయటానికి సామాన్యులు అవలంబించే పద్ధతులలో ఆడంబర వేషధారణ మొకటిగా పరిగణింపబడేది.

గాంధీమహాత్ముడు తనచుట్టూచేరి సలహాలిమ్మనీ, అభిప్రాయాలిమ్మనీ అడిగే స్త్రీలకు పదేపదే ఈవిషయాన్ని బోధిస్తూ ఉండేవాడు 'బాహ్యాడంబరాలకు పోక మీలో అంతశ్శక్తులను పెంపొందించుకోండి. మీ స్త్రీల కష్ట సుఖాలను అర్థము చేసుకోండి, సాటిస్త్రీల కష్టసుఖాలను అర్థము చేసుకోకుండా సంఘసేవ చేయాలని బయలుదేరటములో అర్థములేదు. నామాటలు మీకు కఠినముగా తోచినా సత్యదూరము కావు' అని.

పటాటోపమూ దాని ప్రభావమూ అవిచ్ఛిన్నముగా లోకాన్ని పాలిస్తుంటే, పాపము, విద్యార్థినులూ ఉపాధ్యాయులూ నిమిత్తమాత్రులు కాదూ? ★

సులభమైన రాత్రి పగలు చర్మ రక్షణ సాధనతో మీ చర్మమును సొగసుగ మరియు మనోహరముగ ఉంచుకొనండి

మీకు సంపూర్ణమైన సౌందర్య రక్షణకు రెండు ఆశ్చర్యకరమైన క్రీములు—పాండ్స్ కోల్డ్ క్రీమ్ మరియు పాండ్స్ వేనిషింగ్ క్రీమ్.

చర్మమును నిర్మలముగ, మృదువుగా చేయుటకు రాత్రి వాడే క్రీమ్



పాండ్స్ కోల్డ్ క్రీమ్ అద్భుతముగ చర్మమును శుభ్రపరచును! మీరు పడుకునే ముందు పాండ్స్ కోల్డ్ క్రీమ్ వాడండి—రోమ రంధ్రములు పెద్దవి కాకుండా రక్షణనిచ్చి, మీ చర్మమును బహు నిర్మలముగ, నిష్కళంకముగ ఉంచును. పాండ్స్ కోల్డ్ క్రీమ్ వాడిన కొన్ని సెకండ్లలోనే మీ చర్మమునకు కావలసిన సహజమైన నూనెలు మరియు తేమ లోపములను పూర్తిచేసి మీ చర్మమును లేతగా మరియు మనోహరముగా ఉంచుటలో సహకరించును.

మీ చర్మమును కాపాడుటకు మరియు సుందరముగ చేయుటకు పగలు వాడే క్రీమ్



జిడ్డులేని పాండ్స్ వేనిషింగ్ క్రీమ్ కేవలము పైపైన రాసుకుంటే పగటివేళ మీ అందమును అధికము చేస్తుంది. మీ ముఖమును సొగసుగ మరియు మనోహరముగ ఉండేలా చేస్తుంది. దుమ్ము, సూర్యరశ్మి మరియు వడగాడ్పుల నుండి యిది మీ చర్మమునకు రక్షణ నిచ్చును.

మరియు పాండ్స్ వేనిషింగ్ క్రీమ్ మరీ జిడ్డుగా ఉండే చర్మమునకు ఒక అద్భుతమైన సాధనము. అధికమైన జిడ్డును, రోమరంధ్రములను అడ్డే జిడ్డుగా నుండే నిర్జీవమైన చర్మ పొరలను పోగొట్టును. మీ చర్మము అతి నిర్మలముగ తేలికగ కనపడును.





ప్రతిచోట అందమైన స్త్రీలు వారి సౌందర్య రక్షణకు ఈ సులభమైన రెండు క్రీములనే నమ్ముతున్నారు. మీరూ వారివలె పాండ్స్ కోల్డ్ క్రీమ్ రాత్రి మరియు పాండ్స్ వేనిషింగ్ క్రీమ్ పగలు వాడండి. త్వరలోనే నవవికసిత పుష్పమువలెనున్న మీ ముఖవర్చస్సుకు మీరు చకితులౌతారు.

పాండ్స్ కోల్డ్ క్రీమ్ / వేనిషింగ్ క్రీమ్

మధ్యదశలో సహవిద్య సమంజసంకాదు

[ఏ. ఆర్. సుహాసినీ ఫిలిప్]

[శ్రీమతి ఏ. ఆర్. సుహాసినీ ఫిలిప్ యం. ఏ., యం. ఇడి. గారు 14 సంవత్సరాల అధ్యాపకానుభవం కలవారు. ప్రస్తుతం మద్రాసు సెంట్ క్రిస్టాఫర్స్ ట్రెయినింగ్ కాలేజిలో మనస్తత్వశాస్త్ర శాఖలో అధ్యాపకురాలుగా ఉన్నారు.]

అనేక పాశ్చాత్య దేశాలలో "సహవిద్యా విధానము" సర్వసాధారణమని శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవిగారి వ్యాసమువల్ల తెలుస్తూంది. మన కుటుంబాలలో, దినందిన జీవితాలలో బాలబాలికలు కలసి మెలసి జీవించడమే స్వభావసిద్ధము. వారిని వేరు చేసి ప్రత్యేకముగ పాఠశాలలు నిర్మించడమువల్ల, వారు కృత్రిమ వాతావరణములో పెరుగుతారనీ, అందువల్ల పాఠశాలలను విడిచిన తరువాత వారికి ఒకరిపట్ల మరియొకరు ఎలా నడచుకోవలసిందీ తెలియక తికమక పడతారనీ, తద్వారా అనేక అసందర్భాలు కలుగుతాయనీ వీరి అభిప్రాయము. బాలబాలికలు కలసి చదువుకొంటే వారిలోగల భేదభావము క్రమేపి నశించి, ఒకరితో ఒకరు అనవసరమైన బిడియమూ, సంకోచమూ లేకుండా సంప్రతింపగలరనీ, అందువలన వారికి సాంఘికంగా, మానసికంగా అనేక లాభాలున్నాయని వీరి వాదన. అందుకే పాశ్చాత్య దేశాలలో 'సహవిద్యా విధానము' చాలమట్టుకు అభివృద్ధి చెందినది.

అయితే, మన దేశంలో ఈ 'సహవిద్యా విధానము' ఎంతవరకు ఆచరణీయము అనే విషయము మనము ఆలోచించాలి. మన దేశాచారములకు, సాంప్రదాయములకు ఈ విద్యావిధానము ఎంతమట్టుకు ఉపకరించగలదు?

పాశ్చాత్య దేశాలలోవలె మన దేశంలో యువతీ యువకులు కలసి మెలసి తిరగడము చాల అరుదు. అంత స్వేచ్ఛ మన దేశానికి ఇంకా రాలేదు. ఒక విధంగా రాకపోవడమూ మంచిదే! మన దేశంలోని సాంఘిక నిబంధనలు మన గృహస్థజీవితాలను పవిత్ర బంధములుగా జేసి, విదేశాల్లోని విడాకులనే చీడపురుగు మన సంఘానికి అంటకుండా కాపాడుతున్నాయి. ఈ కట్టుబాట్లు మన కుటుంబ జీవితాలను సంరక్షించే 'గట్టు రేవు'లనే చెప్పవచ్చును. స్థూలంగా చెప్పాలంటే మన దేశంలోని సాంఘిక వాతావరణము ఇలాంటిది.

ఇటువంటి వాతావరణములో 'సహవిద్యా విధానము' ఎంతవరకు సమంజసము? బాలుర పాఠశాలలోని బాలికల జీవితాలను పరీక్షించడమువల్ల, బాలబాలికల శారీరక, మానసిక, సాంఘికాభివృద్ధులను పరిశీలించడమువల్ల ఈ "సహవిద్యా విధానము" మన దేశంలో ఎంతమట్టుకు ఆచరణీయమో తెలిసికో గలము. -

శైశవాపరదశలో (5 సం॥ మొదలు 8 సం॥ వరకు) బాలబాలికలమధ్య పోట్లాటలు గాని, వేరు వేరుగా ఆడుకోవడము గాని ఉండదు. బాలబాలికలు ఏవిధమైన ఆటంకాలు లేకుండా, కలసి మెలసి ఆటలాడుకొంటారు. బాల్యదశలో (8 11) బాలబాలికలలో ఈ భేదము కొద్దిగా తలచూపుతుంది. ఒకే తరగతిలో కలసి చదువుకొంటున్నా, బాలికలంతా కలసి ఒకటిగా చేరి కబుర్లాడుకోవడము, ఆటలాడుకోవడము జరుగుతుంది. బాలురు అంతే - వారి అభిరుచులు వేరు. ఆటలు వేరు కాని వారి మధ్య భేదాభిప్రాయాలు అంతగా ఉండవు.

తారుణ్యదశలో (11 19) బాల, బాలికలమధ్య ఈ భేదభావము ప్రస్ఫుటమౌతుంది. ఈ దశలో వారిరువురిలో కలిగే శారీరకమైన మార్పులు ఇద్దరిలో ఒకవిధమైన సిగ్గును సంకోచాన్ని కలుగజేస్తాయి. ఆ తొలియౌవనము వారిలో సహజమైన సిగ్గును, ఏదో వ్యక్తముకాని ఆందోళనను, అనుభూతిని కలుగజేస్తుంది. బాలికలు అనవసరముగా (కొన్నిసార్లు) వెకిలిగా నవ్వడము సహజము. ఈ దశలో తాము గౌరవించే పెద్దలను ఆదర్శనీయులుగా స్వీకరించి వారిని అనుకరించడమూ జరుగుతుంది. బాల బాలికలమధ్య ఒకవిధమైన "ఆకర్షణ" ఏర్పడుతుంది. బాలురు బాలికలనూ, బాలికలు బాలురనూ ఆకర్షించడానికి వేషభాషలు సాధనంగా ఉపయోగించడము సర్వసాధారణముగా జరిగేసంగతే -

బాలబాలికల అభివృద్ధులను, వివిధ దశలలో గమనించడమువలన తేలిన సారాంశమేమంటే, ప్రాథమికదశలో అంటే 1-5 తరగతులలో బాలబాలికలు కలసి చదువుకొనడములో ఏమి కష్టాలు లేవు. ఈ దశలో వారికి తల్లులైన ఉపాధ్యాయినులద్వారా పాఠములు చెప్పించగలిగితే, ఇంటిదగ్గర వారుపొందే తల్లిప్రేమకూడ లభ్యమౌతుందని విద్యావేత్తల అభిప్రాయము. ప్రాథమికదశలో "సహవిద్యావిధానము" ఆవశ్యకము అని చెప్పకపోయినా ఉండడమువల్ల కలిగే నష్టాలు లేవు.

విద్య సక్రమంగా కొనసాగడానికి ప్రశాంత వాతావరణము అవసరము ఇటువంటి ప్రశాంతవాతావరణము తారుణ్యదశలోనున్న బాలబాలికలకు "సహవిద్యా విధానము" వలన ఎంతవరకు లభిస్తుంది? తారుణ్యదశలో "సహవిద్యావిధానము" గల పాఠశాలల్లోని విద్యార్థినుల పాఠశాలా జీవితాన్ని పరికించితే, ఎంతమట్టుకు ఈ విద్యా విధానము ఆచరణీయము అనే విషయము తెలుస్తుంది.

బాలురపాఠశాలల్లో ముఖ్యంగా కళాశాలల్లో విద్యార్థినులు ఉపాధ్యాయుడు లేదా లెక్చరర్ వచ్చేవరకు తరగతికి వెళ్ళరాదు. వెళ్ళరుకూడా - అంటే అక్కడి పరిస్థితిని అర్థము తీసికో వచ్చునుకదా? విద్యార్థినులను మొదటి సీట్లలో కూర్చుండబెట్టడమెందుకు? ఇవన్నీ విద్యార్థుల గోలనుండి తప్పించడానికి చేసే ప్రయత్నాలు కావా? అయితే ఒక్కమాట మునుపటిదినాలవలె ఇప్పుడు తర

గతిలో ఆడపిల్లలను చూడగానే ఈలలు వేయడము, పిచ్చి కేకలు పెట్టడం, కూని రాగాలు తీయడము చాలమట్టుకు తగ్గిపోయాయి. కాని ఇంకా మగపిల్లల బడులలోగాని, కళాశాలల్లోగాని విద్యార్థినులకు తగినంత స్వేచ్ఛ, తమ తెలివితేటలు చూపగలిగే అవకాశాలు, తమలోని ప్రతిభ (*talent*) చూపే తరుణాలు చాలమట్టుకు తక్కువ.

విద్యార్థినులు ఆటలో నేర్పు చూపినా, వాగ్వాదాలలో పాల్గొన్నా పేర్లు పెట్టి పిలవడము విద్యార్థులకు పరిపాటైనది. అంతటితో బాలికలు తమ ప్రయత్నాలనుండి విరమించి, ప్రక్కకు తప్పుకొంటారు. ఒకటి రెండు ప్రయత్నాలలో ఆవిద్యార్థిని ప్రతిఘటించిందంటే ఆమె తన ప్రయత్నాలకు (చదువుకుకూడా) స్వస్తి చెప్పించేటంతవరకు మన సోదరులు వారిని విడువరు. పోనీ ఏదైనా ఒక పాఠములో ఫస్టున వచ్చిందంటే "ఏమోయ్ బలే ఛాన్సు కొట్టేశావే!" అని ప్రక్క విద్యార్థిననడమో, లేదా ఆమె "లెక్చరర్ గారి ప్రియశిష్యురాల" నే పట్టము కట్టడమో జరుగుతుంది. ఈపైన వివరించినవి బాలుర పాఠశాలలో లేదా కళాశాలల్లో విద్యార్థినులు పడే "అగచాట్ల"లో కొన్ని మాత్రమే.

"విద్యార్థినులవలన విద్యార్థులకేమి కష్టాలు లేవా?" అని అంటారేమో! ఉండవచ్చు, కాని అవి, ఈ "అగచాట్ల"ముందు లెక్కింపతగినవి కావు. పైగా బాలురకు తమ సంస్థలలో స్థానబలిమి ఎక్కువ కదా? విద్యార్థినులకు స్త్రీ సహజమైన బిడియము ఎప్పుడూ వెన్నంటుతూంటుంది. దీనిని ప్రతిఘటించి తిరుగగల విద్యార్థిని ఉండడము అరుదు.

ఇలాంటి పరిస్థితులలో విద్యాభ్యాసము జయకరంగా కొనసాగుతుందా? విద్యార్జన జయకరము కావాలంటే ప్రశాంతవాతావరణము, స్వేచ్ఛ అవసరము. ప్రతి నిమిషము ఎవరో ఒకరు (లేదా చాలమంది), తనను, తాను చేసే ప్రతిపనిని సూక్ష్మదృష్టితో, పరిశీలిస్తున్నారంటే, స్వాభావిక ధోరణిలో మసలుకోవడము అనుభవశాలురకే కష్టము, అటువంటప్పుడు తారుణ్యదశలో సహజంగా సిగ్గుపడే బాలికలకు మరింత కష్టము కాదా?

బాలికలు ఇటువంటి సమిష్టి పాఠశాలలో చదివేటప్పుడు తమకుగల ప్రతిభను పాఠములలో, ఆటలలో, ప్రణాళికేతర విషయాలలో (నాటకము, భాషా సమాజాలు, గైడింగ్ రెడ్‌క్రాస్, క్లబ్బులలో) చూపగల అవకాశాలు చాల కొద్ది. అవకాశమున్నా, అల్లరికి జడిసి ఊరుకొంటారు.

బాలికలకు ప్రత్యేక పాఠశాలలు, కళాశాలలుంటే, వారి సహజ ప్రజ్ఞకు తగిన దోహదము లభిస్తుంది. నిరాటంకముగా, నిర్భయంగా స్వేచ్ఛావాతావరణములో బాలికలు ఆటలలో తమ ప్రావీణ్యాన్ని, తమ పాండిత్యాన్ని, వాగ్వాద, సంగీత, నాటక, నృత్యాగులలో తమ పాటవమును చూపించి రాణించగలరు.

మరో విషయము. బాలుర సంస్థలలో చదివే బాలికలకు గృహనిర్వాహక కళలలో (*Household arts*) ప్రవేశము కలుగదు. బట్టలు కుట్టడము, గృహాలంకరణ, పాకకళ, శిశుసంరక్షణ, గృహవైద్యము మున్నగు గృహవిషయాలలో తగిన శిక్షణ కలుగదు. జీవితములో స్త్రీలబాధ్యతలు వేరు. వారికి పాఠశాలలో ఇచ్చు శిక్షణ వారి భావిజీవితములోని బాధ్యతలను దిద్దుకొనడానికి ఉపయోగపడకపోతే విద్యవలని ప్రయోజనమేముంది? బాలికలకు గృహాలను దిద్దుకొనడానికి కావలసిన గృహనిర్వాహక కళ లభ్యసించాలంటే వారికి అవకాశము బాలికా పాఠశాలలోనే దొరుకుతుంది.

కనుక తారుణ్యదశలో బాలబాలికలకు విద్య ప్రత్యేకమైన బడులలో గఱపడము సమంజసము. ఈ తారుణ్యదశలో కలుగు మార్పులరీత్యా చూచినను, బాలికల భావిజీవితమునకు తోడ్పడు విద్య నేర్పించవలసినట్లయినను, బాలికలను బాలురుచేయు అల్లరిబారినుండి తప్పించి, వారి సహజ ప్రతిభకు తగు దోహదము కలుగజేయాలన్నా, ఈ దశలో వారికి "సహవిద్యా విధానము" కంటే ప్రత్యేక బడులుండుటయే శ్రేయోదాయకము.

పోస్టు గ్రాడ్యుయేట్ తరగతులలో "సహవిద్యా విధానము" వలన నష్టములు లేవు. పైపెచ్చు, లాభములు అధికము. అప్పటికి యువతీ యువకులలో తారుణ్యదశలోని "ఆందోళన" "చిలిపితనము" మాటుపడి, సహజ గాంభీర్యము అలవడుతుంది. ఈ తరగతులలో స్త్రీ పురుషులు ఒకరి దృక్పథాన్ని మరియొకరు అర్థము చేసికొనగలుగుతారు. విశాలదృష్టి అలవడుతుంది. మంచి అనుభవజ్ఞానాన్ని సంపాదించుకొంటారు.

బాలికలు ప్రత్యేకపాఠశాలలో కళాశాలలో చదవడమువల్ల వారికి బాలురతో సరియైనవిధమున కలసి మెలసి తిరగడానికి చేతకాదనియు,' ఇది అసందర్భప్రవర్తనకు

వనితాలోకం:

సహవిద్య: తెలుగుపాఠ్యగ్రంధాలలో శృంగారం

డి. కనకరత్నం

సహవిద్య అమలులో ఉన్న ఉన్నత పాఠశాలల్లోనూ కాలేజీలలోనూ తెలుగు మాష్టారి అవస్థ చెప్పతరం కాదు. ఈపాఠ్యగ్రంథాలను సెలక్ట్ చేసేవారికి పిల్లలకు శృంగారరసమే వంటబట్ట నివ్వాలనే ఉద్దేశ్యంఅంతో ఇంతో గట్టిగా ఉండి ఉంటుంది. ఆశృంగారం ఆయన చెప్పలేడు. మగపిల్లలు చెప్పమని వేధించుతారు. ఆయన చెప్పినపుడు మగపిల్లలు నవ్వంగా వింటే తంటా లేదు. కానీ మధ్యలో సకిలింపులూ. ఇకిలింపులు. తెలుగుమాష్టారు చెప్పేదానికిసిగ్గుపడకపోయినా, దానిపై వచ్చే విద్యార్థుల వ్యాఖ్యానాలకు విద్యార్థినులకు సిగ్గుతో చచ్చినంత పనౌతుంది. మాష్టారు అర్థం చెప్పటం ఆలస్యం "నాకు తెలియలేదు సార్ ఇంకొకసారి చెప్పండి" "బింబాధర అంటే ఏమిటండీ ... అధరామృతం ఎక్కడుంటుందండి." అంటూ ప్రశ్న పరంపర.

"కాటుక కంటినీరు........" "జలజాతాసన వాసవాది..." పరుమాచు న్వరు చూచు" ఇత్యాదిపద్యాలకు అర్థాలు, అలంకారాలు చెప్పటానికి భయపడతారు తెలుగు మాష్టారు. కాని ఇది అంతా విద్యార్థుల తప్పేనా అనేది సందేహమే. సహవిద్యావిధానం మాధ్యమిక పాఠశాలల్లోనే దుస్సహంగా కనపడుతుంది. ఆదశలో వారు బాలబాలికలా, యువతీయువకులా అన్నట్లు ఉంటారు. ఏపనీ చేతకాదు, చేతకానిది లేదు - మిడిమిడిజ్ఞానంతో ఇది యుక్తము ఇది అయుక్తము అని తెలుసుకోలేని స్థితిలో ఉంటారు. ఆవేళ ఎక్కువ, అసలు తక్కువ అన్నట్లు మెలుగుతారు. కనుక ఈవయసులో అట్లా కలిసి ఉండనీయటం బాలబాలికల కిద్దరికీ బాధగానే ఉండి. ప్రాథమికంలో ఊహ తెలియని రోజులు. ఉన్నతవిద్యలో తమనితాము దిద్దుకోగల సమర్థులు. ఆదశలలో సహవిద్యవలన పెద్ద నష్టము లేదు. కాని ఈ 12-20 ఏళ్ల మధ్య వయస్సులో బాలబాలికలను కీచులాడుకునేటంత సన్నిహితంగా ఉంచటం అంత మంచిదికాదు. 14 ఏళ్ల వయస్సప్పటికే పిల్లలకు మంచి నడవడికనేర్పాలన్నారు విశ్వకవి ఠాగూరు - అప్పుడు పొంగే వయస్సు. పొంగేపాలను పాత్ర పొయ్యిలో పడనీయకూడదు - మజ్జిగజల్లి విరచనూకూడదు.

★

★ మధ్యదశలో సహవిద్య సమంజసంకాదు ★


దారితీస్తుందనీ వారిప్రవర్తన అస్వాభావికంగా ఉంటుందనీ కొందరి విమర్శ.

ఈ లోపము నవరించడానికి వేరువేరు పాఠశాలల్లోని బాలబాలికలు కలసికొనుటకు కొన్ని సన్నివేశాలు ఏర్పాటుచేయడము అవసరము. కొన్నిసార్లు వాగ్వాదములలో వక్తృత్వ నాటక పోటీలలో పాల్గొనుటకు వారిని ప్రోత్సహించవచ్చును. ఉత్సవసమయాలలో (దసరా, దీపావళి సందర్భములలో) సమష్టి కార్యక్రమాలను సిద్ధపఱచి పాల్గొనడము, సమష్టిగా మాగజైన్ నడపడము, సమష్టిగ్రంథాలయములు స్థాపించడమూ - మున్నగు ఏర్పాటులవలన బాలబాలికలు ఒకరితోనొకరు కలసి మెలసితిరిగే అవకాశాలు కల్గించవచ్చును.

పాశ్చాత్యదేశాలలో, (మనదేశంలోకూడ కొన్ని ఆంగ్లపాఠశాలల్లో) మరో ఏర్పాటున్నది. ఒకేయాజమాన్యముక్రింద బాలబాలికలకు ఒకేపాఠశాల ఉంటుంది. కాని ఈ పాఠశాలలో బాలురకు, బాలికలకు వేరువేరు "డిపార్టుమెంటు" లుంటాయి. ఒకే పాఠశాలకు చెందినప్పటికీ, బాలబాలికలకు వేరువేరుతరగతులు, ఉపాధ్యాయ ఉపాధ్యాయిను లుంటారు. ఉత్సవదినాల్లో, విశేషసందర్భాలలో బాలబాలికలు ఒకే కార్యక్రమములో పాల్గొంటారు. ఈ పాఠశాలలు సహవిద్యావిధానంలోని లోపాలను, ప్రత్యేక పాఠశాలలోని కొరతలను పరిహారము చేస్తాయని పలువురు విద్యావేత్తల అభిప్రాయము.

ప్రాథమికదశలోను, పోస్టు గ్రాడ్యుయేటు (*Post-Graduate Classes*) తరగతులలో "సహవిద్యావిధానము", తక్కిన దశలలో అనగా మాధ్యమిక ఉన్నత పాఠశాలలలో, కళాశాలలో బాలబాలికలకు ప్రత్యేకపాఠశాల లుండడము, వారికి వ్యక్తిగతంగా, సాంఘిక సంక్షేమకరంగా, మానసిక శాస్త్రరీత్యా ఎంతయో సమంజసము.

★



మఱ్ఱి మాత

★

కవిరావు

కోనేటి గట్టుపై
కోటి కొమ్మలు చాచి
నీడ నిచ్చుచునున్న
ఊడల్ల మఱ్ఱీ!

కోనేటి గట్టుపై...

పిట్టబాళ్ళెంత తన
పొట్టమేతకు బోవ,
బొట్టెలను ఉయ్యాల
తొట్టె నూపినయట్లు,

కొమ్మలూపుచును ఆ
కులతోడ సంగీత
మాలపించెదవు భా
వాతీతముగ నీవు

కోనేటి గట్టుపై...

పల్లెలో నున్నట్టి
పిల్లలందరు చేరి
ఊడలం దూగెదరు
'ఉయ్యాల జంపాల'

వాలుకొమ్మల నెగిరి
వంచి గుఱ్ఱాలెక్కి
'చల్, చలో' నీపైన
స్వారిచేతురు వారు

కోనేటి గట్టుపై...

తాత తండ్రులనుండి
తరతరమ్ములవారు
బొమ్మరిళ్ళను, కోతి
కొమ్మచ్చులాడిరిట...

కల్లకపటములేని
పిల్లజాతి చరిత్ర
శాశ్వతమ్ముగ నీలొ
శాసనమ్మయి నిలిచె

కోనేటి గట్టుపై...

పిట్టపాపలు పైన
రెట్టవేయుచునున్న,
బాలులెందరొ క్రింద
గోలచేసిన గాని

కన్నతల్లి విధాన
కలత జెందవు సుంత.
మాతలకు మాత వే
మఱ్ఱిమాతా! నీవు.

కోనేటి గట్టుపై...



కొదమ సింగము

1

ఆడసింహ మొకటి
అనుగు బిడ్డతోడ
కొండగుహను కూరు
చుండె నొక్కనాడు.

2

అంతలోన నచటి
కాడ నక్క యొకటి
వచ్చి దానిజూచి
మచ్చరించి పలికె:

3

"తడవ కొక్కపిల్ల
తప్ప పెట్టలేవు.
నన్నుజూడు కాన
లెన్నిగలవొ నాకు?"

4

అంత సింహమనెను:
"అట్టి కొదమసింగ
మొక్కటున్న చాలు,
నక్క లేల వేలు?

5


వలయునన్న చూప
గలను దీని నిజము"
అనుచు తనదు బిడ్డ
గనుచు సైగచేసె.

6

పిల్ల సింహ మొక్క
పెట్టు నెగిరి దూక
దిక్కుచచ్చి నక్క
పిక్క బలము చూపె.

ఈసప్ కథలు: 13

నండూరి రామమోహనరావు



నీతి

రాళ్ల గంపెడున్ననేమి ?
రత్న మొక్కటైన చాలు.

విలువ కట్టవలయునన్న
తెలియవలయు వస్తుగుణము.

(పెద్దకథ)

పౌరుష్యము

సుమారు రెండువేల మూడు వందల సంవత్సరాల క్రితం జరిగిన కథ ఇది.

అనగా అలెగ్జాండరు మన దేశంమీదకు దండెత్తి వచ్చిన రోజులలోనన్నమాట.

అలెగ్జాండరంటే మన దేశానికి పడమటగానున్న గ్రీసు దేశంలోని మాసిడోనియా అనే ప్రాంతానికి రాజు. ఆ రాజ్యం చిన్నదే కాని అతని ఆశ మాత్రం చాలా గొప్పది. అలెగ్జాండరుకు ప్రపంచాన్నంతా జయించాలన్న కోర్కె పుట్టి, అతడు దండయాత్ర సాగించాడు. ఒక్కొక్క దేశాన్నే జయించుకుంటూ వచ్చి, మన దేశం ప్రవేశించాడు.

మన దేశం వాయవ్య దిశలో హిందూకుష్ పర్వతాలున్నాయి. ఆ పర్వతాలలో కనుమలు చాలా ఉన్నాయి. ఆ కనుమలద్వారా గ్రీకు సైన్యం వచ్చి పంజాబు చేరుకుంది.

పంజాబ్ అంటే ఐదు నదులుగల దేశం. వాటిలో జీలం, చీనాబ్ అనేవి రెండు. ఆ రెండింటి మధ్యాగల ప్రాంతాన్ని ఆకాలంలో పురుషోత్తముడనే రాజు పరిపాలిస్తుండేవాడు.

ఆ పరిసరాలలో ఇంకా చిన్నచిన్న రాజ్యాలు చాలా ఉండేవి. తక్షశిల రాజ్యం వాటిలో ముఖ్యమైనది. ఆ రాజ్యాన్ని 'అంభి' అనే రాజు పాలించేవాడు. అంభి గొప్పరాజే గాని అపారంగా వస్తోన్న గ్రీకు సేనల్ని చూసేసరికి ఆతడు హడిలిపోయి, యుద్ధం చెయ్యకుండానే లొంగిపోయి, అలెగ్జాండరుకు కప్పం కట్టడానికి ఒప్పుగున్నాడు.

పురుషోత్తముడు మాత్రం అలాగ బెదిరిపోలేదు. అతడు తన సేనలతో అలెగ్జాండరు సైన్యాన్ని ఎదుర్కొన్నాడు.

కాని యుద్ధంలో పురుషోత్తమునకు ఓటమి తప్పిందికాదు. అతణ్ణి ఖైదీగా చేసి తీసుకుపోయి, గ్రీకుసైనికులు అలెగ్జాండరు చక్రవర్తిముందు నిలబెట్టేరు.

'పురుషోత్తముడ'నే మాట సరిగా పలుకలేక అలెగ్జాండరాతణ్ణి 'పోరస్' అని పిలిచాడు. అలెగ్జాండరు మహాయోధుడు గనుక తన సేనలతో మహాపరాక్రమంతో పోరిన పోరస్ అంటే అతనికి కోపానికి బదులు గౌరవభావం ఏర్పడింది. 'పోరస్, నిన్ను ఎలా గౌరవించమంటావు?' అని అడిగాడు.

'రాజవలె గౌరవించు!' అన్నాడు పురుషోత్తముడు. ఖైదీగా వచ్చికూడా నదురూ బెదురూ లేకుండా ఠీవిగా మాట్లాడిన పోరసును చూస్తే అలెగ్జాండరుకు గౌరవం మరీ ఎక్కువై, ఎంతో ఔదార్యం కనపరుస్తో 'పోరస్, నిన్ను రాజవలె గౌరవించాలంటే నీ రాజ్యం నీకిచ్చెయ్యాలన్నమాట! ఇచ్చేశాను, పుచ్చుకో!' అని అతని బంధాలు విడిపించి, సత్కరించి పంపేశాడు.

అలెగ్జాండరు ఔదార్యాని కందరూ మెచ్చుకున్నారు. కాని ఆయన మంచితనం, నేర్పూ ఆయన సేనాధిపతులలో ఎవరికీ లేదు. అలెగ్జాండరు సేనాధిపతులలో ముఖ్యుడు 'సెల్యూకసు'. తాను జయించిన పంజాబుకు సెల్యూకసును పాలకునిగా చేసి, అలెగ్జాండరు సేనలతో ముందుకు సాగిపోయాడు. పోతూ సెల్యూకసుతో, 'ప్రజల్ని అనవసరంగా పీడించకు సుమా. దయా, సానుభూతీ కనపరుస్తో ప్రజల హృద

★ పొలంకి వెంకటరామచంద్రమూర్తి ★

యాలను వశం చేసుకోవాలి కాని క్రౌర్యం చూపరాదు.' అని బోధించాడు.

కాని ఆ బోధ సెల్యూకసు పట్ల, బూడిదలో పోసిన పన్నీరులాగ వృథాఐంది. సెల్యూకసుకి భారతీయులు అంటే ప్రేమ, గౌరవం లేదు సరిగదా వాళ్లంటే 'పశువులకన్నా తక్కువ' అనే భావం ఏర్పడింది. నాయకుణ్ణి అనుసరించే తక్కిన గ్రీకులుకూడా భారతీయులనుగురించి మాట్లాడవలసివచ్చినప్పుడల్లా 'మృగాలు' అంటూండేవారు.

పురుషోత్తమునకు అలెగ్జాండరు స్వయంగా

రాజ్యం ఇప్పించేశాడు గనుక దక్కింది. అతనితో పాటు యుద్ధంలో ఓడిపోయి రాజ్యాలుపోగొట్టుకున్న తక్కిన చిన్నరాజుల రాజ్యాలేవీ, వారికి తిరిగీ వశం కాలేదు. వాళ్లంతా, 'మీకు మేము కప్పాలు కడతాం. మా రాజ్యాలు మమ్మల్ని ఏలుకోనివ్వండి.' అని అలెగ్జాండరు చక్రవర్తికి మహజర్లు పంపుకున్నారు కాని, సెల్యూకసు వాటిని చక్రవర్తికి చేరనివ్వక, బుట్టదాఖలు చేసి, ఆ రాజ్యాలన్నీ ఊడపెరుక్కున్నాడు. అలాగ రాజ్యాన్ని పోగొట్టుకున్న చిన్నరాజులలో పుష్కలావతిరాజు, విశ్వజిత్తు ఒకడు.

విశ్వజిత్తు సెల్యూకసువల్ల తనకు జరిగిన అన్యాయాన్ని సహించలేక తనతోబాటు భంగపడిన తక్కిన రాజులను కొందరిని కూడగట్టుకుని, తిరుగుబాటు లేవదీశాడు. కాని లాభం లేకపోయింది. యుద్ధంలో ఘోరమైన గాయాలు తగిలి, అతడు చాలా అపాయస్థితిలో ఉండగా అతనిగుఱ్ఱం అతణ్ణి రణరంగంలోంచి తీసుకొచ్చేసి రక్షించింది. సెల్యూకసు విశ్వజిత్తుపై రాజద్రోహ నేరం మోపి, 'ఎక్కడున్నాడో వెతికి పట్టుకుని ఉరితియ్యండి.' అని తన సైనికులకు ఆజ్ఞాపించాడు. దానితో విశ్వజిత్తు తన గాయాలు ఆరకుండానే, కట్టుబట్టలతోటీ, భార్యాపుత్రులతోటీ సమీపంలో ఉన్న అరణ్యంలోకి పారిపోయి, అక్కడొక గుహలో తల దాచుకోవలసివచ్చింది.

పుష్కలావతిలో విశ్వజిత్తు నివసించే కోట చాలా చక్కనిది. విశ్వజిత్తు అడవులపాలైన పిమ్మట, ఆ కోటను సెల్యూకసు తన మిత్రుడైన రోహిలసుకు ఇనాముగా ఇచ్చి అక్కడ నివాసం ఏర్పరుచుకోమన్నాడు.

రోహిలసు అలెగ్జాండరుకు అనేక యుద్ధాలలో సాయపడి పరాక్రమవంతుడనే పేరు తెచ్చుకున్న యోధుడు. అతడంటే చక్రవర్తికి చాలా అభిమానం. అతడు పంజాబులో స్థిరనివాసమేర్పరుచుకోడానికి నిశ్చయించుకున్నట్లు తెలియటంతోనే చక్రవర్తి, 'నీ కిష్టమైనచోట చక్కని కోట కట్టుకో. దానికమే ఖర్చు నేను భరిస్తాను' అని కబురు చేయించాడు. కాని రోహిలసుకు కోట కట్టుకోవలసిన అవసరమే లేకపోయింది. 'కట్టేవాడొకడూ, అనుభవించేవాడు మరొకడూ' అన్నట్లుగా, విశ్వజిత్తు నిర్మించుకున్న పుష్కలావతి కోట రోహిలసు పరమైంది.

రోహిలసుకు భార్య పోయింది. అతని కొక్క కూతురు తప్ప పిల్లలు లేరు. ఆ బాలిక పేరు హెర్మియా.

ఈ హెర్మియాయే మన కథానాయిక. ఈ పదేళ్ల గ్రీకు బాలిక, ఇరవైమూడు వందల సంవత్సరాల క్రితం, వసంతకాలంలో ఒకనాటి ఉదయం, తన పరివారంతో పుష్కలావతికోటను ప్రవేశించటంతో మన కథ ప్రారంభమైంది.

2

హెర్మియా ఒక తెల్లని చిట్టిగుఱ్ఱంపైన ఎక్కి వచ్చింది. ఆమె ప్రక్కనే, ఎత్తైన ఎర్రని అరబ్బీగుఱ్ఱం మీద ఆమె అంగరక్షకుడైన ఎగెయూసు వచ్చాడు. ఆతడు యాభై యేళ్ల వయసువాడు. ఒడ్డూ, పొడవూగల యోధుడు. వారి వెనకాల మరొక గుఱ్ఱంమీద, ముప్ఫైఐదేళ్ల స్త్రీ ఒకామె వచ్చింది. ఆమెపేరు హిపోలిటా. ఆమె హెర్మియాను పెంచిన దాది. దాదివెనుక గుఱ్ఱాలపైన ఆరుగురు వీరులు కత్తులూ, బల్లేలూ ధరించి వచ్చారు.

'ఎగెయూస్, నాకు ఆయాసంగా ఉంది. ఇంకా ఎంతదూరం వెళ్లాలి?' అంది హెర్మియా.

'ఆ కనపడేదే కోట. వచ్చేశాం' అన్నాడు ఎగెయూసు.

హెర్మియా రికాబులతో గుర్రం పక్కలను నొక్కి పరుగెత్తించింది దానితో తక్కిన గుఱ్ఱాలుకూడా వేగాన్ని హెచ్చించాయి. వాళ్ళంతా మరొక కొంతసేపటిలో పుష్కలావతికోట ప్రవేశించారు.

'ఎంత అందంగా ఉన్నాయో ఈ పూల మొక్కలు! ఈ ఉద్యానవనాన్ని మా నాయనేనా వేయిస్త? ఈ రాతిగోడలు ఈగవాలితే జారిపోయేటట్లు ఎంత నున్నగా ఉన్నాయో!' అంది హెర్మియా

'ఇక్కడ మీ నాయన కట్టించబోయే భవనం ఇంకా ఎంతో అందంగా ఉంటుందమ్మా. అలెగ్జాండరు చక్రవర్తి వస్తే ఉండటానికి తగ్గ మేడ ఒకటి కట్టిస్తున్నారు. పునాదులప్పుడే తయారవుతున్నాయి చూడండి.' అన్నాడు ఎగెయూసు.

'ఆ తవ్వేపనివాళ్లు అంత నిరుత్సాహంగా ఉన్నారెందువల్ల?' అంది హెర్మియా.

'యుద్ధంలో ఓడి బానిసలుగా లాక్కురాబడ్డ 'ఇండియన్లు' వాళ్ళు. పనిచెయ్యటమంటే కిట్టదు గాడిదలకి!' అన్నాడు ఎగెయూసు.

'మనుషుల్ని పట్టుకుని గాడిదలంటా డేమిటి?' అనిపించింది హెర్మియాకి. ఆమె ఏదో అనబోయింది గాని ఇంతలో ఎగెయూసు, 'ఇదేనమ్మా మీరు ఉండబోయే భవనం. దిగండి!' అన్నాడు.

ఆమె గుర్రాన్ని ఆపింది. ఎగెయూసు తన గుఱ్ఱంమీదనుండి దిగివచ్చి, ఆమెను దింపేడు. ఆమె ఆ సుందరహర్మ్యాన్ని ప్రవేశించి, ఆ నేల నునుపూ, ఆ గోడలమీది బొమ్మల అందమూ చూసి మురిసిపోయింది. 'ఇంతకు ముందు ఈ కోటలో ఎవరుండే వారో?' అని అడిగింది.

'ఎవడో పంది!' అన్నాడు ఎగెయూసు.

'దేవతలుండతగ్గ దివ్యభవనమిది.పందు లున్నాయంటా వేమిటి ఎగెయూస్?' అంది హెర్మియా.

ఎగెయూసు ఆమె అమాయకత్వానికి నవ్వుతూ 'పంది అంటే పంది కాదమ్మా. పందివంటి ఇండియన్ అన్నమాట! వాడి పేరు నాకు సరిగా రాదు. ఇటలీ దేశంలోని అగ్నిపర్వతంపేరు తెలుసా మీకు?' అన్నాడు.

'వెసూవియసు' అంది హెర్మియా.

"వీడి పేరుకూడా అలాంటిదే 'విసుజిసు' అని కాబోలు అంటారు" అన్నాడు ఎగెయూసు. ఆ గ్రీకు సైనికుని నాలుకమీద 'విశ్వజిత్తు' 'విసుజిసు'గా మారవలసివచ్చింది!

'ఈ విసుజిసు ఇప్పు డెక్కడున్నాడు మరి?' అని అడిగింది హెర్మియా.

'ఏమో ఎవరికి తెలుసు? ఏ పొదలోనో గుహలోనో తలదాచుకుని ఉండాలి. బయటకొచ్చి ఏ గ్రీకు సైనికుని కంటబడ్డా వాడిపని ఐపోయిందన్నమాటే! పొడిచి చంపనైనా చంపుతారు, లేకపోతే లాక్కుపోయి బానిసను చేస్తారు!' అన్నాడు ఎగెయూసు.

"అలా చెయ్యటానికి, 'విసుజిసు' చేసిన నేరమేమిటో?" అంది హెర్మియా.

"ఇంతకన్నా ఏంకావాలి? యుద్ధంలో ఓడిపోయినగాడిద, కోటను విడిచి పొమ్మంటే పోక ఎదురు తిరిగితే మహాసేనాని సెల్యూకసు, 'ఎక్కడ దొరికితే అక్కడ, ఎలకను చంపినట్లు బాది చంపండి!' అని ఆజ్ఞాపించాడు." అన్నాడు ఎగెయూసు.

'అంత చంపవలసిన అవసరం నాకేమీ కనపడటంలేదు. పైవాడెవడో వచ్చి మాయింట్లోంచి మమ్మల్ని పొమ్మంటే నా కెంతేనా కోపంవస్తుంది. ఎవడికైనా వస్తుంది కోపం. నీకు రాదూ?' అంది హెర్మియా.

ఎగెయూసు సమాధానం చెప్పలేకపోయాడు. మాట మార్చేసి, ఆమెను ఒక్కొక్క గదిలోకే తీసుకువెళ్ళి చూపుతో, 'ఇది మీ భోజనాలగది; ఇది కుట్టు నేర్చుకునే గది. ఇది పడకగది' అంటూ చూపెట్టేడు.

ఆమె భోజనమయాక పరుండి ఆగది కిటికీలోంచి చూసేసరికి దూరంగా ఉన్న చిట్టడవి కనపడింది. ఆ అడవిలో ప్రవహించే సెలయేటిని చూస్తూ, అక్కడ ఏ చెట్టు కొమ్మపైనుండో వినవస్తూన్న వసంతకోకిల గానము వింటూ ప్రయాణపు బడలికలో ఉండడంచేత కన్నులు ఇట్టే మూతపడి ఆమె నిద్రపోయింది.

3

హెర్మియాతో పుష్కలావతికోటను చేరుకున్న పరివారం, ఆమె అంగరక్షకుడైన ఎగెయూసూ, దాది హిపోలిటా, మరి ఆరుగురు గ్రీకు సైనికులూ అని చెప్పాము. ఆమెతో తండ్రి రోహిలసు రాలేదు. అతడు అలెగ్జాండరుచే జయింపబడిన పారశీక దేశంలో ఏదో తిరుగుబాటు వస్తే దాన్ని అణిచివేయడానికి అక్కడ కొన్నాళ్ళు ఉండిపోవలసివచ్చింది. అందువల్ల కుమార్తెకు దాదినీ, ఎగెయూసునూ, సైనికులనూ సాయమిచ్చి ముందుగా పుష్కలావతికి పంపడం జరిగింది.

ఆ కాలంలో ఇప్పటికిమల్లే ఎక్కడపడితే అక్కడ చదువుకోడానికి బడులు లేవు. గొప్పయింటి బిడ్డలకి తలితండ్రులు ఏ పండితుణ్ణో పెట్టి చదువు చెప్పించేవారు. హెర్మియాకు ప్రస్తుతం అటువంటి యేర్పాటింకా జరుగలేదు. రోహిలసు వచ్చాకనే ఆమెకు చదువు చెప్పే గురువు వస్తాడు. ఈలోగా ఆమె దాది హిపోలిటా చెప్పే కుట్టుపని నేర్చుకుంటూ కాలక్షేపం చేసేది. ఆమె పట్టుగుడ్డలమీద సన్నటి రంగుదారాలతో పువ్వులు కుట్టేది. ఆ పువ్వులమీదికి వచ్చి వాలుతోన్నట్లుగా సీతాకోకచిలుకలను కుట్టేది.

గ్రీకు దేశంలో 'హార్పు' అనే ఒక రకం వీణ ఉంటుంది. ఆ వీణ హెర్మియాకుకూడా ఉందిగాని దాన్ని వాయించడం అంత బాగా ఆమెకు తెలి

యదు. ఐనా ఆమె మధ్య మధ్య దాన్ని తీసి, శాస్త్ర 'టుం, టుం' అనిపిస్తోండేది.

హెర్మియాకు పువ్వులంటే మహాయిష్టం. పుష్కలావతిలో పుష్పాలు పుష్కలంగా పూచేవి. ఒక్కొక్కరకమూ కోసి తెచ్చి దండగా గ్రుచ్చి, తలకు కిరీటంలాగ చుట్టుకునేది. గ్రీకుపిల్లలకు పూలమాలలను కిరీటాలకు మల్లే చుట్టుకోడమంటే సరదా.

బానిసలుగా పనిచేస్తోన్న భారతీయులకు ఆ పిల్ల అంటే మొదట కోపంగానే ఉండి ఆమె వచ్చినప్పుడల్లా మొహం చిట్లించుకునేవారు. కాని క్రమేపీ హెర్మియా అంటే వాళ్లకి అసహ్యం పోయి, ప్రేమ భావం ఏర్పడింది. ఏమంటే ఆమె ఎప్పుడూ వాళ్ళని పలకరించకుండా వెళ్లేదికాదు. గ్రీకుభాష వాళ్ళకి సరిగా అర్థంగాకపోయినా ఆమె మంచిగా పలకరిస్తోందనిమాత్రం వాళ్ళకి తెలుసు. ఆమె వాళ్ళ కేసి చూసి మందహాసం చేసినప్పుడల్లా, ఆ బాలిక అందాలముఖం వాళ్ళకి వికసించిన రోజాపుష్పంలా కనపడి, వాళ్లు కూడా తమ దురవస్థను మరిచిపోయి, చిరునవ్వుతో సమాధాన మిచ్చేవారు. అప్పటి భారతీయులు మాట్లాడుకునేభాష ఒక రకమైన సంస్కృతం. హెర్మియాకు మొదట ఆభాష యేమీ అర్థమయేదుకాదుగాని వాళ్లు తన్ను అసహ్యించుకోవటం లేదనిమాత్రం ఆమె గ్రహించగలిగింది.

పుష్కలావతిలో రోహిలసే గనుక ఉన్నట్లైతే హెర్మియాను ఆ పనివాళ్లవద్దకు పోనిచ్చిఉండడు. ఎగెయాసు కూడా 'వాళ్లు బానిసలు! వాళ్లతో మాట్లాడకూడదు. వాళ్లు మనకు శత్రువులు గనుక నీకేమైనా హాని చెయ్యవచ్చుకూడాను' అంటూండేవాడు కాని హెర్మియా అతడంటే లక్ష్యపెట్టక మధ్యమధ్య తోచినప్పుడల్లా పునాదులు త్రవ్వే ఆ బానిసలవద్దకు పోయి కబుర్లుచెపుతూండేది.

పిల్లలకి ఏ భాషైనా ఇట్టే వచ్చేస్తుంది. హెర్మియాకుకూడా భారతీయులు మాట్లాడే సంస్కృత భాష రావటానికి ఎంతోకాలం పట్టలేదు. ఖర్మంకాలి బానిసలయారు కాని ఆ పనివాళ్ళంతా కాస్తో కూస్తో చదువుకుని స్వాతంత్ర్యంకోసం గ్రీకులతో పోరాడిన యోధులే. వాళ్లలో ఒకడికి ఋగ్వేదంలోని ఇంద్రుడూ, అగ్ని, వరుణుడూ మొదలైన దేవతల కథలన్నీ తెలుసు. ఆ కథలన్నీ వాడు హెర్మియాకు చెపుతూండేవాడు.

'మాకూ ఉన్నారు ఇలాంటి దేవుళ్ళు' అంటూ ఆమె జూపిటరు, మినర్వా మొదలైన గ్రీకుదేవతలను గురించి వాళ్ళకు చెపుతూండేది. 'దేవతలలో మంచి వాళ్ళూ చెడ్డవాళ్ళూ ఉన్నారు. మంచి దేవతలు వర్షాలు కురిపించి ఉపకారంచేస్తే చెడ్డదేవతలు భూకంపాలూ, రోగాలూ తెచ్చిపెట్టి బాధిస్తారు' అని చెప్పేది.

హెర్మియా కబుర్లు వింటూంటే ఆ పనివాళ్లకు సరదాగానే ఉండేదిగాని వాళ్ళపైన పెత్తనం చలాయించే గ్రీకు సైనికులు 'పనిచెయ్యక కబుర్లు చెపుతున్నారా?' అని కోపపడి ముల్లుకర్రలతో పొడుస్తోండేవారు. హెర్మియా సానుభూతి కనబరచబోతే 'నీకెందుకమ్మా, ఈ ఇండియను పందులగొడవ? వెళ్ళి నీపని చూసుకో' అనేవారు.

ఆమె యీడుపిల్ల లెవరూ అక్కడ లేకపోవడం వల్లా, ఆ ఉన్న పనివాళ్ళతో గ్రీకుసైనికు లామెకు కబుర్లు చెప్పనివ్వకపోవటంవల్లా ఆమెకు అంతగా అక్కడ ఊసుపోయేదికాదు. ఇలా ఉండగా, పుష్కలావతికి ఒక ఇరవైమైళ్ళదూరంలో మరొక గ్రీకుయోధుడు తన కుటుంబంతో కాపురం పెట్టడని తెలియవచ్చింది.

హెర్మియా ఎగెయాసుతో, 'నేను నా చిట్టి గుఱ్ఱంమీద వాళ్లయింటికి వెళ్లివస్తాను' అంది. 'వెళ్ళవచ్చుగాని, అక్కడకు అడవిలోంచి వెళ్లాలి. మనమంటే కిట్టని ఇండియన్లు ఒంటరిగా వెడితే నిన్ను ఎత్తుకుపోవచ్చు. అంతేగాకుండా అడవుల్లో దుష్టమృగాలు తిరుగుతోంటాయి. ఏ పెద్దపులైనా ఎదురైతే ఇంక ఏమైనా ఉందా? నిన్నొక్కర్తెనూ పంపటానికి వీల్లేదు. నీ కంతగా వెళ్లాలని ఉంటే గ్రీకు సైనికుల్ని తోడిచ్చి పంపుతాను' అన్నాడు ఎగెయాసు.

వారానికొకమారు ఆమె తన చిట్టి గుఱ్ఱంమీద వెళ్ళి ఆ గ్రీకు కుటుంబంలోని పిల్లలతో ఆడుకుని వస్తోండేది. కూడా ఆమెకు అంగరక్షకులుగా ముగ్గురు గ్రీకు యోధులు గుఱ్ఱాలమీద వెడుతోండేవారు. ఒకమారు వారితోబాటు ఎగెయాసుకూడా వెళ్లాడు. అక్కడ అతగాడికి వాళ్ళు మంచి ద్రాక్షసారాయిని త్రాగటానికిచ్చి ఆదరించారు. హెర్మియాతో, 'ఇంక వారం వారం నీతో నేనే వస్తాను.' అన్నాడు ఎగెయాసు. వాళ్ళుఇచ్చిన మద్యం అంత రుచిగా ఉందన్నమాట!

కాని ఎగెయాసు ఇంక మళ్ళీ అక్కడకు వెళ్ళనేలేదు పాపం. ఏమంటే హెర్మియా, తిరిగి వచ్చేటప్పుడు అడవిలో ఒక గమ్మత్తు చేసింది.

(ఇంకా వుంది.)

పాకవిశారద

శ్రీనివాస కాశ్యప

ఒకసారి మావూరికి, క్రొత్తగా ఎక్సయిజు ఇన్‌స్పెక్టర్ గారువచ్చారు. ఆ రోజుల్లో మా గ్రామంలోనూ, పరిసర గ్రామాలలోనూ, గంజాయి పంట అధికంగా పండించుతూవుండేవారు. అందువల్ల మావూరు ముఖ్య కేంద్రంగావుండేది ఎక్సయిజు డిపార్టుమెంటుకు. ఇన్‌స్పెక్టర్ గారి ఆఫీసూ, కాపురమూ ఒకయింట్లోనే. ఆయన, పరిసర గ్రామాలు తనిఖీకి వెళ్లివస్తూ మావూళ్లోనే హెడ్డాఫీసు వుండడంచేత, అచ్చటనే వుండేవారు.

వారు బెంగుళూరు ప్రాంతానికి చెందినవారు. మధ్వబ్రాహ్మణులు. వారికి కన్నడమేగాని తెలుగు భాష బాగారాదు. ఆ మాట్లాడే కొంచెమైనా, సగం కన్నడంకలిపి మాట్లాడేవారు. వారిపేరు గుండురావుగారు. భాషబాగా రాకపోయినా, ఆయన తెలుగు బాగా అర్థంచేసుకోగలిగేవారు. స్నేహపాత్రుడు. వచ్చినది క్రొత్తవూరు, క్రొత్త భాషా ప్రాంతమైనా, ఇట్టే సంపాదించారు బోలెడుమంది స్నేహితులను. చాలా సరదాయైనవారు గుండురావుగారు. ప్రతివారినీ ఇట్టే స్నేహం చేసుకోగల స్వభావం ఆయనది.

అందులో మావూరు పల్లెటూరూ, పట్నమూ కాని మధ్యరకం బస్తీకావడాన నూటికితొంభై మందికి ఉద్యోగం, సద్యోగం ఉండేదికాదు. అంచేత పనిపాటలు లేని పప్పుధప్పళాల రాయుళ్లంతా, పెందరాళే కాఫీలు, టిఫిన్లు ముగించుకుని గుండురావుగారి యింటికి చేరేవారు. రావుగారు, ఆఫీసూ ఇల్లూ వకటే గనుక (కాంపు లేని రోజుల్లో) ఎప్పుడెవరు వెళ్లినా దర్శనమిచ్చేవారు. ఉదయం ఏ కొద్ది గంటల్లోనో ఆఫీసుపనులు ముగించుకుని వచ్చేపోయే స్నేహితులను, ఆహ్వానించడం, పంపించడం చేస్తూ వుండేవారు. పది గంటలు దాటుతోందనగా, ఒక బాచి వచ్చి వెళ్లిపోయేవారు; భోజనాలు చెయ్యడానికి ఇళ్ళకు. అంతలో రావుగారు కూడా భోజనానికి లేచేవారు.

ఇక మళ్లీ పన్నెండు గంటలు కావస్తోందనగా ఒక్కొక్కరే తయారు. అందరూ కలిసి ఏ చీట్లాటో చదరంగమో ఆడుతూ నాలుగింటిదాకా గడిపి, మళ్ళీ అంతా కలిసి షికారు పోయేవారు.

రావుగారికి ఇద్దరు పిల్లలు. ఆడపిల్ల పెద్దది. లేక లేక పది సంవత్సరాలకు మొగపిల్లవాడు పుట్టాడట. వాడి పేరు రఘుపతి. మావూరు వచ్చేసరికా పిల్లవాడికి సంవత్సరం నిండవస్తోంది. వాడి పుట్టినరోజు పండగ పెద్దయెత్తున చేయదలిచారు రావుగారు; ఒకడే మొగపిల్లవాడవడమూ, అందులో మొట్టమొదటి పుట్టినరోజు కావడము చేత. అదీగాక, ఈ క్రొత్త స్నేహితులందరికీ ఏదో ఒకవంకన డిన్నరుపార్టీ చేయాలని రావుగారి సంకల్పం. ఇవన్నీ కలిసిరావడంచేత, చాలా ఉత్సాహంగా పుట్టినరోజు పండుగ చేయదలిచారు రావుగారు.

ఒకరోజు మధ్యాహ్నం స్నేహితులంతా కూడి, చీట్లపేక ఆడుకుంటూ వుండగా, రావుగారే మెల్లిగా స్నేహితులందరికీ చెప్పారు ఫలానిరోజున మా రఘుపతి పుట్టిన రోజని, మీరంతా సకుటుంబంగా రావాల్సిందనీ. అందుకు మిత్రులంతా చాలా సంతోషంతో వస్తామన్నారు. ఇంతలో రావుగారి భార్య తలుపుచాటున నించుని "మీ స్నేహితులందరినీ, పుట్టినరోజుకు ఆహ్వానిస్తున్నారు బాగానే వుంది; కాని, ఆనాడు వంటబ్రాహ్మణుడు కావాలన్న విషయం మరిచిపోయారల్లే వుంది" అని అన్నది మెల్లిగా.

నిజంగా రావుగారు ఆ విషయం మరచిపోవడంచేత, వారిముందు ప్రస్తావించలేదు. అందువల్ల—

★ పాకవిశారద ★

'అరకేన మయానికి జ్ఞాపకం చేశావు; ఆ విషయం మనమిత్రులకు చెప్పకపోతే ఎవరు కుదిర్చిపెడతారూ," అని కన్నడంలో యిద్దరూ మాట్లాడుకున్నారు. వచ్చి కూర్చున్న మిత్రులంతా, ఏమి మాట్లాడుకుంటున్నారో బోధపడక, ఒకరి మొగాలొకరు చూసుకుంటూ నిశ్శబ్దంగా కూర్చున్నారు ఆట ఆపేసి.

రావుగారు మెల్లిగా అందుకున్నారు వచ్చీరాని తెలుగులో. "ఏమంటోయ్! మీరంతా భోజనాలకు రావడమే గాదు. మనకు కమ్మని వంట చేయగల వంటబ్రాహ్మడిని కూడా మాట్లాడుకు రావాలి సుమీ" అని. మిత్రులందరూ ఏకగ్రీవంగా ఫస్టుక్లాసు వంట బ్రాహ్మడిని తీసుకొస్తామన్నారు. ఇంతలో శాస్త్రి అందుకుని, "మన సుబ్బయ్యను పిలిస్తే సరి, స్వీట్లతో కూడా అమోఘంగా తయారుచేస్తాడు" అన్నాడు.

"ఒరేయ్! భలేవాణ్ణే జ్ఞాపకం చేశావురా! నలభీమపాకాలు. పట్టి కొట్టాల్సిందే మనవాడి వంట ముందర!" అన్నాడు శర్మ.

ఏమయితేనేం, ఆఖరికి సుబ్బయ్యను వంటచేయడానికి పిలుద్దామన్న నిర్ణయానికివచ్చారు అంతా. ఆనాటికి మూడు రోజులుంది పుట్టిన రోజు. అన్నిపనులలోనూ, మిత్రులు ముందు నుంచుని చేస్తామని రావుగారికి హామీ యిచ్చారు. నాటినుంచే ఏర్పాట్లకు ప్రారంభోత్సవం చేశారు. వాకిట్లో చల్లదనానికి, పెద్ద పందిరి వేశారు. ఇలాగే దొడ్లో వంటచేయడానికి పందిరివేసి, అన్ని హంగులూ అమర్చారు మిత్రులందరూ కూడి. ఇల్లు పెళ్లిల్లులా అలంకరించబడింది.

రావుగారు, కాలుకదపకుండా, అన్ని పనులూ లోటులేనివిధంగా, మిత్రబృందమే పూర్తి చేసింది.

* * *

పుట్టినరోజుపండుగనాటి ఉదయం సుబ్బయ్య, సహాయంగా ఇంకొక మనిషిని వెంటబెట్టుకొని వచ్చేశాడు. అప్పటికింకా అతిథులెవరూ రాలేదు. సుబ్బయ్యను చూడగానే రావుగారు కాఫీ టిఫిన్లు తయారు చేయడానికి సామగ్రియావత్తూ అప్పజెపుతూ, వంట ఏమేమి చేయాలో, సుబ్బయ్యకు చెప్పారు వారి భాషలో.

"పుర్ల గడ్డకరి మాడబేకు, బేడా హుళీ మాడబేకు, రస మాడబేకు, పాయసా మాడబేకు, వడ, లడ్డూ, ఎల్లా మాడబేకు"(అన్నీ చెయ్యాలి) అని. కాఫీటిఫినూ ముందు చేసి, పైన చెప్పినవన్నీ తరువాత చేయడం మొదలెట్టమన్నారు రావుగారు.

రావుగారి ప్రసంగం అంతా విన్నాడు సుబ్బయ్య. "అన్నం మాడ్చచ్చు; పప్పు మాడ్చచ్చు; పాయసం కావాలంటే, అడుగున చెక్కుకట్టేలా మాడ్చచ్చు; కాని పప్పుపులుసు (బేడాహుళీ), రసం (చారు) ఎల్లా మాడ్చాలా అన్న పెద్దసమస్య వేధించటం మొదలుపెట్టింది సుబ్బయ్యను కాని, ఈ సందేహం రావుగారిముందు వెలిబుచ్చలేకపోయాడు; తాను గొప్ప వంటవాడుగనుక "ఇదికూడా తెలియని వంటవాడా?" అనుకుంటారని!

అందువల్ల అన్నింటికీ, బుర్ర ఎగరేశాడు సుబ్బయ్య.

"బేగా మాడప్పా ఎల్లా"(అన్నీ త్వరగా చెయ్యి బాబూ!) అంటూ రావుగారు అతిథులను ఆహ్వానించడానికి వాకిట్లోకి వెళ్ళిపోయారు.

* * *

"వెధవది! ఇన్ని సంవత్సరాలుగా వంట చేస్తున్నాను. ఎందరెందరో ఆఫీసర్లు సైతం నా వంట మెచ్చుకుని యోగ్యతాపత్రాలిచ్చారు. ఇన్ని సంవత్సరాల అనుభవంలోనూ చారూ, పులుసూ మాడ్చడం ఎరగనుగదా!......ఈ దెబ్బతో మనకు పరాజయం తప్పదు!..." చారు ఎలా మాడ్చడమా అని బిక్కమొగం పెట్టుకుని కూర్చుడిపోయాడు సుబ్బయ్య.

అసిస్టెంటు ఆలోచించి, ఆలోచించి "సుబ్బయ్యగారూ! నేనూ,

ఎందరో మీలాంటి పెద్దలవద్ద పని చేశాను గాని ఇలా అన్నీ మాడ్పు కోడం ఎరగను సుమండీ! అయినా, నాకో యోచన తోస్తోందండీ... బాగా మంటపెట్టి చూడండి...... మరి......వాళ్లు మాడ్పుకుంటూనే ఉండుంటారు; లేకపోతే మాడ్పమని ఎందుకు చెబుతారు?" అని పెద్ద విశేషం కనిపెట్టినవాడిలా ముఖం పెట్టి అన్నాడు.

సుబ్బయ్యగారు, మరి నాలుగు కట్టెలు అదనంగా పొయ్యిలో జేర్చి చారుపెట్టిన సత్తుగిన్నె అంతు కనుక్కోడానికి ప్రయత్నించారు! పొయ్యి అమోఘంగా మండిపోతోంది. అన్ని పదార్థాలూ తయారయాయి. కాని, చారూ, పులుసూ మాడితే వంటంతా పూర్తయిపోయినట్టే! దానికోసం ఎదురుచూస్తున్నాడు సుబ్బయ్యగారు. రావుగారి భార్యన్నా వస్తుందేమో ఆమెను ఈ విషయం రహస్యంగా అడిగి తెలుసుకుందామనుకున్నాడు. కాని, ఆమె పేరంటం గోడవలో ఈ ప్రక్కకే రాలేదు. ఏమి చెయ్యటానికీ తోచక, చారు, పులుసు ఎప్పుడు మాడుతుందా అని భగవద్ధ్యానం చేస్తున్నాడు సుబ్బయ్య!

ఇంతలో రావుగారు, "ఎల్లా మాడిఆయిత్తా అప్పా!" (వంటంతా అయిపోయిందా బాబూ) అంటూ వంటయిల్లు ప్రవేశించారు. వారి వెనకనే శాస్త్రీకూడా వచ్చాడు.

సుబ్బయ్యగారు, అప్పటికే నవనాడులూ క్రుంగటాన పేలవంగా ముఖంపెట్టి, "అన్నీ మాడినయ్ గాని, ఈ చారూ పులుసూ మాడేట్లు లేదు బాబూ!!" అన్నాడు.

అమాంతం హడలిపోయి శాస్త్రీ "అన్నీ మాడ్చేసేవేమిటి కొంప దీసి?" అన్నాడు ఆదుర్దాగా.

"లేదు బాబూ, అన్ని మాడాలని రావుగారే చెప్పారు. అందుకని అన్నీ సాధ్యమైనంత వరకూ మాడ్చాను" అన్నాడు సుబ్బయ్య!

"ఓరి నీ తస్సల్ చెక్కా! భలే వాడివయ్యా?! మాకందరికీ అపకీర్తి తెచ్చావుగదా!" అని నిర్ఘాంతపోయి చూస్తున్నాడు శాస్త్రీ. ఇంతలో శర్మ, మిగతా అతిథులూ వచ్చారు ఏమిటో చూద్దామని. రావుగారు నిర్విణ్ణులై నుంచుండిపోయారు.

వచ్చీ రాగానే అందరూ, అన్ని భోజనపదార్థాలూ, పరీక్ష చేశారు. ఒకటీ సవ్యంగా తయారుకాలేదు. అన్నీ—సుబ్బయ్య చెప్పినట్లు సగం మాడువే!! వంటంతా నాశనం చేసేశాడు. మిత్రులంతా ఒకరి మొగాలోకట చూసుకున్నారు "పాకవిశారద" చేసిన పనికి.

ఇంతలో శాస్త్రీ అందుకొని, "ఒరేయ్ అబ్బాయిలూ! సుబ్బయ్యగారెంత ఘటికులైనా, యిదంతా భాష తెలియనందువల్ల వచ్చిన బాధరా! ముందుగా మనే జాగ్రత్త పడాల్సిందిసుమీ" అన్నాడు తాను చేసిన తప్పు సర్దుకుంటున్నట్లు.

"ఒరేయ్ శాస్త్రీ! నువ్వూ, శర్మా కలిసి తెగపొగిడిన సుబ్బయ్యగార్ని మీరు సమర్థించకపోతే ఎవరు సమర్థిస్తార్లే?!" అన్నారు మిగతా వారు నవ్వుతూ.

తన కీనాడుజరిగిన పరాభవానికి తల ఎత్తుకోలేక ఒకమూల చదికిలబడ్డారు సుబ్బయ్యగారు! అసిస్టెంట్ అసలు నోరెత్తనేలేదు. పొయ్యి మీదున్న చారూ, పులుసూ దింపి క్రింద పెట్టబడినయ్! శాస్త్రీ, శర్మ నడుంకట్టి అందరికీ భోజనాల ఏర్పాటుకు మొదలుపెట్టారు—రావుగారిదంతా చూస్తూవుండిపోయారు.

ఏమయితేనేం వచ్చినవారంతా సగంమాడిన సామగ్రితోనే తృప్తి పడి, చిరంజీవిని ఆశీర్వదించి, రావుగారి దంపతులను అభినందించి మాడిన ముఖాలతో ఇళ్ళకు చేరారు. ★

7. ఎడారి డేగ

చెట్లు చేమలు, చెరువులు, దొరువులు లేని ఎడారిలో ఒక డేగ నివసిస్తూండేది. ఒకరోజున అది ఆకాశంలో బాగా ఎత్తుకు ఎగిరి చుట్టూ కలయ జూచింది. తూర్పున అనంతంగా విస్తరించిన మహాసముద్రం కనబడింది. ఉత్తరాన వందలకొలది మైళ్ళ మేర వ్యాపించిన కీకారణ్యం, పశ్చిమాన విడిపోతూ కలుసుకుంటూ నాట్యం చేస్తున్న మేఘసముదాయం, దక్షిణాన పచ్చనితివాచీ పరిచినట్లున్న పచ్చికమైదానం కనబడినవి.

అప్పుడు డేగ నీటికోసం తూర్పుగా ఎగిరి వెళ్ళింది. మూడు వేల మైళ్లు అలా ఎగిరిపోతేనేగాని సముద్రం రాలేదు. మళ్ళీ సాయంత్రం మూడువేల మైళ్లూ ఎగిరి వెనక్కి ఇంటికి రావలసివచ్చింది. మర్నాడు పుల్లలకోసం అడవికి వెళ్ళింది. పోను మూడు వేల మైళ్లూ, రాను మూడువేల మైళ్లూ ప్రయాణం చేసి రాత్రికి ఇంటికి చేరుకుంది. ఇక దక్షిణానికీ, పశ్చిమానికి పోవలసివస్తే ఆరేసి వేల మైళ్ళ ప్రయాణమూ, తప్పేది కాదు.

ఈ తిప్పటతో డేగకు క్షణం విశ్రాంతి ఉండేదికాదు. పైగా ఎంతో ఆయాసంగా ఉండేది. అప్పుడు తూర్పుసముద్రం ఇలా అంది:

“మిత్రుడా! ఎందుకిలా కష్టపడి ప్రయాణాలు చేస్తావు? ఇక్కడే ఉండిపోరాదూ? నా రాజ్యం చిన్నదనుకున్నావేమో? నాకు అద్భుతమైన ద్వీపాలున్నాయి. చిత్రచిత్రమైన పాములూ, చేపలు ఉన్నాయి. తుపాను చూడాలని ఉందా? కొంచెం ఆగు. ఇప్పుడొక పెనుతుపాను రాబోతోంది. చూడడానికి ఎంతో అందంగా ఉంటుంది. రాత్రిళ్లు నా ద్వీపాల్లో ఎక్కడైనా సరే ఏ గుహాలోనైనా సరే తలదాచుకోవచ్చు.”

డేగ ఇది విని “సరే, వెళ్లొస్తాను,” అని నీళ్లు తీసుకొని ఇంటికి వెళ్ళిపోయింది.

ఉత్తర దిక్కున అరణ్యంకూడా డేగతో ఇలా అంది: “అప్పుడే వెళ్ళిపోతున్నావేం, నేస్తం! పొద్దుగూకుతోంది. రాత్రికి ఇక్కడే ఉండిపో. చూడు, నా రాజ్యం ఎంత విస్తారమైనదో? దీని అవతలి హద్దును చేరినవాడింతవరకూ లేడు. నా ప్రజలు కూడా చాలా మంచివాళ్లు. వారిలో మగవారంతా నాట్యం చేస్తూ, ఆడవారంతా పాడుతూ కులాసాగా కాలం గడుపుతారు. కావలిస్తే నీకు ఎలుగుబంటిని, కోకిలను పరిచయం చేస్తాను. ఇక్కడే కొన్నాళ్లుఉండిపో. రాత్రిళ్లు ఎంత బావుంటుందనుకున్నావిక్కడ? కళ్లు మూసి నిద్రపోగానే, అనంతమైన అరణ్యస్వప్నం వస్తుంది. స్వప్నంలో నీకు కనిపించే వల్లా పచ్చని వసంతశోభలో, తెల్లని హేమంత సౌందర్యమో...”

అంతా విని డేగ “సరే మిత్రమా! వెళ్లొస్తాను,” అని ఒక పుల్ల నోట గరచుకొని అరణ్యంపై వలయంగా తిరిగి గిరుక్కున ఇంటిదారి పట్టింది.

కొలనులో పూచిన తెల్లని తామరపువ్వులవలె కనిపించే పశ్చిమ మేఘాలు డేగను ఎలాగైనా తమ వద్దనే ఉంచుకోవాలని ఎన్నో విధాల ప్రయత్నించాయి: “మిత్రమా! మాతో కలిసి ఇంకా కాసేపు నాట్యం చెయ్యి. ఈ మనోహర పశ్చిమాకాశం చివరంటా నాట్యమాడుతూ వెళ్లిపోదాము; ఇక తిరిగి రావద్దు. నువ్వు దగ్గిరుంటే మాకెంత సంతోషంగా ఉంది!”

కాని డేగ పశ్చిమ మేఘాలతో కొంచెంసేపు నాట్యం చేసి “వెళ్లొస్తాను. నిజమే. మీరు చాలా అందంగా ఉన్నారు,” అని యింటికి మరలిపోయింది.

దక్షిణ దిక్కున పచ్చిక మైదానం పచ్చని చీరె కట్టుకున్న వసంత సుదరిలాగా మెరిసిపోయింది.

“చెలికాడా! ఎందుకింత తొందరగావచ్చి తొందరగావెళ్లిపోతావు? కాసేపాగు. ప్రపంచంలోకల్లా అందమైనదేదీ అనే విషయమై నీతో చర్చించాలని చాల నాళ్లుగా అనుకుంటున్నాను,” అని డేగతో అన్నది.

“అవునవును. నిజమే. కాని నాకు పనుంది, వెళ్లొస్తాను. వసంతం చాలా అందమైనదే...”

చెట్టుగాని, చెరువుగాని లేక

ఎప్పుడూ శ్మశానం వలె పాడుపడి వుండే ఎడారిలో రాత్రిళ్ళు డేగ నిద్రపోయేది. పగలు చూసిన వింతలు మనస్సును ఆందోళన పరుస్తున్నందువల్ల బాగా నిద్రపట్టేది కాదు. అలా నిద్రపట్టని సమయాలలో డేగ అనుకునేది: "అబ్బ! ఒక్క క్షణం ఊపిరాడకుండా ఏం పనిచేస్తున్నానో నాకే తెలియడం లేదు. ఉత్తర దక్షిణాలు, తూర్పు పడమరలు ఎంత సుందరంగా ఉన్నాయి. అయినా ఈ ఎడారిని విడిచిపెట్ట బుద్ధి పుట్టడంలేదు. రాత్రి ఇక్కడ నిద్రపోతేనే గాని నాకు నిద్రపోయినట్టుండదు. తెల్లవారిన తరవాత ఒకసారైనా ఈ ఎడారిపై వలయాలు తిరిగితేనే గాని తోచదు నాకు. ఒకపని చేస్తే బావుంటుందనుకుంటాను. సముద్రపు జలాన్ని, అరణ్యపు వృక్షాలనూ, పశ్చిమ మేఘాలనూ, దక్షిణ వసంతాన్ని నా ఎడారిలోకే తీసుకువస్తాను. ఈ పని తలపెట్టానంటే ఇక నాకు కాస్తయినా తీరిక ఉండదు. ఏమైతే అదవుతుంది, ఈ పని చేసి తీరుతాను. చెయ్యగలనన్న విశ్వాసం నాకు ఉన్నది. నా ఎడారిలో సెలయేళ్ళ గలగలలు వినిపించే రోజు, పచ్చని పచ్చిక పట్టులూ, అందమైన పూల మొక్కలు పెరిగే రోజు తప్పక వస్తుంది. ఇది ఎన్నటికీ యథార్థం కాజాలని అసంభవ స్వప్నంలాగ కనిపిస్తే కనిపించవచ్చు. కాని ఇది స్వప్నంకాదు, సత్యం. అది తలుచుకుంటేనే నా ఒళ్ళు పులకరిస్తోంది."

డేగ తిరిగి తన ప్రయాణాలు సాగిస్తూనే ఉన్నది. అన్నిసార్లు అన్ని వేల మైళ్లు తిరుగుతూ ఉన్నా దానికి విసుగనిపించలేదు. ★

మన్నించిన మంచి

మూలం: **టాల్‌స్టాయి**

అనువాదం: **పి. వీరారెడ్డి**

పూర్వం మంచి ఉదారమైన హృదయం కలిగిన ఒక ధనవంతు డుండేవాడు. ఈలోకంలో లభించే వస్తువులన్నీ ఆయన ఇంట్లో వుండేవి. ఎందరో సేవకులు ఆయన క్రింద వుండేవారు. ఆ సేవకులు ఆయన్ను గురించి ఎంతో గొప్పగా చెప్పుకునేవారు.

"ఈ ప్రపంచంలో ఎక్కడా మన యజమానివంటివాడు లేనే లేడు. ఆయన మనకు అన్నవస్త్రాలిచ్చి పోషిస్తున్నాడు. మన శక్తికి సరిపోయిన పని మాత్రమే మనకు యిస్తాడు. ఎప్పుడూ మనలను కోప్పడడు, అసహ్యించుకోడు. ఈయన ఇతర యజమానులవంటివాడు కాడు. వాళ్ళంతా వారి సేవకులను పశువులకన్న హీనంగా చూస్తారు. ఎప్పుడూ ఆప్యాయంగా మాట్లాడరు. విచక్షణ లేకుండా శిక్షిస్తారు కాని ఈయన మనమంతా బాగుండాలని ఆశిస్తాడు. మనకు మంచి చేస్తాడు. ఆదరంగా మాట్లాడుతాడు. మనం యింతకన్నా గొప్ప జీవితాన్ని ఆశించనక్కర్లేదు" అని అనుకుంటుండేవారు. ఆ విధంగా ఆయన మంచితనాన్ని పొగిడేవారు.

ఇదంతా "అసూయా" భూతానికి తలనొప్పిగా వుంది. అంతటి ప్రేమతోటి, కలయికతోటి, వాళ్లుండటం దానికి యిష్టంలేదు. అందుచేత అది "ఆలబ్" అనే ఒక సేవకుణ్ణి తనవశం చేసుకున్నది. మిగతా సేవకులను పెడత్రోవలో పెట్టడానికి ఇతడిని ప్రేరేపించింది.

ఒకరోజున వాళ్లంతా విశ్రాంతి తీసుకుంటున్నారు. తమ యజమానినిగూర్చి మాట్లాడుకుంటున్నారు. అప్పుడు ఆలబ్ వాళ్ళతో: "మన యజమాని మంచితనాన్ని గురించి యింతగా చెప్పుకోవటం వట్టి తెలివి తక్కువ మాత్రమే. చేయమన్న ప్రతిపని చేస్తే రాక్షసుడు కూడ యిష్టంగానే వుంటాడు. ఆయనకు మనం బాగా సేవ చేస్తున్నాము. అన్ని విధాల సంతోషపరుస్తున్నాము. ముందుగానే ఆలోచించి ఆయనకు కావలసినవన్ని సమకూరుస్తున్నాము. అలాంటప్పుడు దయగా వుండక

మన్నించిన మంచి

మరేం చేస్తాడు? ఆయన్ని సంతోషపరచకుండా ఏదన్నా అపకారం చేసిచూడండి ఏం జరుగుతుందో? అపుడాయన ఇతర యజమానులకన్నా క్రూరంగా ప్రవర్తిస్తాడు. క్రియకు ప్రతిక్రియ చేసి తీరుతాడు. భయంకరంగా శిక్షిస్తాడు" అని అన్నాడు.

కాని సేవకులంతా ఆలబ్ మాటలను త్రోసిపారేశారు. మన యజమాని అలాంటివాడు కాడన్నారు. చివరకు ఆలబ్‌తో పందెం వేసుకున్నారు. ఆలబ్ యజమానికి కోపం వచ్చేటట్లు చేయడానికి కంకణం కట్టుకున్నాడు. పందెంలో తను ఓడిపోతే తన పండుగ దుస్తులు వదులుకోవాలి. మిగిలిన సేవకులు ఓడిపోతే వారి పండుగదుస్తులు వదులుకోవాలి. సేవకులంతా, ఆలబ్ ఓడిపోతే, అతడిని యజమానికోపంనుండి రక్షించడానికి ఒప్పుకున్నారు. జైల్లోవేసితే విడిపింపజేస్తామన్నారు. ఆలబ్ మర్నాడు ఉదయం తన యజమానికి కోపము తెప్పిస్తానని చెప్పాడు.

ఆలబ్ యజమానిదగ్గర గొర్రెల కాపరి. అతని అదుపులో మేలు జాతికి చెందిన, ఖరీదైన గొర్రెలు వుండేవి. అవంటే యజమానికి బహు ప్రేమ. మర్నాడు ఉదయం యజమాని తన అతిథులతో ఆ గొర్రెలను చూడడానికి వచ్చాడు. అపుడు ఆలబ్ "చూసుకోండి యిప్పుడు యజమానికి ఎంత కోపం తెప్పిస్తానో" అన్నట్లుగా కన్ను ఎగరవేశాడు.


సేవకులంతా ద్వారాలుగుండా, కంచెమీదుగా తొంగి చూస్తున్నారు. తన చే ప్రేరేపించబడ్డ ఆలబ్ ఏమి చేస్తాడో చూద్దామని "అసూయా"భూతం చెట్టు ఎక్కి కూర్చుంది. యజమాని అతిథులతో కంచె లోపలికి వచ్చాడు. రకరకాల గొర్రెలను, పొట్టేళ్ళను చూపిస్తున్నాడు. అంతలోనే ఆయనకు తన భిమానపాత్రమైన పొట్టేలును చూపించాలని బుద్ధి పుట్టింది.

"అన్ని పొట్టేళ్లు మంచి విలువగలవే కాని బాగా కండలు తిరిగినది ఒకటి వున్నది. దాని విలువ యింతఅని చెప్పలేను. దాన్ని నా 'కంటిలో పాప' లాగ చూసుకుంటాను" అని చెప్పాడు.

క్రొత్తవాళ్ళను చూడ్డంతోటే గొర్రెలన్ని చెల్లాచెదరుగా తిరగడం మొదలు పెట్టినయ్. అతిథులు వాటిని సరిగా చూడలేకపోయారు. అవి కాస్త నిలకడగా చేరబోయేసరికి ఆలబ్ వాటిని అప్రయత్నముగా జరిగినట్లు కలచివేశాడు. ఆ విలువగల పొట్టేలును అతిథులు గుర్తించలేక పోయారు.

యజమాని విసిగిపోయి "ఆలబ్ ఇట్లా రా!! మన మందలోని కండలు తిరిగిన మేలు పొట్టేలును జాగ్రత్తగా పట్టుకుని కాసేపు నిలకడగా వుంచు" అన్నాడు.

వెంటనే ఆలబ్ సింహం లాగ ఆ మందలో దూకేడు. ఆలబ్ ఒక చేత్తో ఆ విలువగల పొట్టేలు జూలును మెలివేసి పట్టుకున్నాడు. రెండవ చేత్తో వెనుక కాళ్ళను పట్టుకున్నాడు. తరువాత ఒక్క ఉదుటున దాన్ని పైకెత్తి విదిలించాడు. ఇంకేముంది, ఎండిన పెళుసుకొమ్మ విరిగి పడ్డట్లు క్రింద పడింది. కుడి కాలు విరిగిపోయింది. ఎడమ కాలు మెలితిరిగి పోయింది. పొట్టేలు



మోకాళ్ళ మీద పడిపోయింది. రక్తం ప్రవాహంలా కారుతోంది. అతిథులు, సేవకులు దుఃఖించారు. కాని "అసూయా" భూతం, ఆలబ్ ఈ పనిని తెలివిగా నెరవేర్చినందుకు సంతోషించింది. యజమాని మొహం కాలమేఘంలా నల్లబడింది. కళ్లు చిట్లించి తలవంచుకుని వున్నాడు. కాని ఒక మాట కూడా అనలేదు.

అతిథులు, సేవకులు నిశ్శబ్దంగా వున్నారు. ఏం జరుగుతుందోనని ఆందోళన పడుతున్నారు. కాసేపు అలా వున్న తరువాత యజమాని, బరువంతా దించేసినట్లు, ఒక విదిలింపుతో తల పైకెత్తేడు. ఆకాశంవైపు తదేకంగా కాసేపుచూశాడు. అంతలోనే ప్రశాంతమైన ముఖంతో ఆలబ్ వైపు చూస్తూ "ఓ ఆలబ్! నీ దేవుడు నాకు కోపము తెప్పించడానికి ప్రయత్నించాడు. కాని నా దేవుడు నీ దేవుడికన్న బలమైన వాడు. నాకు నీ పైన కోపము రాలేదు. కాని నీ దేవుడికి కోపము వచ్చేట్లు చేస్తాను. నేను నిన్ను శిక్షిస్తానని భయపడుతున్నావు. నీవు స్వేచ్ఛకోసం తహతహ లాడుతున్నావు. సరే ఆలబ్! నేను నిన్ను శిక్షింపను. నా అతిథుల ముందుండి చెపుతున్నాను: ఇకనుండి నీవు స్వేచ్ఛగా నీ యిష్టమున్న చోటికి పోవచ్చు. నీ పండుగ దుస్తులు కూడ నీవే తీసుకుపోవచ్చు" అని చెప్పి అతిథులతో సహా యింటికి మరలిపోయాడు.

కాని ఆ "అసూయా" భూతం, తన పరాజయానికి, పళ్లు కొరుక్కుంటూ చెట్టుమీదినుండి దొర్లి భూగర్భంలో క్రుంగిపోయింది.

★

దైవోపహతుడు

(12-వ పేజీ తరువాయి)

"దొంగ...అన్నీ మూటకట్టుకు ఎత్తుకుపోయింది. వుండు దీనికి బుద్ధిచెప్పి వస్తాను" అంటూనే వారించే కనకమ్మ మాటలు వినకుండానే తుఫానులా బయటపడ్డాడు రావు.

ఆ విసురువిసురు మంగమ్మగడప తొక్కేదాకా తగ్గనే లేదు. తాళం వేసివున్న తలుపు చూసిన తరవాతే కాంతారావు నిలబడిపోవటం జరిగింది.

ఆ పక్కింటివారిని వాకబు చేశాడు కాంతారావు.

"ఎవరింట్లోనో పెళ్ళిట......అందుకని ౨ గంటల కారుకే తిరువూరు వెళ్ళింది" అని చెప్పారు వారు.

నిర్ఘాంతపోయిన కాంతారావు అయిదు సెకన్ల కాలం అలాగే నిలబడిపోయి ఆతరువాత కాళ్ళీడ్చుకుంటూ యింటివేపు బయలుదేరాడు.

★

స్వీకారం

పుల్లాభొట్ల కథలు:—రచయిత: పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు; వెల 1-2-0. ప్రచురణ: యశోధరప్రచురణ; ప్రతులకు: శ్రీ పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు, హనుమకొండ, వరంగల్.

కథావాహిని 8:—రచయిత: పోలవరపు శ్రీహరిరావు; వెల: 1-0-0; ప్రచురణ: ఆదర్శగ్రంథమండలి, విజయవాడ.

కథావాహిని 9:—రచయిత: శారద; వెల 1-0-0; ప్రచురణ: ఆదర్శగ్రంథమండలి, విజయవాడ.

బాలచంద్రుడు:—వీరగాథ పద్యకావ్యము; కర్త జగన్నాథం సుబ్రహ్మణ్యము; వెల 0-8-0; ప్రతులకు జె. సుబ్రహ్మణ్యం, నం-24, అగ్రహారం వీథి, పెరియకుప్పం తిరువళ్ళూరు.

ఆర్థికవ్యవస్థ - రాజకీయాలు:—రచన అశోక మెహతా; అనువాదం యర్రమిల్లి నరసింహారావు; వెల 1-0-0; ప్రచురణ: రవీంద్ర పబ్లిషింగ్ హౌస్, తణుకు, ప. గో. జిల్లా.

నక్షత్రములు:—గ్రంథకర్త: గొబ్బూరి వేంకటానంద రాఘవరావు; వెల 2-8-0; ప్రతులకు సెక్రటరీ ఆంధ్రగీర్వాణ విద్యాపీఠ పాలక సంఘము, కొవ్వూరు, ప.గో.జిల్లా.

ఒకే కథ అనేక రకాలు:—కథా సాహిత్యానికి పాఠ్యగ్రంథము; కర్త పోలవరపు శ్రీహరిరావు; వెల 1-8-0; ప్రచురణ బిజిలీ పబ్లికేషన్స్, విజయవాడ.




ఆర్. బి. దేశాయ్ నిర్మించిన పౌరాణిక చిత్రం "వామన్ అవతార్" లో
బలిచక్రవర్తి భార్యగా నిరూపరాయ్.



"శ్రీ 420" చిత్రంలోని ఒక నృత్యగీతసన్నివేశంలో రాజ్‌కపూర్, నాదిరా.

★

జెమినీవారు భారీఎత్తున నిర్మిస్తున్న హిందీ "ఇన్సానియత్" చిత్రంలో బీనారాయ్, దేవ్ ఆనంద్.



బొంబాయి సినిమా లేఖ

భారత, పాకిస్థాన్ ప్రభుత్వాలు గత మాసం కరాచీలో జరిపిన వ్యాపార సంప్రదింపుల మూలంగా, గడచిన అయిదేళ్ళనుండి భారతీయ చిత్రాలపై పాకిస్థాన్‌లో అమలులోఉన్న దిగ్బంధం తొలగిపోయింది. భారతీయ వ్యాపార ప్రతినిధి వర్గానికి ప్రముఖ ఆర్థికవేత్త డా॥ లక్ష్మీకాంత ఝా నాయకత్వం వహించారు. భారతీయ చిత్రపరిశ్రమ తరఫున కె. ఎమ్. మోడీ, జైమని దివాన్, డి. ప్రమాణిక్, షెర్ అలీ ప్రత్యేకంగా కరాచీ వెళ్ళి ఒప్పందం కుదర్చడంలో భారతీయ ప్రతినిధులకు తోడ్పడ్డారు. ఆర్థికమంత్రి హబీబ్ రహ్మతుల్లా నాయకత్వాన చర్చల్లో పాల్గొన్న పాకిస్థాన్ ప్రతినిధివర్గానికి పాకిస్థాన్ చిత్రపరిశ్రమ తరఫున డబ్ల్యు. జడ్. అహ్మద్, ఎస్. ఫజ్లీ, ఎస్. ఎమ్. కజ్మీ, హుసేన్ బెగ్ మహమద్ తోడ్పడ్డారు. ఒప్పందంలోని షరతులివి:

పశ్చిమ పాకిస్థాన్‌లోకి దిగుమతి అయే భారతీయ చిత్రాలకు కోటా నిర్ణయించరాదు. క్రయవిక్రయ పద్ధతిమీదనే వ్యాపారం జరుగుతుంది. ఏ భారతీయ చిత్రానికీ 70 వేల రూ.లను మించి ధర పెట్టరాదు. ఈ ధర డబ్బురూపంలో చెల్లించగూడదు. భారతీయ చిత్రాన్ని ఒక పాకిస్థానీ నిర్మాత గాని, అతని ఏజంట్ గాని తీసుకుని తాను పాకిస్థాన్‌లో నిర్మించిన చిత్రాన్ని ఇచ్చివేస్తాడు. ఒక పాకిస్థానీ చిత్రానికి ఒక భారతీయ చిత్రంగాని, లేక ఇంకా ఎక్కువ భారతీయ చిత్రాలుగాని ఇవ్వవచ్చును.

తూర్పు పాకిస్థాన్ ప్రాంతానికి కోటా నిర్ణయించాలి. అక్కడకు భారతీయ నిర్మాతలు 7 హిందీ చిత్రాలను, 10 బెంగాలీ చిత్రాలను ఎగుమతి చేయవచ్చును. హిందీ చిత్రం ధర 30 వేలకు, బెంగాలీచిత్రం ధర 20 వేలకు మించరాదు. ఆ ప్రాంతానికి డబ్బు ఇచ్చి చిత్రాన్ని కొనుక్కోవచ్చు.

ఈనెల ఆఖరుకు ఈ ఒప్పందాన్ని ఉభయ ప్రభుత్వాలు ఆమోదిస్తాయని, వ్యాపారం సెప్టెంబరునుండి సాగుతుందని తెలుస్తోంది.

* * *

జైమని దివాన్‌చే ప్రారంభించబడిన స్వతంత్ర నిర్మాతల సంఘంలో ఇప్పుడు అరవైఇద్దరు నిర్మాతలు సభ్యులుగా చేరారు. అధ్యక్షుడు దర్శకనిర్మాత జ్ఞాన్ ముఖర్జీ ఇందుకు సభ్యులు విడిపోవడంతో అసలు సంఘం ఐ. ఎమ్. పి. పి. ఎ. బాగా బలహీనమైనది. అసలు ఈ తగాదాకు కారణం, ఐ. ఎమ్. పి. పి. ఎ. కార్యవర్గంలో ఒకేచిత్రం నిర్మించేనిర్మాతలకు సరియైన ప్రాతినిధ్యం లేకపోవడం. స్టూడియోయజమానులకు మాత్రం 8 స్థానాలున్నాయి. అయితే స్టూడియో యజమానులలో ప్రముఖులందరూ 'ప్రొడ్యూసర్స్ గిల్డ్' అనే ఒక సంఘాన్ని స్థాపించుకున్నారు. ఇంకా ఐ. ఎమ్. పి. పి. ఎ. లో స్టూడియోజమానులు కొద్దిమంది ఎవరైనా మిగిలిఉంటే, వారు స్టూడియోలను కౌలుకు తీసుకుని నిర్వహిస్తున్నవారేగాని చిత్రాలు నిర్మించేవారుకారు. వారైనా పదిమందికంటె ఎక్కువలేరు. ఈ భేదాభిప్రాయాలు ఇలాఉంచి, ఎస్. కె. పాటిల్ గారి నాయకత్వం వచ్చినతర్వాతకూడా ఐ. ఎమ్. పి. పి. ఎ. రాజీ ప్రయత్నాలు చెయ్యనేలేదు.

కాని ఈరెండుసంఘాల్లోనూ, స్వతంత్ర నిర్మాతలసంఘానికి ప్రభుత్వందగ్గిర పలుకుబడి ఎక్కువ అవుతున్నట్లు కనిపిస్తున్నది. ఈ సంఘం ఆలిండియా రేడియోతో అప్పుడే ఒడంబడిక కుదుర్చుకున్నది. రేడియో వారికి ఫిలింపాటలను ఇచ్చేవిషయమై ఐ. ఎమ్. పి. పి. ఎ. చేసిన నిషేధనిర్ణయం ఆ ఒడంబడికతో భగ్నమైపోయింది.



రెక్సోనా అందాలపోటీలో గెలిచినవారికి బహుమతులిచ్చేసందర్భంలో వుడ్‌లాండ్స్‌లో భరతనాట్యంచేసిన కుమారి రేణుక.



నేషనల్ ఆర్ట్ థియేటర్ వారి "జయసింహ" లో అంజలీదేవి, రేలంగి.

అదీగాక, గత మాసంలో స్వతంత్ర నిర్మాతల సంఘం ప్రతినిధులు కొందరు కేంద్రమంత్రి డా॥ కేస్కార్‌ను కలుసుకుని చిత్రపరిశ్రమ ఎదుర్కొంటున్న కష్టాలను తెలియజేశారు. దేశంలో కొత్త సినిమా మందిరాలు కట్టడానికి వీలు లేని పక్షంలో, విదేశీ చిత్రాలను ప్రదర్శించే మందిరాలలో నూటికి 33 వంతుల ప్రదర్శన కాలాన్ని భారతీయ చిత్రాలకు వినియోగించాలనే నిబంధన ప్రవేశ పెట్టడం మంచిదని వారు సూచించారు. పాకిస్థానీ చిత్రాల కోటాపద్ధతిలో అమెరికన్ చిత్రాలకు, తదితర దేశాలచిత్రాలకు కోటాపద్ధతిని ఏర్పాటు చేయాలని, ఆధునిక పరికరాలను దిగుమతి చేసుకొనేందుకు కొలంబో పథకం క్రింద అవకాశాలు కలిగించాలని కూడా వారు సూచించారు.

డా॥ కేస్కార్ ఈ సూచనలను జాగ్రత్తగా ఆలోచిస్తామని చెప్పినట్లు, ఈలోగా వాటిని రాష్ట్ర ప్రభుత్వాలకు పరిశీలనార్థం పంపినట్లు తెలుస్తున్నది.

*　　*　　*

ఆగస్టు 5వ తేదీన బొంబాయిలో రెండు చిత్రాలు విడుదల అయినవి. ఒకటి బిమల్ రాయ్ ప్రొడక్షన్స్‌వారి "అమానత్". ఇది చక్కని ఇతివృత్తం కలిగిన వినోదాత్మక చిత్రం. ప్రేక్షకులు కూడా ఈచిత్రాన్ని మెచ్చుకుంటున్నారు. దీని దర్శకుడు అరవింద్ సేన్. భారత్ భూషణ్, చాంద్ ఉస్మానీ, ప్రాణ్, నజీర్ హుసేన్, కన్నయలాల్ నటించారు. మొదటినుంచి చివరివరకూ లలితమైన హాస్యం ఉన్నది. నిజాయితీపరుడైన ఒకవ్యక్తి అనివార్య పరిస్థితులలోపడి తన స్నేహితునికిచ్చిన వాగ్దానాన్ని భంగంచేయడం కథలో ముఖ్యాంశం. హాస్యమూ, వ్యంగ్యమూ అడుగడుగునా ఉన్నాయి. ఇంగ్లండు, అమెరికా వెళ్లి వచ్చిన ధనవంతులు వేసే వెకిలి వేషాలను ఈచిత్రం వేళాకోళం చేస్తుంది. ప్రొడక్షన్ విలువలు బాగున్నాయి. దర్శకత్వం చాలా పటిష్ఠంగా ఉన్నది. బీదవారికీ, ధనవంతులకూ జరిగే ఘర్షణ శక్తివంతంగా చూపబడింది. నటులుకూడా చక్కగా నటించారు. అయితే సంగీతం ఏమీ బాగాలేదు. ఈలోపం మూలంగా ఈ చిత్రం రజతోత్సవం వరకూ నడవకపోవచ్చు. సలిల్ చౌధురి సంగీతదర్శకత్వం పాడుగా ఉన్న చిత్రాల్లో ఇది మూడవది.

రెండవచిత్రం జయంత్ దేశాయ్ నిర్మించిన "సతీ మదాలస". నిరూపరాయ్, మన్‌హార్ దేశాయ్, నిరంజన్‌శర్మ, హీరాసావంత్, కుమ్‌కుమ్ నటించిన ఈ చిత్రం టెక్నికల్‌గా పాడుగా ఉన్నది. సంగీతమూ, నాట్యాలు తగినంతగా లేవు. ఒక నెలరోజులు నడిస్తే నడవవచ్చునుగాని అంతకంటె ఎక్కువ కష్టమే.

(ఆంధ్రవారపత్రిక బొంబాయి విలేఖరి)


మద్రాసుకు జెకొస్లొవాక్ ఫిల్మ్ ప్రతినిధుల రాక

జెకొస్లొవాక్ ఫిల్మ్ ప్రతినిధు లిద్దరు ఈమధ్య మద్రాసు వచ్చారు. వీరు జెమినీ, వాహినీస్టూడియోలను దర్శించారు. ఆగస్టు 9వ తేదీ ఉదయం మిడ్‌లాండ్ టాకీస్‌లో మూడు జెక్ చిత్రాలను వీరు ప్రదర్శించారు. ప్రదర్శనకు పత్రికావిలేఖరులు, ఫిలిం వ్యక్తులు హాజరయ్యారు. ప్రదర్శించిన మూడుచిత్రాలలో రెండు హాస్యచిత్రాలు. చైనీస్ కళాకారులు జెకొస్లొవాకియాలో ప్రదర్శించిన "వానర చక్రవర్తి" బాలే నృత్యపు చిత్రం వీటిలో ఒకటి. రెండవది జెకొస్లొవాక్ "కీలుబొమ్మల చిత్రం" (పపెట్ ఫిల్మ్) మూడవది "ఎంపరర్స్ బేకర్" అనే పెద్ద చిత్రం. మూడూ వర్ణ చిత్రాలే.

కీలుబొమ్మలతో నడిచే ప్రదర్శనలకూ, కీలుబొమ్మలతో తీసిన చలనచిత్రాలకూ జెకొస్లొవాకియా ప్రసిద్ధిచెందినది. మిడ్‌లాండ్‌లో చూపబడిన కీలుబొమ్మల చిత్రం అమెరికన్ వైల్డ్ వెస్ట్ చిత్రాలకు పేరడీ చిత్రం.

కొండదారులో ఒక సుందరి పోతూ ఉండగా దొంగల నాయకుడు ఆమెను వెంటాడడం, ఆమెను ప్రేమించిన యువకుడు దొంగలనందరినీ హతమార్చి ఆమెను కాపాడడం దీనిలో ఇతివృత్తం. కీలుబొమ్మలతో దీనిని చిత్రించిన విధానం అపూర్వంగా ఉన్నది.

పెద్ద చిత్రం "ఎంపరర్స్ బేకర్" చక్కని కామెడీ. రెండవ రుడాల్ఫ్ చక్రవర్తి (17 వ శతాబ్దం) కాలంలోని కథ. చక్రవర్తుల తలతిక్క పద్ధతులను, దర్బారులలో జరిగే కుట్రలను వ్యంగ్యంగా విమర్శించే ఈ చిత్రం ఈ బాపతు అమెరికన్ చిత్రాలకన్న అన్నివిధాలా ఉత్తమంగా ఉన్నది. టెక్నికల్‌గా హాలీవుడ్ చిత్రాలకు తీసిపోని విధంగా, సిద్ధాంతరీత్యా వాటి కంటె ఎన్నోరెట్లు శ్రేష్ఠంగా ఉన్నది. విజ్ఞానశాస్త్రం బాగా వికసించని మధ్య యుగాలనాటి మూఢ నమ్మకాలపైనా, చక్రవర్తుల నిరంకుశత్వం పైనా ఎన్నో విసుర్లు ఉన్నాయి. ప్రకృతి శక్తులను వశపరచుకొని వాటిని మానవుడు జాతి వినాశానికి గాక, సౌభాగ్యానికి ఉపయోగించుకోవాలనేది ఈ చిత్రం ఇచ్చే ప్రధానసందేశం. ఆధునిక యుగంలోని అణుశక్తికి ప్రత్యామ్నాయంగా ఈ కథలో 'గోలెమ్' అనే యంత్రభూతం ఒకటి ఉంటుంది. ఆభూతం సర్వప్రపంచాన్ని దగ్ధం చేయగల శక్తికలది. దానిని ఎవడు వశపరుచుకుంటే వాడు భూమండలానికి అధిపతి అవుతాడు. చక్రవర్తి, అతనికింది తాబేదార్లు ఎవరికి వారే దాన్ని వశపరుచుకొని శక్తి సంపాదించాలని ప్రయత్నాలు చేస్తారు. చివరికి దాన్ని రొట్టెలు తయారుచేసి అమ్ముకునే బేకర్ ఒకడు వశపరుచుకుంటాడు. ఆ భూతం లోంచి వచ్చే అగ్నిని పెద్ద కొలిమిలాగా



జూపిటర్ వారి తెలుగు చిత్రం "ఇదేదారి"లో అంజలీదేవి, రామశర్మ.



"అనార్కలి" శతదినోత్సవసందర్భంలో విజయవాడ విజయ టాకీసులో తీసిన ఫొటో. పూర్ణాపిక్చర్సు అధినేత శ్రీ జి. కామరాజు, చిత్రదర్శకులు: శ్రీ వేదాంతం రాఘవయ్య, నటీనటకులు: నాగేశ్వరరావు, అంజలీదేవి. నిర్మాత: శ్రీ ఆదినారాయణరావుగారలు.

ఉపయోగించి, రొట్టెలు కాల్చడానికి వాడుతాడు. అసంఖ్యాకంగా, చవకగా రొట్టెలు ప్రజలకు సరఫరా అవుతాయి. అణుశక్తిని కూడా ఇలాగే లోక కళ్యాణానికి ఉపయోగించవచ్చునసేది ఇందులో ధ్వని. ఇదంతా ప్రతి అడుగూ హాస్యపూరితంగా చిత్రించబడింది.

ఈ జెకొస్లొవాక్ చిత్రాలు ఇక్కడ విడుదల కావడంలేదని తెలుస్తోంది.

ఫిలిం జర్నలిస్టుల సంఘ స్థాపన

"దక్షిణభారతఫిలిం జర్నలిస్టుల సంఘం" అనేపేరుతో ఒక కొత్తసంఘం ఈనెల 7వ తేదీన స్థాపింపబడింది. మద్రాసు పత్రికా రచయితల సంఘంవారి కార్యాలయం (8, నరసింగపురం వీధి, మౌంట్ రోడ్)లో జరిగిన సమావేశంలో సంఘ నిబంధనావళి ఆమోదించబడినతరువాత ఈ క్రిందివారితో కార్యవర్గం ఎన్నుకోబడింది:

అధ్యక్షుడు: టి. వి. రామనాథ్ (మెసుంపడం), ఉపాధ్యక్షుడు: టి. శ్రీనివాసరావు (వారదర్), కార్యదర్శి: పార్థ (స్పోర్ట్ ఎండ్ పాస్టయిమ్), సంయుక్త కార్యదర్శి: పి. వి. సుబ్బారాయుడు (ఆంధ్రపత్రిక), కోశాధికారి: కె. ఎస్. రామానుజం (హిందూస్థాన్ టైమ్స్). సభ్యులు: ఎస్. రామమోహనరావు (ఆంధ్రపత్రిక), టి. వి. సుదర్శనాచార్య (ఆంధ్రప్రభ), వాసుదేవన్ (స్క్రీన్), శ్రీనివాసన్ (స్వదేశమిత్రన్), కె. రాధాకృష్ణన్ (గుండూసి), జోసెఫ్ (దినతంతి).

ఈసంఘానికి ప్రారంభోత్సవం త్వరలో జరుగుతుంది.

"నలదమయంతి"

కన్నడనిర్మాత కెంపరాజ్ తెలుగు, కన్నడభాషలలో "నలదమయంతి" పౌరాణిక చిత్రం నిర్మిస్తున్నారు. భానుమతి, కెంపరాజ్, జయలక్ష్మి, రేలంగి, ముక్కామల, బంగర మున్నగువారు ఈ చిత్రంలో నటిస్తున్నారు. దర్శకుడు కెంపరాజ్. సంభాషణలు, పాటలు సముద్రాల రచిస్తున్నారు. 15 పాటలు రికార్డుచేయబడినవనీ, 20 రోజుల షూటింగ్ అయిందనీ తెలుస్తున్నది. భరణీ, రోహిణీ స్టూడియోలలో షూటింగ్ జరుగుతున్నది. డిస్ట్రిబ్యూటర్లు పూర్ణా పిక్చర్సవారు.

విజయవాడలో "అనార్కలి" శతదినోత్సవం

అంజలీ పిక్చర్సు వారిచిత్రం "అనార్కలి" శతదినోత్సవం ఆగస్టు 6వ తేదీన విజయవాడ విజయా టాకీసులో జరిగింది. ఉత్సవ సభకు యస్.ఆర్.ఆర్. అండ్ సి.వి.ఆర్. కళాశాల ప్రిన్సిపాలు శ్రీ తెన్నేటి సూర్యనారాయణరావుగారు అధ్యక్షత వహించారు.

కుమారి కనకదుర్గ ప్రార్థనతో సభ ప్రారంభమయింది.

నాయికా నాయకులు శ్రీమతి అంజలీ



మోడరన్ థియేటర్స్‌వారి గేవాకలర్ తెలుగుచిత్రం "అలీబాబా, నలభైమంది దొంగలు"లో ఒక దృశ్యం.

సేవి, శ్రీ నాగేశ్వరరావుగారలు, నిర్మాత శ్రీ ఆదినారాయణరావు, దర్శకులు శ్రీ వేదాంతం రాఘవయ్య, కవి శ్రీ సముద్రాల రాఘవాచారిగారలు ఈ సభలో పాల్గొన్నారు.

పూర్ణా పిక్చర్స్ అధినేత శ్రీ జి. రామరాజుగారు, విజయా టాకీసు అధినేత శ్రీ పుండరీకాక్షయ్యగారలు వారలకు స్వాగతం చెప్పారు.

శ్రీయుతులు దుగ్గిరాల బలరామకృష్ణయ్య, ఉన్నవ రాజగోపాలకృష్ణయ్యగారలు ప్రసంగించారు.

నటీనటవర్గానికి, చిత్రనిర్మాత దర్శకులు, రచయితలకు విజయ టాకీసు తరఫున సన్మానపత్రం సమర్పించబడింది. (స్వ. వి.)

"రోజులు మారాయి" శత దినోత్సవాలు

సారథివారి 'రోజులు మారాయి' చిత్రం విడుదలయిన 17 కేంద్రాలలో శత దినోత్సవాలు జయప్రదంగా జరుపుకున్నది. బహుశా ఇన్ని కేంద్రాలలో ఇలా శత దినోత్సవాలు జరుపుకోవటం ఇదే ప్రథమమేమో!

విజయవాడ మారుతీసినిమా హాలులో ఈ నెల 7 వ తేదీన ఆంధ్రప్రభుత్వ ఉపముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారి అధ్యక్షతన ఈ శత దినోత్సవాలు జరిగినవి.

చిత్ర నిర్మాతలు సారథి సంస్థ అధినేతలు శ్రీ యార్లగడ్డ రామకృష్ణప్రసాదు, సి. వి. ఆర్. ప్రసాదుగారలు, దర్శకుడు శ్రీ తాపీ చాణక్య, సంగీత దర్శకులు శ్రీ వేణు, కవులు శ్రీ కొసరాజు, కొండేపూడి లక్ష్మీనారాయణ, నాట్యాచార్యులు శ్రీ వెంపటి, కళా దర్శకులు శ్రీ సి. హెచ్. ప్రసాదు, ఎడిటర్లు శ్రీ సంజీవి, తిలక్, కెమెరామన్, శ్రీ కమల్‌ఘోష్, నటీనటవర్గం శ్రీ నాగేశ్వరరావు, రేలంగి, సి. యస్. ఆర్. పెరుమాళ్లు, రమణారెడ్డి, సీతారాం, నరసింహారావు, జానకి, వహీదా, హేమలత గారలు ప్రఖ్యాత దర్శకులు శ్రీ యల్. వి. ప్రసాద్, బి. ఏ. సుబ్బారావు తదితర ప్రముఖులు ఈ ఉత్సవాలలో పాల్గొన్నారు.

నటీనటవర్గానికి, టెక్నీషియన్లకు నిర్మాతలకు, సన్మానపత్రాలు సమర్పింపబడినవి.

బహుమతి ప్రదానం శ్రీ యల్. వి. ప్రసాద్ గారు చేశారు.

డిస్ట్రిబ్యూటర్లు శ్రీ నవయుగ ఫిలిమ్సు తరఫున నిర్మాతలకు, హాలు యాజమానులకు బహుమతులు యివ్వబడినవి.

నిర్మాతలు ఈ చిత్రవిజయానికి తోడ్పడ్డ ప్రతివారిని పేరు పేరున కొనియాడి ఉచిత రీతిని బహుమతుల నిచ్చి సత్కరించారు. నాగేశ్వరరావు, రేలంగి, జానకి, వహీదా గారలకు సువర్ణ కంకణములనిచ్చి సత్కరించారు.

మారుతీ సినిమాహాలులో పనిచేసేవారందరికి నెలజీతం బహుమతిగా యిస్తూ నిర్మాతలు ప్రకటించారు.

శ్రీ దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారు ప్రసంగిస్తూ 'రోజులుమారాయి' చిత్రంలోని సన్నివేశాలను, పాత్రపోషణను మెచ్చుకున్నారు.

సన్మానితులు ఉచితరీతిని సమాధానం చెప్పారు.

మారుతీసినిమా తరఫున శ్రీ పోతిన గణపతిరావు పాత్రుడుగారు వందనములు సమర్పించారు. (స్వ. వి.)

Printed and Published for Nageswara Rao Estates Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor : S. Sambhu Prasad.